1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 11
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2020

చామదేవి...

ఏడో శతాబ్దికి చెందిన
థాయిరాణి.
ఉత్తర థాయిలాండ్లో
రాజ్యాన్ని స్థాపించిన
తెలుగుమహిళ...
ఆరు శతాబ్దాలపాటు
హరిపుంజాయి రాజ్యాన్ని
చామదేవి వారసులు
పరిపాలించారు.
వారిలో నూకరాజు, దాసరాజు,
గుత్త...ప్రముఖ చక్రవర్తులు.
వీళ్లు తెలుగువాళ్లే.
థాయిలాండ్ ఎక్కడ, తెలుగు
నేల ఎక్కడ? ఇక్కడి నుంచి
ఎప్పుడు...ఎవ్వరు...ఎలా
వెళ్లారు? నేటికీ ఉత్తర థాయి
ప్రజల ఆరాధ్య దేవత
చామదేవి! ఆ దేశంలో
బుద్ధుడి తరవాత అంతటి
పూజలు అందుకుంటున్నారు
ఆమె సమాధినీ చూడవచ్చు.
థాయిలాండ్లో తెలుగు
మూలాలుండడం
మన జాతికే గర్వకారణం.
ఆ కథ ఏమిటో తెలుసు
కోవాలాంటే ఈ సంచికలో
'జగమునేలిన తెలుగు'
చదవాల్సిందే?



అమ్మనుడుల వికాసానికై జాతీయవిధానం కావలసిందే

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



జనవరి 2020

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

కార్టూన్లు	రేఖాచిత్రాలు	కంప్యూటరీకరణ
సరసి	**పావులూరి చిదంబరేశ్వరరావు**	**లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్ట్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

	వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా :	రూ.5000	రూ.7500	--
5 సం॥ :	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥ :	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥ :	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సందేమార్కెట్, **నెల్లూరు**-1.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకు నేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

మాతృభాషా మాధ్యమం కోసం సత్యాగ్రహం



మాతృభాషా మాధ్యమాన్ని పూర్తిగా తొలగిస్తూ నవంబర్ నెలలో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడాన్ని నిరసిస్తూ 30 సంఘాలతో మాతృభాషా మాధ్యమ వేదిక' ఏర్పడిన సంగతి పాఠకులకు తెలిసిందే.

ఆ సంఘాల ప్రతినిధులు సుమారు 50 మంది డిసెంబరు 11వ తేదీన విజయవాడలోని ధర్నాచౌక్‌లో 'సత్యాగ్రహం' చేశారు. కార్యక్రమనికి ఎం.ఎల్.సి విఠపు బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. శాసన మండలిలో పిడిఎఫ్ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, కత్తి నరసింహారెడ్డి, పి.రఘువర్మ, ఇళ్ల వెంకటేశ్వరరావు కూడా పాల్గొని ప్రసంగించారు. తొలుత విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే దీన్ని గ్రామాల స్థాయి నుంచీ ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తామని, రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలను, రచయితల, సాహిత్య, సాంస్కృతిక సంఘాలతోపాటు, మేధావులను, ప్రజా ఉద్యమాలలో క్రియాశీలురను అందరితో రాష్ట్ర వ్యాపిత ఉద్యమాన్ని నడుపుతామని ప్రకటించారు. వేదిక సారధ్య సంఘ సభ్యుడైన తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు జాతిని అణగదొక్కడానికి అనేక శతాబ్దాలుగా కుట్రలు సాగుతున్నాయని, భాషా రాష్ట్రాలు ఏర్పడ్డ తర్వాత ఈ కుట్రలు కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయని, ఇప్పుడు ఇవి కనిపించని కుట్రలుగా మారాయని అన్నారు. ప్రస్తుత పాలక వర్గాలు, ప్రభుత్వాలు ఈ కుట్రల్ని నడుపుతున్నాయని, వీటికి పరాకాష్ట – తెలుగును బోధనా మాధ్యమంగా రద్దు చేయడమే అని వివరించారు. అంటే వేల యేండ్ల చరిత్ర కలిగి ఎంతో అభివృద్ధి చెందిన తెలుగు బోధనకు పనికిరాని భాషగా స్వంత పాలకులే నిర్ణయించడం జాతికి ద్రోహం తలపెట్టడమే అని, ఇందుకు వ్యతిరేకంగా మనం పోరాడాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఇంగ్లీషు నేర్చుకోవద్దని ఎవరూ చెప్పరనీ, దాన్ని ఎంత వరకు నేర్వాలి అనేది తెలుసుకోవడం ముఖ్యం అని అన్నారు.

వేదిక సారధ్య సంఘ బాధ్యులు కొత్తపల్లి రవిబాబు, డాక్టర్ పరిమి, పెనుగొండ లక్ష్మీనారాయణ, రమేష్ పట్నాయక్, వరప్రసాద్ లతో పాటు, పాల్గొన్న అన్ని సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. మాతృభాషా మాధ్యమ వేదిక శాఖలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో విస్తృతంగా ఏర్పాటు చేయాలని, ప్రజలందరికి ముఖ్యంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా అందరూ కృషి చేయాలని విద్యార్థులను వివిధ సంఘాలను, సామాజిక సంస్థలను కూడా కలుపుకుపోవాలని పలువురు వక్తలు సూచించారు.

జనవరి 3 నుండి 12 వరకు విజయవాడలో జరగనున్న '31వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఈ అంశంపై ప్రజల్లోకి వెళ్లి చైతన్య పరచేందుకు మాతృభాషా మాధ్యమవేదిక నిర్ణయించింది. పుస్తక మహోత్సవంను సందర్శించనున్న వేలాది చదువరులు సహకరించాలని, వేదిక విజ్ఞప్తి చేస్తున్నది.



ఆంగ్లమాధ్యమంపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం:

విద్యాహక్కు చట్టానికీ, 'సుప్రీం' తీర్పునకు విరుద్ధంగా జీవో

అభిప్రాయం వ్యక్తం చేసిన ధర్మాసనం: జనవరి 27న విచారణ

ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంస్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న ఉత్తర్వులు తమ ఆదేశాలకు లోబడి ఉంటాయని సర్కారుకు హైకోర్టు స్పష్టం చేసింది. ఆంగ్ల మాధ్యమం అమల్లో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ, ఆంగ్ల పాఠ్యపుస్తకాల ముద్రణ తదితర చర్యలకు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తే, బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆ సొమ్ము రాబడ తామని పేర్కొంది. ప్రాథమికంగా చూస్తే ప్రభుత్వ జీవో విద్యాహక్కు చట్టం, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని వ్యాఖ్యానించింది. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి, కమిషనర్, రాష్ట్ర ఎడ్యుకేషనల్ రిసెర్చ్, ట్రైనింగ్ కౌన్సిల్ డైరెక్టర్, కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి, సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్, విద్యా పరిశోధన, శిక్షణ రాష్ట్ర మండలి (ఎస్సీఈ ఆర్టీ) డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులపై 'స్టే' ఎందుకు ఇవ్వకూడదో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. వ్యాజ్యా లను విచారణకు స్వీకరిస్తూ, ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 27కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం. వెంకటరమణతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం (2020-21) 1వ తరగతి నుంచి 6 వ తరగతి వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టేందుకు వీలుగా నవంబరు 20న రాష్ట్ర ప్రభుత్వం జీవో 85 జారీ చేసింది. దానిని సవాలు చేస్తూ తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలం రావిపాడు గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, భాజపా నాయకుడు రాంభొట్ల శ్రీనివాస సుధీర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ హైకోర్టులో వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు.

మాధ్యమాన్ని ఎంపిక చేసుకొనే హక్కు విద్యార్థులకు ఉంది : న్యాయవాదులు

పిటిషనర్ల తరపు న్యాయవాదులు అనూప్ కౌషిక్, కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపిస్తూ... 'ప్రభుత్వం జారీ చేసిన జీవో వల్ల తెలుగు మాధ్యమం కనుమరుగై ఆంగ్లమాధ్యమం అమల్లోకి వచ్చే పరిస్థితి ఉంది.

మాతృభాషలో మాధ్యమాన్ని ఎంపిక చేసుకొనే హక్కు విద్యార్థులకు ఉంది. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛలో భాగంగా...మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం కూడా ఇమిడి ఉంది. మాధ్యమాన్ని ఎంపిక చేసుకునే హక్కు లేకుండా చేయడం విద్యార్థుల హక్కులకు భంగంకలిగించడమే. ప్రభుత్వ జీవో రాజ్యాంగం కల్పించిన హక్కులపై నిషేధం విధించేలా ఉంది. కేంద్రం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 29(2) (ఎఫ్) ప్రకారం విద్యార్థులకు బోధించే మాధ్యమం మాతృభాషలో ఉండాలని స్పష్టం చేస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడుతూ ప్రభుత్వం జీవో తీసుకు రావడం తగదు. మాతృభాషలో విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ...వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్య మాన్ని ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. కౌంటర్ దాఖలు చేయ డానికి గడువు ఇవ్వాలని కోరారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం...ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయబోతున్న సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ ఆంగ్ల మాధ్యమం అమలు చేసేది వచ్చే విద్యా సంవత్సరం అయినా...ఈలోగా పాఠ్య పుస్తకాల ముద్రణ, ఉపాధ్యాయులకు శిక్షణ తదితర కార్యక్రమాలు చేపట్టబోతున్నారని, తద్వారా ప్రజాధనం వృథా అవుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో 'యథాతథస్థితి' ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

సొమ్ము వృథా చేయడం ఎందుకు? ధర్మాసనం

ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ప్రభుత్వం వద్ద డబ్బులులేని పరిస్థితుల్లో సొమ్ము వృథా చేయడం ఎందుకని ప్రశ్నించింది. ఏజీ మాట్లాడుతూ 'ఆచరణ సాధ్యమైన మేరకు మాత్రమే మాతృభాషలో బోధన ఉండాలని' విద్యాహక్కు చట్టం చెబుతోంద న్నారు. ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందన్నారు. అందుకు ధర్మాసనం స్పందిస్తూ ఎక్కువగా వాదనలు వినిపిస్తే జీవోపై 'స్టే' ఇవ్వాల్సి ఉంటుందని ఘాటుగా వ్యాఖ్యానిం చింది. నోటీసులు జారీ చేస్తూ ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది.

('ఈనాడు' సౌజన్యంతో...)

సంపాదకీయం

అమ్మనుడుల వికాసానికై జాతీయవిధానం కావలసిందే

పాఠశాల విద్యలో ఇంగ్లీషును మాత్రమే బోధనామాధ్యమంగా నిర్ణయించి, ఈ ప్రక్రియను రానున్న విద్యా సంవత్సరం నుండే అమలుపరచాలని ఆదేశిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన రెండు ఉత్తర్వులనూ రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రమంతటా విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలూ భాషోద్యమకారులూ, సామాజిక ఉద్యమకారులూ మేధావులూ రెండు నెలలుగా ఉద్యమిస్తున్నారు. అయినా ప్రభుత్వం మొండికేసి, తన నిర్ణయం అమలుకే ముందుకు సాగుతున్నది. ఈ సందర్భంలో – పై ఉత్తర్వులను రద్దు చెయ్యాలని కోరుతూ ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు ధర్మాసనం అనుమతించడమేగాక కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఉద్యమకారులకూ, ఆలోచనాపరులైన ప్రజలకూ ఊరట కలిగించింది. అంతేగాక, ప్రభుత్వ ప్రతినిధి ఈ తరుణంలో ఎక్కువగా వాదిస్తే – జి.వో.ల అమలుపై 'స్టే' విధిస్తామని హెచ్చరించారు. విచారణను జనవరి 27కు వాయిదా వేసి, ఉత్తర్వులిచ్చే లోపల జి.ఒ.ల అమలుకు సంబంధించి ప్రభుత్వం ఖర్చులేంపెట్టినా, వాటిని సంబంధిత అధికారులనుంచి రాబడతామని హెచ్చరించి, ప్రభుత్వ దూకుడుకు కళ్లెం వేశారు.

ఇక్కడ ఉద్యమకారులు గమనించవలసిన అంశాలున్నాయి. ఒకవేళ కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చి, జిఒలు 81, 85 రద్దయి, యథాతథ స్థితిని కొనసాగినా, ఈ సమస్య స్వభావంలో ఏమీ మార్పు రాదు. ఇంతకు ముందటి ముఖ్యమంత్రిగారి హయాంలో 2016 ఫిబ్రవరిలో ఇచ్చిన జి.ఒ.నెం : 14 కూడా ఇలాంటిదే. అయితే అప్పుడది మునిసిపాలిటీలకు మాత్రమే పరిమితమయింది. దానిపై మనమంతా చేసిన ఉద్యమాలతో కొంతవరకు దిగివచ్చిన ముఖ్యమంత్రి ఆ జి.ఒ. అమలును ఆపేస్తున్నామని ప్రకటించినా, అధికారుల ద్వారా ఉపాధ్యాయులను, తల్లిదండ్రులనూ బెదరించి తమ పట్టును కొనసాగించారు. తెలుగు మాధ్యమంలో ప్రవేశాలను అడ్డుకున్నారు. ఇప్పుడిదే వ్యూహాన్ని రాష్ట్రస్థాయిలో నేటిపాలకులు సాగించి ప్రజలు తెలుగు మాధ్యమాన్ని కోరుకోవడంలేదనే అసత్యాన్ని నిర్మాణం చేస్తారని మనం గ్రహించాలి. ఇప్పుడు జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆంగ్లమాధ్యమం కోసం తామంటే తామే ముందుగా నడుం బిగించినట్లు చంద్రబాబుగారూ జగన్మోహనరెడ్డిగారూ వాదించుకోవడాన్ని గమనించండి. మాజీ ముఖ్యమంత్రి అధికారంలో ఉండగా, తెలుగు భాషాదినోత్సవ (గిడుగు జయంతి) వేదికపై చేసిన ప్రసంగంలోనే– తెలుగు విద్యార్థులను ఆంగ్లమాధ్యమం వైపుకు ప్రోత్సహించడాన్ని తన ఘనతగా ప్రకటించుకొన్న సంగతిని మనం మరువరాదు. కనుక – ఈ ఇద్దరి మధ్య ఆంగ్ల మాధ్యమం విషయంలో పెద్ద తేడా ఏమీ లేదని మనం గ్రహించాలి. కాకపోతే – తన 'నవరత్నాల' కార్యక్రమంలో పేర్కొనకుండానే దీన్నొక స్పష్టమైన రాజకీయ అంశంగా చేసి, ప్రచారంలోకి తీసుకువెళ్లి, సామాన్య ప్రజల భ్రమలను మరింత పెంచి, రాజకీయంగా లాభం పొందిన వ్యూహకర్త నేటి ముఖ్యమంత్రి. ఈ అంశంలో చంద్రబాబుకు అంత ఆలోచనా స్పష్టత లేకపోయింది. ఇలాంటి అంశంలో కోర్టు తీర్పు తమకు వ్యతిరేకంగా వచ్చినా, ఏదో ఒక విధంగా తన నిర్ణయాన్ని అమలు చేయడానికే నేటి ముఖ్యమంత్రి పూనుకొంటారు.

కనుక – మాతృభాషా మాధ్యమ అవసరాన్ని బలంగా ముందుకు తీసుకుపోవడానికై పెద్దఎత్తున ప్రజల్లోకి వెళ్లాలి. ప్రజల్లోని గందరగోళస్థితిని, ఆంగ్లమాధ్యమం పట్ల మోజును తొలగించి, స్పష్టమైన అవగాహనను కలిగించడానికి మనం దీర్ఘకాల కృషి సాగించాలి. ఇదే సమయంలో పాలకవర్గాలతో నిరంతర పోరాటాన్ని కొనసాగించాలి.

ఇక్కడ రెండు పార్టీలనే ప్రస్తావించుకొన్నాం. అంతమాత్రాన, తక్కిన రాజకీయ పార్టీలకు ఈ విషయంపై స్పష్టమైన విధానాలున్నాయని కాదు. విద్యా, పాలనారంగాల్లో అమలుపైనా భాషాజాతి, భాషారాష్ట్రం అనే అంశాలపైనా స్పష్టమైన విధాన ప్రకటన చేసి మరీ రాజకీయరంగం లోకి ప్రవేశించిన తెలుగుదేశం పార్టీ, ఎన్టీరామారావు తర్వాత గడచిన

చరిత్రనంతా మనం చూశాం. దాని పతనాన్ని కూడా మనం చూశాం. ఆ పార్టీ అన్ని అంశాలలో నిబద్ధతను కోల్పోయిందని ప్రజల్లో ఒక బలమైన అభిప్రాయం పాదుకొనడమే, ఆ పార్టీ పతనానికి కారణం.

ఈ రెండు పార్టీలే కాదు, రాజకీయ రంగంలో వున్న ఏ పార్టీ ఐనా ఆర్థికాంశాలతోపాటు, సామాజిక, సాంస్కృతికాంశాల మీద కూడా స్పష్టమైన విధానాలను కలిగివుండాలి. అందులో 'భాషా రంగం' కీలకం. మాతృభాషను నెత్తిన మొయ్యాలనటాన్ని ఉద్వేగాంశం (సెంటిమెంట్) గా కొట్టివేయడం అజ్ఞానానికి పరాకాష్ట. తన అస్తిత్వానికి కారణమైన అంశాలను ఏ సమాజమూ వదులుకోదు. రాజుల రాజ్యాల్లో హెచ్చుతగ్గుల కులవ్యవస్థ విధించిన గీతల మధ్య బతికిన రోజులు కావు ఇవి. ఇప్పుడందరికీ చదువులు కావాలి. ఏ రంగంలోకైనా ప్రవేశించే స్వేచ్ఛ, అవకాశాలు కావాలి. వాటికీ సమర్థవంతమైన భాషగా మాతృభాషలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు కట్టుబడాలి. అందుకోసమే భాషారాష్ట్రాలు ఏర్పాటును గౌరవిస్తూ మన రాజ్యాంగం ఏర్పడింది. ఈ విషయాల్లో ఎక్కడ తేడా వచ్చినా అది మళ్లీ ఎక్కువ తక్కువ కులభావనలు, ఆర్థిక, సామాజిక ఆధిపత్య వాదాలూ, ప్రతిఘటనలూ ఉంటాయి. ఇవన్నీ రాజకీయాలను ప్రభావితం చేస్తూనూ ఉంటాయి.

ఇప్పుడు పార్టీలు, ప్రభుత్వాలు తెలుగు ప్రజలతో ఆడుతున్న చెలగాటం ఒక విస్ఫోటనాత్మక దశకు చేరుకొంటున్నది. సమైక్య తెలుగు భాషారాష్ట్రం ఏర్పాటైనప్పటి నుండీ, రెండుగా చీలిన తర్వాతకూడా ఏర్పడుతున్న పరిణామాలు ఇందుకు సాక్ష్యం పలుకుతున్నాయి.

ఈ పరిణామ దశలో ఇప్పుడు మనం ఉన్నాం. తెలుగుదేశం, వైకాపా రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. (తెలంగాణ కూడా ఈ తానులో గుడ్డే అయినా అక్కడి పరిస్థితులను–ఉద్యమాల నేపథ్యం కారణంగా కొంత ప్రత్యేకంగా ఆలోచించవలసి వుంటుంది.) అయితే, ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదనీ మొత్తం భారతదేశానికి సంబంధించినదిగా భాషారాజకీయాల సమస్య పరిణమించే బలాన్ని కలిగివుందనీ విజ్ఞులు గ్రహించాలి. ఈ పరిణామాలన్నిటికీ సహజ ప్రయోగశాలగా ఆంధ్రప్రదేశ్ కానున్నదనే స్పృహతో ముందుకు సాగవలసివుంటుంది. దురదృష్టవశాత్తు – ప్రపంచ ఆధిపత్య శక్తులతోపాటు, దేశీయ ఆధిపత్య శక్తులు కూడా మన సమాజంలో అన్ని రంగాల్లోనూ వేగంగా తమ ప్రభావాన్ని పెంచుకొంటున్నాయి. ఇందులో ఆర్థికశక్తులతోపాటు మతశక్తులు కూడా దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. భాషా సాంస్కృతిక అంశాలు కూడా జన జీవనానికి సంబంధించినవి గనుక, అవి కూడా ఈ తాకిడికి గురి అవుతున్నాయి.

మన రాజకీయ పార్టీలూ ఉద్యమకారులూ పౌరసంఘాలూ ఈ అంశాలను సమగ్ర అధ్యయనం చెయ్యాలి. సామాజిక, భాషా సాంస్కృతిక అంశాలను పట్టించుకోకుండా, ఆర్థికాంశాల పరిష్కారానికై చేసే కృషి ఏదీ మన నేలపైన సఫలం కాదు.

మళ్లీ మొదటికి వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో అమ్మభాషల ప్రయోజనం, వాటి అస్థిత్వం, భాషాజాతుల అభివృద్ధి అగ్ని పరీక్ష నెదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితికి మన పాలకవర్గాల రాజకీయాలు కారణమవుతున్నాయి. ప్రభుత్వాలు ఇంగ్లీషును మాత్రమే భాషామాధ్యమంగా అధికారికంగా ప్రకటిస్తూ జి.ఒ ఇవ్వడంతోపాటు, ఒక చట్టంగా కూడా తేవాలని ప్రయత్నాలు మొదలుపెట్టడం అంటే – మన మాతృభాష, అధికారభాష తెలుగును (దీనితోపాటు రాష్ట్రంలోని అన్ని మాతృభాషలనూ) పనికిమాలినవిగా ప్రకటించినట్లే.

ప్రాథమికస్థాయి చదువు నుండీ పనికిరాని మాతృభాషలు అధికార భాషలుగా పాలనారంగంలో మాత్రం పనికివస్తాయా? ఇప్పటికే పరిపాలన అంతా 80శాతంపైగా ఆంగ్లంలోనే సాగుతున్నది! ఇక ఇది తెలుగురాష్ట్రం ఎలా అవుతుంది? కనుక – ఆంధ్రప్రదేశ్‌ను ఆంగ్లప్రదేశ్‌గా మారుస్తారా అని గత ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు, ఇప్పుడా పనిని పూర్తి చేస్తున్న ఈ ముఖ్యమంత్రిగారి ముందు కూడా ఆ ప్రశ్నను ఉంచాలి.

ఇంతకూ – ఇప్పుడు ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం ఏం చెయ్యబోతున్నది? మన రాజ్యాంగంలో 'విద్య' ఉమ్మడి జాబితాలో ఉంది. మాతృభాషల విషయంలో రాజ్యాంగం చెప్పవలసినవెన్నో చెప్పేసింది. విద్యాహక్కు చట్టమూ చెప్పింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ముందడుగు వేశాయి. కాని, రాజ్యాంగంలోనే ఉన్న 'హక్కుల' రక్షణ అంశాన్ని అడ్డుగా చూపి – భాషను నిర్బంధం చెయ్యకూడదనే తీర్పును సుప్రీంకోర్టు ఒక సందర్భంలో ఇచ్చివున్నందున మాతృభాషా మాధ్యమాన్ని కాపాడుకోలేకపోతున్నాం. దీన్ని పరిష్కరించి ఒక జాతీయ విధానాన్ని రూపొందించే దిశగా – కేంద్రప్రభుత్వం, అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఆలోచించి, ఒక సమగ్ర శాసనాన్ని తేవాలి. అవసరమైతే తగిన రాజ్యాంగ సవరణను కూడా తేవాలి. ఒక జాతీయ విధాన నిర్ణయంతో ఈ సమస్య పరిష్కారం కాగలదు.

తేదీ : 26-12-2019

సామల రమేష్‌బాబు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

ఆధిపత్యభాషా మాధ్యమం-మాతృభాషా మాధ్యమం : విద్యాబోధన

కొంతమంది ప్రభుత్వ పాలకులూ ఉన్నతాధికారులూ, భాషా బోధనా మాధ్యమం గురించి కొన్ని అపోహలతోనూ అవగాహనా లేమితోనూ ఉన్నారనిపిస్తోంది. ప్రజలు కళ్ళు తెరిచి ఈ అపోహలూ అవగాహనా లేమి నుంచి ఎంత తొందరగా బైటపడితే అంత మేలు. అసలు, ఈ అపోహలు ఏమిటి? రెండవ భాషను, అంటే ఉదాహరణకు, "ఇంగ్లీషు నేర్చుకోవటానికి ఉత్తమమైన మార్గం దానిని బోధనా మాధ్యమంగా ఉపయోగించడం". మరొక అపోహ, రెండవ భాషను అంటే ఉదాహరణకు, "ఇంగ్లీషును నేర్చుకోవాలంటే వీలైనంత చిన్న వయసులో మొదలుపెట్టాలి". ఇక మూడవ అపోహ ఏమిటంటే, "రెండవభాషను అంటే ఇంగ్లీషును నేర్చుకునేందుకు ఇంటిభాష అడ్డు పడుతుంది". వాస్తవానికి, మొదటి భాషలో బలమైన పునాది ఏర్పడితేనే ఇతర భాషలను బాగా నేర్చుకోవచ్చు. స్పష్టంగా ఈ అపోహలు శాస్త్రవిరుద్ధమూ సత్యదూరమూ. అజ్ఞానంతోనూ అసం బద్ధ ఆలోచనలతోనూ కూడినవి. అయినప్పటికీ, నిజానికి ఈ అపోహల తోనూ వాస్తవ విరుద్ధ పోకడలతో మిథ్యామతితో ప్రణాళికలు నిర్మించ బూనుకొనేవారు ప్రాంతీయ భాషలను పక్కనబెట్టి ఇంగ్లీషుభాషా ఆధిపత్యానికి ఆహ్వానం పలకటమేకాదు, రాష్ట్ర వనరులనూ మన పరిశ్రమలనూ పారిశ్రామిక ఉత్పత్తులనూ నీరుగార్చడమే అవుతుంది. భాషలగురించీ భాషాశాస్త్రం గురించీ ఏమాత్రం అవగాహనలేని మన విధాన నిర్ణేతల ఆలోచనా విధానానికి మార్గనిర్దేశం చేయటం అవసరం.

ఆధునిక సమాజాలలో జ్ఞానసృష్టీ, సమాచార వినిమయం అనేవి రెండూ అత్యంత ప్రధానమైన పనులు. ఆధునిక సమాజాల అభివృద్ధి వీటి అభివృద్ధిపై ఆధారపడివుంటుంది. ఆధునిక ప్రపంచంలో ప్రతి సమాజమూ తనకుచెందిన సమాచార వినిమయాన్ని తన నియంత్రణలో ఉంచుకోగలగటం ఆ సమాజాభివృద్ధిలో మొదటి విజయం. సమాచార వినిమయం అనేది పరభాషలో కాకుండా తనదైన భాషలో చేసుకోగలగటం సమాజాభివృద్ధిలో గొప్ప విజయం అనే చెప్పాలి. దీనితోపాటే జ్ఞానసృష్టి కూడా తన సొంత భాషలో చేసుకోగలగటం అంతకంటే గొప్ప విజయం. అంతేకాదు. అభివృద్ధికి ఆనవాలు కూడా. ఇవేగాక ఈ రాష్ట్రంలో చదువులూ, పారిశ్రామిక కార్యా చరణా వాణిజ్యవ్యాపారాలూ పాలనా అంతా జనభాషలలో జరిగిన పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం, మన కాళ్ల మీద మనం నిలబడ గలిగిన స్వేచ్ఛ, స్థితీ గతీను. దేశ భాషలను బోధనా మాధ్యమంగా వాడుతున్నప్పుడే ఉపాధి ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

మన భాషలు విద్యా మాధ్యమంగా వాడేందుకు పనికిరావు, ఉన్నత విద్యలోనూ పరిశోధనా రంగంలోనూ వాడేందుకు ఆ స్థాయికి చేరలేదు అనేవి అజ్ఞానంతోనూ, అవివేకంతో కూడిన మాటలే. అట్లా అనడం, గెలిచే ప్రయత్నం చేయకముందే ఓటమిని ఒప్పుకోవడం. అది సాహసవంతుల లక్షణం కానేకాదు. అభివృద్ధి పథంలో ఉన్న సమాజాల సమూహాల లక్షణం అంతకంటే కాదు.

సమాజంలో జ్ఞానసృష్టి వ్యక్తిస్వేచ్ఛకు సంకేతం. కొందరే జ్ఞాన సృష్టి చేయగలరు అనడం అహంకారం. ఇంకా కొన్ని భాషలలోనే జ్ఞాన సృష్టి చేయగలరు అనడం అవిజ్ఞతా ప్రదర్శన అవుతుంది. మాతృభాష ఆ అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రతివారూ మాతృభాషలో జ్ఞాన సృష్టి చేయగల సమర్థులే. ఈ అధికారాన్ని కలిగించే మాతృభాషలో బోధనను కుంటి సాకులతో పక్కన పెట్టడం తెలుగు మాధ్యమంలో చదువుతున్నవారి పట్ల వివక్ష చూపించటమేగాక, అనుచితం అవివేకం కూడా అవుతుంది. నిర్బంధ ఆంగ్ల మాధ్యమపు విద్యావిధానం రాజ్యాంగ వ్యతిరేక చర్య. అయినా దాన్ని ప్రోత్సహిస్తూ సామాజిక మాధ్యమాలలో రాస్తున్న అధికారులపై చర్య తీసుకోకుండా నిర్బంధంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడాన్ని ఎలా సమర్థించగలం.

రాష్ట్రంలోని కార్పోరేటు, ప్రైవేటు, ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న అన్ని పాఠాశాలలలోనూ మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి. ఐతే, ఆంగ్ల మాధ్యమానికి కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అవకాశాన్ని కల్పించవచ్చు. కార్పోరేటు, ప్రైవేటు విద్యా సంస్థలలో తప్పనిసరిగా రిజర్వేషన్లను అమలుచేయాలి.

ఆంగ్లమాధ్యమంలో బోధన కావాలనుకొనేవారిని ఆధిపత్య సమూహంగానూ మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన కావాలి అనేవారిని ఆధిపత్యేతర సమూహంగానూ సంబోధిద్దాం.

ఆధిపత్య సమూహాల నిర్ణయాలూ వాటి వైఖరులు వారి నమ్మకాలతో పాటు ఆధిపత్యేతర సమూహ సభ్యులతో సహా చర్చించి పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. వీటిలో లేవనెత్తిన కొన్ని సమస్యలు ఇవి, వాటికి కొన్ని సాధారణ సమాధానాలే ఈ కింద రాసినవి:

ప్ర. విద్యార్థులకు తదుపరి విద్య, ఇంకా ఉపాధిఉద్యోగాల కోసం ఆధిపత్య భాష అవసరమైనప్పుడు - మాతృభాషను నేర్పిస్తూ సమయాన్ని ఎందుకు వృథా చేస్తారు?

జ. ఎందుకంటే విద్యార్థులు తమకు అప్పటికే వచ్చిన అర్థంచేసుకునే భాషలలోనే సులువుగా నేర్చుకుంటారు. ఇంకా వారికి మాతృభాషలో మంచి పునాది ఉంటే ఇతర భాషలను బాగా నేర్చుకోవటం వారికి ఇంకా సులువు అవుతుంది. విద్యార్థులు, వారు

(...తరువాయి 12 వ పుటలో)

"పిల్లలు తమ మాతృభాషలోనే బాగా నేర్చుకుంటారు" – ఐక్యరాజ్యసమితి

ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రస్తుత పోకడలూ వాటినుండి వస్తున్న సమస్యలపై అవగాహన పై సమాచారం రాబట్టడంకోసం అంతర్జాలంలో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన చర్చలో లేవనెత్తిన కొన్ని ప్రశ్నలూ వాటి సమాధానాలనూ చూడండి.

మీ దేశంలో ఇంగ్లీష్ స్థానిక భాషా, ప్రాంతీయ భాషా?

ఈ ప్రశ్నకు సమాధానంగా ఇంగ్లీష్ మాతృభాష అంటూ 8% మాత్రమే సమాధానం ఇచ్చారు.

మీ దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో ఇంగ్లీష్ ప్రధాన బోధనా భాషగా ఉందా?

దీనికి సమాధానంగా 13% మంది మాత్రమే తమ దేశంలో ఉన్నత విద్యావ్యవస్థలో బోధనా మాధ్యమంగా ఇంగ్లీష్ ప్రధాన భాష అని అన్నారు.

విద్యా మాధ్యమంపై ఐరాసవారి పురోగామి పరిశోధనల ఫలితాలు:

ప్రపంచవ్యాప్తంగా, 50-75 మిలియన్ల మంది 'దిగువ వర్గాల' పిల్లలు పాఠశాలలో చేరడంలేదు. దీనికి ప్రధాన కారణం, పాఠశాలల్లో పిల్లల ప్రాథమిక భాష బోధనా భాషగా లేకపోవటం. మాతృభాష బోధనా భాషగా లేని పాఠశాలల్లో పిల్లలు బడి మానేయడం లేదా మొదటి తరగతుల్లో తప్పే అవకాశమూ ఎక్కువ.

ప్రాథమిక పాఠశాలలు అన్నింటా అక్షరాస్యతకూ చదువుకూ పిల్లల మొదటి భాషే సరైన భాష అని పరిశోధనలో తేలింది (ఐరాస, 2008 ఎ). దీనిపై రోజురోజుకూ సాక్ష్యాధారాలు పెరుగుతున్నా తల్లిదండ్రుల డిమాండ్ ఉందనీ, ప్రపంచవ్యాప్తంగా అనేక విద్యా వ్యవస్థలూ సంస్థలూ ఆధిపత్య భాషలను ప్రత్యేకంగా ఉపయోగించాలని పట్టుబడుతున్నాయి. దీని అర్థం స్థానిక భాషలను తప్పించటమే కాదు, వాటిని మాట్లాడే పిల్లలనుకూడా అని గుర్తించాలి (ఆర్నాల్డ్, బార్ట్‌లెట్, గోవానీ, మెరాలి 2006).

ఆంగ్ల భాషామాధ్యమ బోధనతో నష్టాలు:

పిల్లలు నేర్చుకునే విషయాన్ని సరిగా ఒంటబట్టించుకోలేరు. ఈ దశలో పిల్లలు చదువులో వెనుకబడిపోవటంతో ఉపాధ్యాయులు ఉత్సాహాన్ని కోల్పోతారు. పాఠశాలల పనితీరులో మొదట్లోనే వైఫల్యానుభవాలు చవిచూస్తారు. ఇక పిల్లలు వారి కుటుంబాలలోనూ సమాజంలోనూ స్థానిక భాషలను వాడగలిగే సామర్థ్యాన్ని కోల్పోతారు. అంతేకాక, పిల్లలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

మాతృభాషలోనే విద్యాబోధన:

ఐరాస 2008 లో ప్రపంచ దేశాలలో మాతృభాషా మాధ్యమ విద్యను ప్రోత్సహించడంలో పెరుగుతున్న ఆసక్తిని ధృవీకరిస్తూ ఒక అధ్యయన సంకలనాన్ని రూపొందించింది. ఇది మాతృభాషలో విద్యను ప్రోత్సహించడానికీ అభివృద్ధి చేయడానికీ చేపట్టిన అనేక రకాల నమూనాలనూ, సాధనాలనూ ఇతర వనరుల గురించీ వివరిస్తుంది.

పిల్లలు తమ మాతృభాషలోనే బాగా నేర్చుకుంటారని ఐరాస 1953 నుండి మాతృభాషలో ప్రాథమిక విద్యా బోధనను ప్రోత్సహించింది (ఐరాస, 1953). ఐరాస మాతృభాషా మాధ్యమ విద్యా ప్రయోజనాలను మొదటి నుండీ గుర్తిస్తోంది. మాతృభాషా మాధ్యమ బోధన ఉన్న పాఠశాలలో పిల్లలు చేరేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి (కొసోనెన్, 2005). మాతృభాషా మాధ్యమ బోధనలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సంప్రదించడమూ వారి పిల్లల చదువులలో పాలుపంచుకొనడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది (బెన్సన్, 2002). ఆంగ్ల భాష అసలే రాని బాలికలూ గ్రామీణప్రాంత పిల్లలూ ఎక్కువసేపు పాఠశాలలో ఉండటానికీ ఇష్టపడటమూ తక్కువసార్లు తప్పటమూ జరుగుతోంది (హోవెన్స్, 2002 ఐరాస, బ్యాంకాక్, 2005). విద్యార్థి మొదటి భాషే బోధనా భాష అయిన దేశాలు మాత్రమే అందరికీ విద్యా లక్ష్యాలను సాధించగలవని కొంతమంది విద్యావేత్తల పరిశోధనలో తేలిన విషయం. మాతృభాష మాధ్యమ విద్యావిధానం, అట్టడుగున ఉన్న పిల్లలను పాఠశాలలో నిమగ్నం చేయడంలో విజయవంతమైన నమూనా అని పరిశోధనలు సూచిస్తున్నాయి (బెన్సన్ కొసోనెన్, 2013 యాకొమెట్టి, 2012). మాతృభాషలో విద్య ఏ పరిస్థితులలో ఇంకా ఏ వనరులతో సమర్థవంతమైన విధానంగా ఉంటుందోనని జరిపిన విశ్లేషణలో పిల్లలు ఇంటి భాషలో నైపుణ్యం సాధిస్తూ అదనపు భాషలను నేర్చుకోవడానికి పునాది వేసుకుంటారు అని తేటతెల్లం అయింది. ఇవిగాక ఇంకా మరో ప్రత్యామ్నాయ విధానంద్వారా ఒనగూడే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకోవాలి.

ఆంగ్లమాధ్యమ బోధనలో ఉపాధ్యాయులనూ వారి సహాయకులనూ నియమించడం, పాఠ్యాంశాలను రూపొందించడం మూల్యాంకనం చేయడం మొదలైనవాటిలో వచ్చే సమస్యలు మాతృభాషా మాధ్యమంలో ఉండడంతో బోధనపై శ్రద్ధపెట్టడం సులువవుతుంది. మాతృభాషా మాధ్యమంలో తల్లిదండ్రులూ పొరుగువారి సహాయం ఎంతోకొంత ఎప్పుడూ ఉంటుంది.

డా. నాగసూరి వేణుగోపాల్
9440732392

సమగ్ర దృష్టి, పరిశ్రమ చాలా అవసరం

"ఒక్కసారిగా రాష్ట్రం వదిలి వచ్చేస్తే వారు హిందీ పికప్ చేస్తున్నారు – గమనిస్తే తమాషాగా అనిపించవచ్చు గానీ, పనికి వచ్చే పోకడ" అని అన్నాడో మిత్రుడు మూడు దశాబ్దాల క్రితం ఒక సంభాషణలో. ఈ సందర్భం జరిగింది గోవాలో. అక్కడ కొంకణి, మరాఠి, ఇంగ్లీషు దాదాపు ఈ మూడు భాషలు సమానంగా వినబడతాయి. అయితే అక్కడికి పనికోసం తెలుగు, కన్నడ ప్రాంతాల నుంచి వచ్చినవారు ఈ మూడు భాషలు కాకుండా హిందీ నేర్చుకుంటు న్నారు. ఇప్పటి పరిస్థితి తెలియదు కానీ, ఆ విషయాలు చర్చించింది ఓషనోగ్రఫీలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న కన్నడిగ వ్యక్తి, ఆయన మాతృభాష తెలుగు!

ఒక ఐదేళ్ళ క్రితం ఒక మాసపత్రిక సంపాదకుడు నన్నో ప్రశ్న అడిగాడు – తలదిండులాంటి పుస్తకాలను ఇంగ్లీషు తెలిసిన యువతీ యువకులు వదలకుండా చదువుతున్నారు. అందులో ఏముంటుంది? కొంచెం శోధించి వివరించకూడదా ఒక వ్యాసంలో అని అడిగారు. నేనింకా అటువంటి వ్యాసం రాయలేదు. సరే, కొందరు అసలు పుస్తకాలు ముట్టరు కదా, మరి పెద్ద పెద్ద పుస్తకాలు ఎందుకు చదువుతారు ?

ఈ రెండు విషయాలు మళ్ళీ మళ్ళీ గుర్తుకు వస్తున్నాయి – ఇటీవల భాష, మాతృభాష, ఇంగ్లీషు అంటూ నడుస్తున్న చర్చలను చూస్తే – పైన చెప్పిన రెండు ధోరణులు ప్రభుత్వ చట్టాలకు సంబంధం లేకుండా, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా సాగుతున్న వాటిగా మనం గమనించాలి. ఒక రకంగా వాస్తవాలు, కఠోర వాస్తవాలు! మొదట హిందీ నేర్చుకోవడం గురించి చూద్దాం. తెలుగు, కన్నడ ప్రాంతాల నుంచి పనికోసం వలసగా వచ్చిన వారు గోవాలో కొంకణి, మరాఠి, ఇంగ్లీషు కాకుండా హిందీ ఎందుకు నేర్చుకుంటారు?

నేర్చుకోమని ఎవరు చెబుతారు? ఎవరు నేర్పుతారు?? అంతకుముందు అలా వలస వచ్చిన వారి పరిచయాలతో వారు ఆ ప్రాంతంలో అడుగుపెట్టి వుంటారు, వారిని ఇతర విషయాలలో అనుసరించి ఉంటారు.

తాము తొలి నుంచి తెలుసుకున్న తెలుగు, కన్నడ భాషలు అక్కడ ఉపాధికి సరిపోవు. మరి ఏ భాష నేర్చుకోవాలి? ఏది ఉపాధి కల్పిస్తుందో, ఏది ఎక్కువ ఉపయోగపడుతుందో గమనించే, ఎవరైనా శ్రమపడతారు.

ఏదైనా కారణంతో ఆ ప్రాంతం వదిలితే ఆ మూడు భాషలూ పనిచేయవు. కనుక హిందీ నేర్చుకుంటే ముందుముందు ఎంతోకొంత ఉపయోగం కూడా ఉంటుంది. అంతేకాకుండా అక్కడ గోవాలో కూడా ఉపయోగపడుతుంది. ఇదంతా వారు గమనించి, ఉపయోగ పడుతుందని గుర్తించి పాటిస్తున్న విధానమే తప్ప త్రిభాషా సూత్రం కాదు. చతుర్విధసూత్రం కాదు. వాస్తవం ఎలా సాగుతుందనేది గుర్తించడానికే ఈ ఉదాహరణ గురించి చర్చిస్తున్నాను. అంతేకానీ మాతృభాష, పూర్వసంస్కృతి అని ఆవేశపడి తీసుకున్న నిర్ణయాలు కావు ఇవి. కనుకనే రామమనోహర్ లోహియానే కాదు, ఏపిజె అబ్దుల్ కలాం కూడా ఉపాధిని ఇవ్వగలిగితేనే భాషలకు గౌరవం, స్థిరత్వం, మనుగడ ఉంటాయని చెప్పారు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్లభాష పాఠశాల గురించి, ఆంగ్ల భాష చుట్టూ జరుగుతున్న చర్చలనూ, రాజకీయ ఆవేశాలను పరిశీలిస్తే – ప్రజలు తమ సౌలభ్యాలను గుర్తిస్తే రాజకీయ నాయకులు తమతమ ప్రయోజనాలపట్ల దృష్టిపెడతారు అని బోధపడుతుంది. ఉన్నపళంగా ప్రభుత్వ పాఠశాలలను తెలుగు మీడియం నుంచి ఇంగ్లీషు మీడియంలోకి మార్చివేస్తున్నారు అనే విషయం మామూలు మనుషులకు బాగానే ఉంది.

ఎందుకంటే యూనిఫారమ్, బూట్లు, పుస్తకాల బ్యాగ్, బస్సు ఇవన్నీ కలసి సుమారు జేబులకు కత్తెరవేస్తున్నాయి. ఇవన్నీ ఏమీ లేకుండా ఇంగ్లీషు మీడియం స్కూలుగా గవర్నమెంట్ స్కూలు మారితే ఇంకేం కావాలి? ఇది సగటు మనిషి భావించిన ఊరట. ప్రస్తుత సమాజంలో ఇంగ్లీషు వేలం వెర్రి ఉంది, దాన్ని మనం పొందలేమనే అసంతృప్తి ప్రజలలో బాగా ఉంది. ఇది రాజకీయమైన ఎత్తుగడే కావచ్చు, ప్రజలు రాజకీయాలను కూడా తమకు అనువర్తిం చుకుని బేరీజు వేసుకుంటారు.

చంద్రబాబు వర్గం దీనిని ఇంతగా ఎందుకు వ్యతిరేకిస్తున్నది? అసలు కారణాన్ని ఏ పార్టీ పైకి చెప్పదు కదా! తమ పార్టీకి ఆర్థిక ఊతంగా నిలుస్తున్న నారాయణ సంస్థల యజమానికి ఇబ్బంది కలుగుతుంది కనుక ఇలా వ్యతిరేకిస్తున్నారు అని టీవీ ఛానళ్ళు, పత్రికలు చెప్పకపోయినా ప్రజలు భావిస్తున్నారు. **ఈ విషయాలను ఇరు పక్షాలు లోతుగా చర్చించవు. వారు విమర్శలు, ప్రతివిమర్శలలో మునిగిపోయారు కనుక. తాము తెలుగు పాఠశాలల్లో చదివి, ఉద్యోగాలు చేస్తూనేత కవిత్వం, కథలు రాస్తున్నా పిల్లలను ఇంగ్లీషు పాఠశాలలకు పంపే కొందరు తెలుగు గురించి సమర్థిస్తూ, చివరికి వాదనలో ప్రత్యర్థుల చేతిలో దొరికిపోతున్నారు.**

తల్లి పొత్తికడుపు నుంచి వచ్చిన క్షణం నుంచి బిడ్డ మాట రాకపోయినా చాలా విషయాలు చూస్తాడు, గమనిస్తాడు, గుర్తిస్తాడు. పొయ్యి దగ్గరున్న అమ్మ వద్దకు పోవాలని ఉన్నా, పోవడానికి ఇష్టం లేక ఏడుస్తాడు. కారణం ఏమిటంటే పొయ్యిదగ్గరకు వెడితే సెగ తగులుతుం దని ఈ చిన్న బిడ్డ గమనించడమే ! పడుకుని కేరింతలు కొట్టే బిడ్డ ఒకసారి ఏడుపు లంకించుకుంటాడు. దానికి కారణం ఆ బిడ్డ పుసుపోసుకుని, తడి తగలడంతో నచ్చక ఏడ్చి అమ్మను పిలుస్తాడు. ఇలా చాలా విషయాలు చూపు, స్పర్శ, వాసన, ఇతరుల ప్రవర్తన ద్వారా తల్లి చెంత బిడ్డ నేర్చుకుంటాడు. తొలుత తల్లి, తర్వాత తండ్రి, పిమ్మట తోబుట్టువులు, ఇతర కుటుంబ సభ్యులు, పొరుగు వారు, మిత్రుల సాన్నిహిత్యంతో బిడ్డ గ్రహిస్తాడు. అలాగే దుమ్ము, ధూళి, ఇంటిపరిసరాలు, పెంపుడు జంతువులు, చెట్లు,

మొక్కలు, పొలాలు ఇలా మరెన్నో విషయాలు తెలుసుకుంటాడు. ప్రకృతిలో జరిగే ఎన్నో అంశాలు ఈ గ్రహింపు ద్వారా బోధపడతాయి. **తెలిసిన పరిజ్ఞానం క్రమంగా మాటల ద్వారా మెదడులో స్థిర పడుతుంది. ఇదంతా బిడ్డ స్కూలుకు వెళ్ళడానికి ముందే జరుగు తుంది. కనుక మాతృభాషలో బోధన జరిగితే – ఈ పరిజ్ఞానం అంతా రాకెట్‌కు లాంచింగ్ పాడ్‌లా ఉపయోగపడుతుంది.**

అందువల్ల బిడ్డ త్వరగా నేర్చుకోవడమే కాదు, తర్వాత దశలో సృజనాత్మకంగా తయారవడానికి మాతృభాష ఎంతగానో దోహద పడుతుంది. ఒరిజినల్ మేధస్సు వ్యాప్తి చెందడానికి కూడా మాతృభాష ఎంతగానో ఉపయోగపడుతుంది.

బిడ్డకు తెలియని ఏ భాషలో ప్రాథమిక బోధన మొదలైనా అది శ్రమ కల్గిస్తుంది. ఎందుకంటే తెలిసిన జ్ఞానమంతా కొత్త భాషలోకి తర్జుమా కాదు కదా! ఒకవేళ విద్యాబోధన అంతే అనుభవ పూర్వకంగా తెలుసుకొనేలా–చూపు, వినికిడి, స్పర్శ, వాసన ద్వారా తెలియబరిచినా అది ప్రారంభమేకాని, కొనసాగింపు కాదు. కనుక మరే భాష అయినా అది వత్తిడే! కనుక పదవతరగతి లేదా ఇంటర్మీడియట్ తర్వాత మీడియం మార్చడం మంచిదనే వాదనఉంది. అప్పటికి పిల్లవాడికి స్థూలంగా అన్ని విషయాలు బోధపడి వుంటాయి కనుక భాషలో అనువర్తించడమే మిగిలింది కనుక కొంతశ్రమతో అది సాధ్యమే!

మాతృభాష, విద్యాబోధన వంటి విషయాలలో అవగాహన కల్గించడంకంటే ఆవేశంతో ప్రకటనలు చేయడం ఎక్కువగా ఉంది.

కనుక నడిచే విధానాన్ని మరింత పటిష్టపరిచి ఆంగ్లభాషా బోధనను ఒక పాఠ్యాంశంగా మరింత దృష్టి పెట్టి బలోపేతం చేయ వచ్చు. ఇక్కడ ఇంగ్లీషు అనేది ఒక సాధనంగానే పరిగణించాలి. కేవలం వ్యక్తీకరణకు దోహదపడే పనిముట్టుకు మించి చూడకూడదు. బిడ్డ మాతృభాషలో నేర్చుకున్న విషయాలను తర్జుమా చేయగల రీతిలో ఇంగ్లీషు బోధన రూపు దిద్దుకుని ఉంటే మరింత ప్రయోజ నంగా ఉంటుంది. అయితే జరిగింది ఏమిటి?

ఇంతకాలం తెలుగులోనే మనం ఇంటా, బయటా, పాఠ శాలలో గడుపుతున్నాం. మరి మన తెలుగు వ్యక్తీకరణ ఎందుకు మెరుగుకాలేదు? దీనికి ఎవరు చెబుతారు జవాబు? ఐదేళ్ళు ఇంగ్లీషు ఒక పాఠ్యాంశంగా నేర్చుకున్నా ఎందుకు చక్కగా రెండు వాక్యాలు స్వంతంగా మాట్లాడలేకపోతున్నారు? దీనికి సంజాయిషీ ఎవరు ఇస్తారు? పోనీ ఇపుడిపుడు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో వేలు పోసి చదివిస్తున్నాం కదా, అక్కడి టీచర్ల సామర్థ్యం ఎంత? పిల్లలు ఎంత మెరుగుపడ్డారు? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు చెప్పేవారు ఎవరూ లేరు!

అరకొర జీతం కాని జీతంతో పాఠాలు చెప్పే ఇంగ్లీషు మీడియం టీచర్లకన్నా, డిగ్రీ చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించుకున్న గవర్నమెంట్ స్కూళ్ళ టీచర్లు ఎంతో మెరుగు కదా అని ప్రశ్నించేవారికి జవాబు దొరకదు.

ఇంగ్లీషుమీడియం స్కూళ్ళు ఏ స్థాయిలో సాగినా అడ్డు చెప్పని మేధావి వర్గం ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియం వస్తే ఎందుకు ఖండిస్తోంది? బడుగు వర్గాల పిల్లలకు ఇంగ్లీషు రాకూడదా – అనే ప్రశ్నకు తెలుగుమీడియం కోసం ఎలుగెత్తే మేధో వర్గం జవాబు చెప్పలేకపోతున్నారు! తాము పట్టించుకోని ప్రభుత్వ పాఠశాలల గురించి వీరికెందుకు బాధ? ఇదీ అటువైపు వారి ప్రశ్న!

ఏ బడి అయినా ఒకలా ఉంది కదా, కనుక తక్కువ శ్రమతో తమ అవసరం తీరేరీతిలో ప్రభుత్వమే ఇంగ్లీషు మీడియం పాఠశాలలు పెడితే మధ్యతరగతి, బడుగువర్గాలకు ఊరట. అయితే సమాజం కోసం, భవిష్యత్తుకోసం ఆలోచన చేస్తే ఏ విధానమైనా సక్రమంగా, సవ్యంగా నడవాలి. ఇది మొదటి స్థాయి అవసరం. దీన్ని సాధించ కుండా ఏమి చేసినా అది ప్రయోగంగానే మిగులుతుంది. చరిత్రగా మిగలాలంటే పూర్తి స్థాయి దృష్టి, పరిశ్రమ అన్ని దిశలలో, స్థాయిలలో ఉండాలి.

(9 వ పుట తరువాయి)

ఆధిపత్యభాషా మాధ్యమం...

వెచ్చించే సమయాన్నీ చేసే కృషినీ దృష్టిలో పెట్టుకుంటే ఆ విద్యార్థికి తన మాతృభాష ఒక అత్యంత విలువైన పెట్టుబడి. దీనిని ఆధిపత్య ఆంగ్ల భాషా సమూహాలు గుర్తించలేక పోతున్నాయి.

ప్ర) మాతృభాష ఆధారిత విద్య పనిచేయకపోతే?

జ. తనవి కాని ఇతర ఆధిపత్య భాషలను ఉపయోగించడం కంటే మాతృభాష ఆధారిత బోధనలో నేర్చుకోవడం మరింత సమర్థవంతంగానూ, ప్రతిభావంతంగా ఇంకా ప్రభావవంతంగా ఉందని చూపించడానికి ఎన్నో అంతర్జాతీయ ఆధారాలు ఉన్నాయి.

మాతృభాషా మాధ్యమంలో బోధనలో వచ్చే సమస్యలను పరిష్కరించడానికి అనేక విధాలైన ప్రాంతీయ స్థానిక అవసరాలను తీర్చే సంస్థలూ వ్యక్తులూ వారి నైపుణ్యాలూ తక్కువ వ్యవధిలో, తక్కువ ఖర్చుతో సులువుగా అందుబాటులో ఉంటై. అట్లాగాక ఆధిపత్య ఆంగ్ల భాషామాధ్యమం అమలులో నూటికి ఎనభై శాతం పుస్తకాలూ తదితర సామాగ్రి దిగుమతి చేసుకొనేదే. ఇట్లా వేలకోట్ల రూపాయల విదేశీ మారకాన్ని ఆదా చేయడమేగాక, మనవారికి ఉపాధి ఉద్యోగావ కాశాలు పెరుగుతాయి.

ప్ర. మాతృభాషలు ఒకటికంటే ఎక్కువ ఉన్నప్పుడు ఎలా?

జ. భారతదేశంగానీ, మన రాష్ట్రంగానీ ఎన్నో ఇతర దేశాలూ రాష్ట్రాలూ అనుసరిస్తున్న పద్ధతిలోనే నడవవచ్చు. ఈ సమస్య కొత్తదేమీకాదు. యునైటెడ్ కింగ్డంలోగూడా ఇంగ్లీషూ, ఐరిషూ మొదలైన బహుభాషలూ ఆయా దేశాల అనుభవాలూ చాలా పెద్ద లేదా చిన్న భాషలు ఉన్నచోట, ఇంకా మిశ్రమ సమాజాలు ఉన్న చోట కూడా, తమకు అపరిచితమైన విదేశీ భాషలో మునిగిపోయి దానిపై ఆధారపడటం కంటే మాతృభాష లేదా మరొక స్థానిక భాషలో నేర్చుకునేందుకు అవకాశాలు ఉన్నై. ఉదాహరణకు, ఇంటి భాషను ఉపయోగించడం తార్కికంగా వీలులేని కష్టతరమైన ప్రదేశాలలో లేదా చాలా చిన్న భాషా సంఘాలు ఉన్న ప్రదేశాలలో, భారతదేశంలో అల్పసంఖ్యాక రాష్ట్ర భాషలతో చేసినట్లుగా, స్థానిక భాషా మాధ్యమాన్ని స్వీకరించవచ్చు.

కృపాకర్ పొనుగోటి
9948311667

నాకున్న అవకాశమే నా భాష!

నేను నా నలభై ఆరో యేట డిగ్రీలోకి ప్రవేశించి, యాభై రెండేండ్లు వచ్చేసరికి వరసగా డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా పూర్తి చేశాను. ఇది అందరికీ వర్తిస్తుందని నేనిక్కడ రాయబోవడం లేదు. నా అనుభవాన్ని మాత్రమే పంచుకుంటున్నాను. నేను ఐదో తరగతిలో ఉండగా, వానాకాలం పొలం కూలీ పనులకు తీసుకుపోయే వారు మా నాన్న,అమ్మలు. గొడ్లు కాయడానికి, పొయిలో కట్టెలు యారక రావడానికి, గడ్డి దోక్క రావడానికి పంపేవాళ్లు. పనుల సీజన్ అయిపోయాక, ఎండాకాలం బడికి పోనిచ్చేవారు. అట్లా ఒకే తరగతిలో నాలుగేళ్లు చదివాక ఇక పూర్తిస్థాయిలో డ్రాపౌట్‌నయ్యాను. బాల్య పూర్ణజీవితం బాలకార్మికుడిగా మారిపోయాను.

డిక్టేషన్లో, అందంగా చేతిరాత రాయడంలో ముందుండే వాడిని.

తర్వాత, మా ఇంటి ముందే హైస్కూల్ ఉండేది. నా వయసు వారు అందరూ చదువుతూ, ఆడుతూ హైస్కూల్ వద్ద కలకలంగా ఉంటే, నేను వారిని చూసుకుంటూ దిగాలుగా పనులకు పోయేవాణ్ణి.

నాలో చదువు యావ చావలేదు. చదువు సాధనలో ఇష్టంగా, కచ్చగా, అవకాశం కోసం వెదకులాడతా ఉండేవాణ్ణి. హైస్కూలు ప్రాంగణంలో విద్యార్థులు రాసి పడేసిన చిత్తు కాగితాలు వదలకుండా చదివేవాడిని. కోమటింటికాడనుంచి సరుకులు పొట్లం కట్టించుకొచ్చిన పేపర్లు చదివేవాణ్ణి. ఇంట్లో ఉన్న పెద్ద బాలశిక్ష, బైబిల్, ఆంధ్ర క్రైస్తవ కీర్తనల గ్రంథం, మా అమ్మమ్మకోసం నెల నెలా ఇంటికొచ్చే సనాతన సారథి మాసపత్రికలోని రామాయణం సీరియల్, భట్టి విక్రమార్క కథల గ్రంథం, వేయి శిరస్సులు ఖండించిన అపూర్వ చింతామణి కథలు, చంద్రహాస ఇంకా ఇంట్లో ఉన్న గుర్తులేని పుస్తకాల నన్నింటినీ పదే పదే చదివా.

ఆ తర్వాత, వేరే ఊళ్ళల్లో, హాస్టళ్లలో పనులు చేస్తున్నప్పుడు, ఫుట్ పాత్‌లమీద పాత పుస్తకాలు చదవడానికి అలవాటు పడ్డా. ఎనిమిది, పది, ఇంటర్ తరగతులు తెలుగు గైడులు తీసుకొని, అందులో అర్థాలు, ప్రతిపదార్థాలు, తాత్పర్యము మొదలైన పాఠ్య భాగాల నన్నింటినీ పిప్పి చేసేవాణ్ణి. ఆ తర్వాత, విద్యార్థుల వద్ద ఉన్న సూర్యరాయాంధ్ర నిఘంటువు, బ్రౌణ్య నిఘంటువులను అప్పుడ ప్పుడూ తిరగేసే వాణ్ణి. అప్పుడప్పుడూ నాగార్జునా విశ్వ విద్యాలయం లైబ్రరీలో తెలుగు పుస్తకాల,పత్రికల రాకుల దగ్గర కూర్చొని చదువు కునే వాణ్ణి.

విప్లవ విద్యార్థి నాయకుల, ట్రేడ్ యూనియన్ నాయకుల, రాడుగ పబ్లికేషన్ల పరిచయాల వలన, విప్లవ సాహిత్యం, అంతర్జాతీయ సాహిత్యం, ఇతర తెలుగు సాహిత్యం చదువుకోవడం అలవాటైంది.

ఇక ఊరొదిలిపెట్టి,పనులకు పోయిన ఊళ్లలో, టీ కొట్లు, కాకా హోటళ్ళు, మంగలి షాపులు, మెడికల్ షాపులు, దగ్గర న్యూస్ పేపర్లు వదలకుండా చదివేవాణ్ణి.

అట్లా, నా చదువంతా, స్కూలుకు వెలుపల సాగింది.

నిరంతరం పనులు, పని స్థలాలు మారుతూ ఉండే పరిస్థితుల వలనా, నాకుండే ఆసక్తులు,ఆశయాలు, దిగుళ్ళ వలనా ఏమో, నేను నా జీవితం అంతా నా వెంట ఉండగలిగే, శాశ్వత మిత్రులను సంపాదించుకోలేక పోయాను!

తెలుగు భాషపై అవసరమైన పట్టు, సాధన వలన,గోడ పత్రికలు, కరపత్రాలు, కవిత్వం, అర్జీలు, అప్లికేషన్లు, ఫిర్యాదులు, ప్రార్థనలు, పశ్చాత్తాపాలు, తిట్లను కప్పెట్టుకున్న విమర్శలు, రిపోర్టులు, వ్యాసాలు, వార్తలు విరివిగా రాయగలిగేను.

ఇక యూనివర్సిటీ చదువులు చదవాల్సి వచ్చినపుడు, ఒక విశ్వ విద్యాలయంలో కమ్యూనికేషన్ ఆచార్యునిగా ఉన్న నా మిత్రుడు, ఒక మంచి సలహా ఇచ్చాడు. అదేమిటంటే, "నీకు ఎట్టేటైం పాసవ్వడం ముఖ్యం కాబట్టి, రాని ఇంగ్లీష్ మీడియం తీసుకొని, కంపార్టుమెంటల్ అయేకన్నా, మళ్లా డ్రాపౌట్ అయేకన్నా, వచ్చిన తెలుగు మీడియంలో చదువుకో. ఆగకుండా, వరసగా పాసౌతూ చదువులను పూర్తి చెయ్యడానికి వీలౌతుంది. డిగ్రీల సంపాదనకు ఇది తోడ్పడుతుంది. ఇంగ్లీష్ నేర్చుకోడానికి వేరుగా ప్రయత్నించు" అని ఇచ్చిన సలహా పాటించాను. ఉన్నత విద్యలో వరసగా మూడు డిగ్రీలు పొందాను. డిగ్రీలు లేవనే న్యూనతను పోగొట్టుకోవడానికి డిగ్రీలు నాకు తోడ్పడ్డాయి. కాలందాటి చదువుకున్నందుకు, ఏడ్పుతోబాటు ఒక పిచ్చి నవ్వు కూడా నవ్వుకున్నాను.

ప్రపంచంలో, చదువులో, వ్యవస్థీకృత విద్యా, విజ్ఞాన వ్యవస్థలు అద్భుతంగా ఉన్నాయి. కొన్ని పనికిరాని వైనప్పటికీ, ఎక్కువగా నేర్చుకోదగ్గవే ఉన్నాయి. ఇన్నేళ్ళు నేను వీటికి దూరంగా ఉన్నానా!? ఎట్లా ఉండగలిగేను!? విస్తుపోతూ, కొంచెం సిగ్గపడుతూ, చాలా ఆనందంతో నా డిగ్రీలను పూర్తి చేశాను.

రాష్ట్రం దాటని, మార్కెట్ విలువ లేని తెలుగొక్కటే సరిపోదు, నా కిప్పుడు.

నా భావాల్ని, అనుభవాల్ని, నేనే ఇంగ్లీషులోకి ప్రసారం చెయ్యగలిగితేనా!? అనే దిగులు నన్నింకా వదల్లేదు!

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ అమ్మనుడిలోనే

రంగనాయకమ్మ
040 23117302

‘చదువు’ ఏ భాషలో సాగాలి?

మాతృభాషతో సౌకర్యం ఏమిటంటే, దాదాపుగా ఆ భాషలో వ్యాకరణ విషయాలన్నీ బడిలో నేర్చుకోకుండానే తెలిసిపోతాయి.
మొదట, మాతృభాషలో విషయాలు తెలిసివుంటే, పరాయిభాషలో ఆ విషయాల్ని నేర్చుకోవడం ఎంతో తేలిక అవుతుంది.
పిల్లలకు మాతృభాషలో వాచకాలు సరైనవిగా వుంటే ఒకటి, రెండు తరగతులు అయ్యేటప్పటికే రాతా, చదువూ అలవాటైపోతాయి.
ఆ తరవాత, పరాయి భాషలో అక్షరాల్నీ, మాటల్నీ చిన్న వాక్యాల్నీ నేర్పడం మొదలు పెట్టవచ్చు.
మొదట మాతృభాషలో రాతే లేకుండా, మాట్లాడటం తెలియని ఏ పరాయిభాషలో అయినా చదువు ప్రారంభించడం
అంటే – అది పిల్లలను చిత్రహింసలు పెట్టడంతో సమానం.

‘చదువు’ అంటే ఏమిటి, అది ఏ భాషలో సాగాలి? – ‘చదువు’ అంటే ఏమిటో మొదట తెలిస్తేనే, అది ఏ భాషలో సాగాలో తర్వాత తెలుస్తుంది. ‘చదువు’ అన్నప్పుడు, నాలుగైదేళ్ల బాలబాలికల్నే మొదట దృష్టిలో పెట్టుకోవాలి. చదువు జరిగేది చిన్నవయసులోనే అయినా, కొందరి విషయంలో అది, పెద్దవయసులోనూ జరగవచ్చు లేదా ఏ వయసులోనూ జరగకపోవచ్చు. మూడేళ్ల పిల్లల్నీ స్కూళ్ళకు పంపించే విధానం, ఏనాడో వచ్చేసింది. అయితే, ఈ పాఠశాలలు చదువుల స్కూళ్ళు కావు ఇవి, ఆటల్నీ పాటల్నీ నేర్పుతూ, చిట్టి పొట్టి చదువులు కూడా నేర్పించినా, ప్రధానంగా పిల్లల్ని ఆడించే స్కూళ్ళే. ఇంతకీ, ‘చదువు’ అంటే ఏమిటి, ఎప్పుడు, ఏ భాషలో? చదువు ఏ భాషలో అనే ప్రశ్న ఏమిటి?. పిల్లలు ఏ భాషలో మాట్లాడుతూ, పెరుగుతూ ఉంటారో ఆ భాషలోనే! పిల్లలు పుట్టి, పెరుగుతూ ఉంటే, వాళ్ళని పెంచే పెద్దవాళ్ళు, పిల్లలతో ఏ భాషలో మాట్లాడతారో, ఆ భాషే పిల్లలకి అలవాటవుతుంది. అది, పిల్లలకు మాతృభాష.

గ్రహింపు సులభం

‘చదువు’ అంటే ఏమిటో ఇంకా చెప్పుకోలేదు. ‘చదువు’ అంటే మాట్లాడే భాషలోనే రాయడమూ, ఆ భాషని చదవడమూ, ఈ రెండూ నేర్చుకోవడమే. మాట్లాడే భాషని, రాయడానికి, దాని అక్షరాలు నేర్చుకుని రాయడం గానీ అదే భాషలో ఇతరులు రాసినదాన్ని చదవడంగానీ చెయ్యగలగాలి. ఏ భాషనీ చదవలేకపోతే, అది ‘చదువు’ కాదు. ‘అమ్మా, ఏదన్నా తాయిలం పెట్టు!’ అని మాట్లాడే పిల్లలు, ఆ మాటలనే రాయగలిగితే, వాళ్ళకి చదువు మాట్లాడే భాషలో ప్రారంభమైపోయినట్టే. అంటే, మాతృభాషలో, ఏ భాషలో మాట్లాడతారో ఆ భాషని రాయడమూ, చదవడమూ చెయ్యగలిగితే, అది మాతృభాషలో చదవడమే. ఏ భాషలో మాట్లాడే పిల్లలకైనా, ఇంకా బడికి పోవడం ప్రారంభం కాకముందే, ఆ భాషలో వ్యాకరణ సూత్రాలన్నీ అలవాటైపోయి ఉంటాయి. ఆడ మనిషిని గురించైతే, ‘వచ్చింది’ అనీ మొగ మనిషిని గురించైతే ‘వచ్చాడు’ అనీ అనాలని తెలియడానికి బళ్ళోచేరి చదవనక్కరలేదు. ఒక్క ఆడమనిషిని గురించైతే, ‘వచ్చింది’ అనీ ఎక్కువ మంది మనుషుల గురించైతే ‘వచ్చారు’ అనీ ఆ తేడాల్ని మాట్లాడే భాషలోనే నేర్చుకోగలరు. అయితే, ‘అది స్త్రీలింగం– ఇది పుల్లింగం’ అనీ ‘అది ఏకవచనం– ఇది బహువచనం’ అనీ– ఈ వ్యాకరణ పదాలు ఉపాధ్యాయులద్వారా నేర్చుకునేవి. అలాగే, ‘నిన్న తిన్నాను. ఇప్పుడు తింటూ ఉన్నాను. రేపు తింటాను’ అని, గడిచిన– గడుస్తూ ఉన్న– గడవబోయే కాలాల పనుల్ని మాట్లాడాలన్నా, రాయాలన్నా, వ్యాకరణ పాఠాలు అక్కరలేదు. కాకపోతే, ఆ మూడు కాలాల్ని, ‘భూత–వర్తమాన భవిష్యత్కాలాలు’ అని– ఈ వ్యాకరణ పదాలు తెలుసుకోడానికైతే ఒక పాఠం కావాలి.

తెలుగులో, ‘వచ్చింది, వచ్చాడు, వచ్చారు’ అంటూ మూడు తేడాలు తెలిసివున్న పిల్లలకు, పరాయి భాషని నేర్పడం ప్రారంభమైనప్పుడు, ఆ భాషలో ఆ తేడాలు ఎలా వుంటాయో చెప్పడం చాలా తేలిక. తెలుగులో వున్న ఆ మూడు తేడాలు, హిందీలో కూడా అలాగే వుంటాయని చెప్పవచ్చు. ఇంగ్లీషులో అయితే, ఆ తేడాలు ఉండనే వుండవని రాసి చూపిస్తే, పిల్లలు ఆశ్చర్యపోతారు. మాట్లాడే భాషలో వ్యాకరణ సూత్రాలు కొన్ని తెలిసివుండటం వల్ల, వాళ్ళ ప్రశ్నలు వాళ్ళు వేస్తారు. మాట్లాడే భాషలో విషయాలు మొదట తెలిసివుంటేనే, ఏ పరాయిభాషని పరిశీలించడానికైనా ఆసక్తి మొదలవుతుంది. నాలుగైదేళ్ల పిల్లలకు, ఏనాడూ మాట్లాడని పరాయిభాషని బడిలో కూర్చున్న రోజునించీ వినిపిస్తే, భయపడే రోజులు మొదలైనట్టే!

మాట్లాడే భాషలో రాతా – చదువూ అలవాటై, వాచకాల్లో పాఠాలు చదవగలిగితే, ఇక నేర్చుకోవలసినవి, లెక్కలూ – సైన్సులూనూ. వీటిని కూడా మాట్లాడేభాషలోనే అయితే, నేర్చుకోవడంలో ఇబ్బందులు ఉండవు. ఏది నేర్చుకోవాలన్నా మాట్లాడే భాషలోనే అయితే, దానికి తక్కువకాలం సరిపోతుంది.!

మాట్లాడే భాషలో ఒక ‘రుచి’ ఉంటుంది. చదువు ఆ భాషలోనే సాగితే, అది కూడా ‘రుచి’గానే ఉంటుంది. అంటే చదివేటప్పుడు ఆ మాటలూ వాక్యాలు స్పష్టంగా తెలిసిపోతూవుంటే, అంతవరకూ తెలియని సమాజ విషయాలూ, ప్రపంచ విషయాలు, ప్రకృతి విషయాలూ...అన్నీ తేలిగ్గా అర్థమవుతూ వుంటాయి. చదివే వాక్యాలే అర్థం కాకపోతే, చదువంతా నిరుత్సాహంతో నిండుతుంది.

పిల్లలు అయిదారేళ్లవాళ్ళే అయినా, వాళ్ళు ఒక చందమామ

కథని మాట్లాడే భాషలోనే చదివితే, లేదా అదే కథని పరాయిభాషలో చదివితే రెండు సందర్భాల్లోనూ ఒకేరకం స్పందన ఉండదు. పరాయి భాషలు ఎప్పటికీ అక్కరలేదని కాదు. పరాయి భాషల్ని నేర్చుకోకపోతే, వేరువేరు ప్రాంతాల మానవుల మధ్య సంబంధాలే ఉండవు. పరాయి భాషలు హాయిగా నేర్చుకోవలసిందే. అయితే, ఎప్పుడూ? మాట్లాడే మాతృభాషలో చదువు ప్రధానంగా సాగుతూ వున్నప్పుడే. మాతృ భాష తర్వాతే పరాయిభాషలు!

చదువుని, ఏ పరాయిభాషతోనూ ప్రారంభించకూడదు. (ఈ మాతృభాషలో చదువు గురించి, ఇతర సమస్యలు కొన్ని ఉంటాయి. ఉదాహరణకి, ఒక తమిళ కుటుంబం తెలుగు ప్రాంతానికి బదిలీ అయి వచ్చిందనుకుందాం. ఆ తమిళ పిల్లలకి, తెలుగు బడుల్లో చదువులు ఎలాగ? గిరిజనుల్లో అనేక తెగల వాళ్ళ భాషలకు లిపే లేదు. వాళ్ళ పిల్లలకు చదువులు ఎలాగ? ఒక భాషలోకి, ఇతర భాషల మాటలు అనేకం కలిసిపోతూ ఉంటాయి. తెలుగులో రైలూ, బస్సూ, సైకిలూ, సినిమా, గేటూ, టిక్కట్టూ...ఇలాగ హిందీ నుంచి, సంస్కృతం నుంచి, ఇంకా ఇతర భాషల నుంచి. ఈ పరాయి మాటల్ని ఏం చెయ్యాలి? – ఏమీ చెయ్యక్కర్లేదు. కలిసిపోయిన పదాల్ని కలిపేసి ఉంచుకోవాలి. 'సైకిల్'నీ, 'రైలు'నీ, తీసెయ్యగలమా? ఇవి, మాతృభాషలో చదువుకు వ్యతిరేకం కాదు. సమస్య ఉందంటే, పరిష్కారం ఉంటుంది. అవన్నీ ఇక్కడ అనవసరం.

తెలుగు రాష్ట్రాల్లో, కొంతకాలంగా ఇంగ్లీషు మత్తు పట్టింది. దానికి రాజకీయ కారణాలు అనేకం ఉంటాయి. అయినా, ఆ చర్చ ఇక్కడ వొద్దు. చదువు సంగతే చూడాలి. ఒకటో తరగతి నుంచి ఇంగ్లీషు మాధ్యమం ద్వారానే చదువు చెప్పాలని ఒకవాదం. దానిమీద పోటీవాదం కూడా ఉంది. ఈ వాదం, రెండు మాధ్యమాలూ పెట్టాలంటుంది. ఒకటో తరగతి నుంచే ఇంగ్లీషులో చెప్పేది ఒకచోటా, తెలుగులో చెప్పేది ఇంకో చోటా అనీ! పిల్లల తల్లిదండ్రులు, తమకు ఏది ఇష్టమైతే అందులోనే తమ పిల్లల్ని పెట్టుకుంటారు అనీ! అది, తల్లిదండ్రుల 'హక్కు' అని, వాళ్ళ 'స్వేచ్ఛ' అనీ! హక్కులూ, ఇష్టాలూ, స్వేచ్ఛలూ, అన్ని విషయాలకూ వర్తించవు. మనకి జబ్బుచేస్తే డాక్టర్ దగ్గరికి వెళ్తాం; డాక్టర్ చెప్పినట్లు నడవాలి కదా? అలా గాక, 'అసలు డాక్టర్ వొద్దు స్వాములవారి దగ్గరికి వెళ్ళి, మంత్రం వేయించుకుని, చేతికి తాయెత్తు కట్టించుకుంటా. అదే నాకు ఇష్టం, నా హక్కు, నా స్వేచ్ఛ' అంటే, తర్వాత ఏం జరుగుతుంది? 'జబ్బుల' దగ్గర హక్కులూ– స్వేచ్ఛలూ పనికిరానట్టే, పిల్లల చదువుల విషయంలో, ఎవరి హక్కులూ, ఎవరి స్వేచ్ఛలూ పనికిరావు.

అహేతుక వాదనలు

ఇంగ్లీషు చదువుల గురించి ప్రధానమైన ప్రశ్న ఒకటి వుంది. 'ధనవంతుల పిల్లలు, ఇంగ్లీషు స్కూళ్ళల్లోనే చదువుతారు. పేదల పిల్లలైతే మాతృభాషలోనే చదవాలా?' అని. ఈ సమస్యను 'డబ్బు సమస్యగా చూస్తారు. డబ్బు ఉంటే ఇంగ్లీషూ, డబ్బులేకపోతే మాతృ భాషా – అన్నట్టు! కానీ, ఇది, డబ్బు సమస్యకాదు. చదువు సమస్య. 'చదువు' ఎప్పుడూ మాట్లాడే భాషలోనే ప్రారంభం కావాలి. ధనవంతుల పిల్లలకు కూడా ఇదే సూత్రం! దీన్ని ఎవరు అర్థం చేసుకోకపోతే, అది వాళ్ళ తప్పే. ఆ తప్పు చేసేవాళ్ళు తమ పిల్లలకు, చదువులో ఆనందాన్ని దొరకనివ్వకుండా, ద్రోహం చేస్తున్నారని అర్థం. ఇంకో వాదం ఉంది. 'ఇంగ్లీషులో చదివితేనే ఉద్యోగాలు గ్యారంటీ అని. ఈ వాదంమీద ఒక ప్రశ్న ఉంది. బ్రిటన్, అమెరికా ఇంగ్లీషు దేశాలే. అక్కడి పిల్లలు ఇంగ్లీషులోనే చదువుతారు. చదవని వాళ్ళు కూడా ఇంగ్లీషు మాట్లాడతారు. అలాంటి దేశాల్లో, నిరుద్యోగం ఎందుకు ఉంది? పెద్ద పెద్ద డిగ్రీలున్న వాళ్ళలో కూడా అనేకమందికి ఉద్యోగాలు ఎందుకులేవు? ఇదంతా ఇంగ్లీషు చదువు సమస్యకాదు. వేరే సమస్య. పెట్టుబడిదారీ విధానంలో టెక్నాలజీల్ని పెంచి, ఉత్పత్తుల తయారీకి అవసరమయ్యే శ్రమకాలాన్ని తగ్గిస్తారు. అయినా కార్మికుల పని కాలాన్ని తగ్గించరు. దాన్ని ఇంకా పెంచి, కార్మిక సంఖ్యనే తగ్గిస్తారు. ఇటువంటి కారణాల్ని ఇక్కడ వివరంగా చెప్పుకోలేం. చెప్పుకోవలసిన మాట ఏమిటంటే, ఇంగ్లీషు పండితులైతే ఉద్యోగాలు వచ్చేస్తాయనేది భ్రమ. ఇక్కడ ఇంతకన్నా చెప్పుకోవడం అనవసరం.

విషాదాంతమైన ఒక నిజాన్ని వింటారా? ఒక నిరుపేద కుటుంబంలో ఆడపిల్ల. తండ్రి రిక్షావాలా. తల్లి రోడ్ల స్వీపరు. పిల్ల తెలుగులో ఆసక్తితో చదువుతూ ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణురాలవుతూ ఉంది. అయినా, ఆ పిల్లని ఇంగ్లీషు మీడియం స్కూల్లోకి మార్చారు తల్లిదండ్రులు. వద్దని పిల్ల ఎంతో వేడుకొంది. పెద్దలు వినలేదు. పిల్లకి, ఇంగ్లీషుని శ్రద్ధగా నేర్పేవాళ్ళు లేరు. ఇక పిల్లకి ఫెయిళ్ళూ... చివాట్లే. మరో ఇంగ్లీషు మీడియం స్కూల్లోకి మార్చినా పిల్లకి రక్షణ మార్గం దొరకలేదు. తల్లిదండ్రులకే హక్కు. పిల్లకి హక్కులేదు! ఒక రోజు తండ్రి ఇంటికి వచ్చి చూస్తే, గదిలో మసికుప్పలో పిల్ల కాలిపోయి, ఆరిపోయి, తరిగిపోయి కనపడింది. ఇంగ్లీషు మోజు ఫలితం. తెలుగురాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్ని పరిశుభ్రం చేసి, వాటిని విశాలం చేసి, టీచర్ల సంఖ్య పెంచి, ఈ మాత్రపు మార్పులు చేస్తే – తెలుగు నిలబడుతుంది. పిల్లలకు మేలు జరుగుతుంది...

డిసెంబరు 22, 2019

'ఈనాడు' దినపత్రిక సౌజన్యంతో

స్పందనను వ్రాయండి

'అమ్మనుడి'లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520 004.
ఇ–మెయిల్ : *editorammanudi@gmail.com*

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

డా॥ఎ. చంద్రశేఖరరావు
9949605141

బోధనా మాధ్యమం: విద్యావిధానం

లక్ష్యం మంచిదైనా దగ్గర కదా అని అరణ్యమార్గంలో ప్రయాణించేటప్పుడు ఎదురుగానే కాకుండా కుడి ఎడమలు గూడ చూడవలసి వుంటుంది. 1959 – 60 సం॥లలో ఫిఫ్తుఫారం చదువు తున్న రోజులలో విద్యాబోధన ఇంగ్లీషులో ఉండాలా? తెలుగులో వుండాలా? అన్న విషయం మీద డిబేట్ జరుగుతుండేది. రెండు పక్షాలూ వాదించుకొనేవి. తరవాత కొంతకాలానికి తెలుగు అకాడమీ తెలుగులో పుస్తకాలు రాసింది. దీనికి ముందు అకాడమీ పెద్ద కసరత్తు చేసింది. ఇంటర్మీడియెట్ పుస్తకాలు ఏ మాండలికంలో రాయాలి అన్న విషయం కూడ చర్చకు వచ్చింది. అప్పుడు డిగ్రీలో కూడ పుస్తకాలు వచ్చాయి. తెలుగు మీడియం అమలుకు వచ్చే ముందే పెద్ద ప్రయత్నం జరిగింది. ఐతే లోపం ఏమిటంటే శాస్త్ర సాంకేతిక పదాలను అనువాదం చెయ్యడం. ఈ కారణంగా కొందరు విద్యార్థులు ఇంగ్లీషు వైపు మొగ్గు చూపుతున్నారు. నేడు విద్యాబోధనలో మార్పులు తీసుకొస్తున్నారు. కాబట్టి పాఠశాలలలో విద్యాబోధన పద్ధతి పరిశీలన చేయవలసిన అగత్యం ఏర్పడింది.

ముందుగా విద్యాబోధన లక్ష్యాలేమిటో తెలుసుకొందాం. knowledge, understanding, application (విషయ పరిజ్ఞానం, అవగాహన, వినియోగం) విద్యాలయాలలో ఉపాధ్యాయులు ఈ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బోధించవలసి వుంటుంది. తరవాత విద్యార్థి నేర్చుకొన్న విద్యను నిత్యజీవితంలో వినియోగించాలి. విద్య జీవించడానికి ఉపయోగపడాలి.

పై వాటిని ఎంతవరకు అమలు చేస్తున్నాం అన్న విషయాన్ని పరీక్షించడానికి, మూల్యాంకనం చెయ్యడానికి పద్ధతులున్నాయా? వాటిని అమలు చేస్తున్నామా? ఇప్పటి పరీక్షా విధానం విద్యార్థి జ్ఞానాన్ని మాత్రమే పరీక్షిస్తుంది. పోటీ పరీక్షలలో దేనిని పరీక్షిస్తున్నారు?. కొన్ని పరీక్షలలో ఐ.క్యూ, ని పరీక్షించడం జరుగుతుంది. ఇది ఆహ్వా నించదగ్గది. విద్యార్థులు ఎమ్‌సెట్ పరీక్షలో ప్రశ్న అర్థం కాకుండానే గుడ్డిగా టిక్కులు పెడుతున్నారు. తప్పుకి మైనస్ మార్కులుంటే ఈ అంధత్వాన్ని కొంతవరకు నివారించవచ్చు. ఇంజనీర్లు, డాక్టర్లు తప్పు చేస్తే కట్టడాలు కూలిపోతాయి. ప్రాణాలు పోతాయి.

రెండవది అవగాహనం. దీనికి కొలబద్ద ప్రస్తుత విద్యా విధా నంలో లెక్కలకు మాత్రం వుందని చెప్పవచ్చు. మిగిలిన సబ్జెక్టులకు లేదనీ చెప్పవచ్చు. మిగిలిన సబ్జెక్టులను అర్థం చేసుకున్నాడా లేదా అని తెలుసుకొనే పద్ధతులు ఉన్నా ఇప్పటి పరీక్షా విధానంలో లేదు. ముఖ్యంగా కాంపిటెటివ్ పరీక్షలలో లేదు. విషయ పరిజ్ఞానాన్ని పరీక్షిస్తున్నారు గాని, విషయావగాహనాన్ని పరీక్షించడం లేదు. విద్యార్థులు పుస్తకాన్ని తినేసి పరీక్షలో వాంతి చేసుకొంటున్నారు. పరీక్ష అయిపోయిన వెంటనే మళ్లీ కడుపు ఖాళీ, విషయం జీర్ణం కాలేదు. శోషణలేదు. అందుచేతనే ఎంసెట్లో మంచి ర్యాంకులు వచ్చినవారు గూడ తాము చదివిన పాఠాలలోని విషయాన్ని పరీక్ష మర్నాడే చెప్పలేకపోతున్నారు. వారికి ప్రాథమిక విషయాలు గూడ తెలియడం లేదు. కార్పొరేట్ సంస్థలు నడుపుతున్న జూనియర్ కాలేజీలలో టీచింగ్ లేదు. కోచింగ్ మాత్రమే వుంది. బోధనలేదు కాబట్టి ఏ మాధ్యమం ఐనా ఒక్కటే. ఇటువంటి కోచింగ్ సెంటర్లలో సబ్జెక్టు మెటీరియల్ దగ్గర పెట్టుకొని ఉపాధ్యాయుడు చెప్పిన జవాబు లను రాసుకోవడం లేదా ఎ బి సి డి లలో ఒకదానికి టిక్ చెయ్యడం చేస్తున్నారు. కొన్ని ప్రశ్నలకు జవాబులు ఉపాధ్యాయుని ఆలోచనా పరిధిని దాటి వుంటాయి. ఐతే ఉపాధ్యాయుడు ముందుగా చదువుకొని, వ్యాపకం పెట్టుకొని చెప్పడంచేత రాతి బొమ్మల్లాంటి విద్యార్థుల మధ్య నెగ్గుకొస్తున్నాడు. పేరుకి ప్రయోగశాల వున్నా పరికరాలు వుండవు, బొమ్మలలోనైన చూడని యంత్రాలు పనిచేసే విధానం వర్ణిస్తారు. ఈ విధమైన యాంత్రిక విధానం నచ్చని విద్యార్థులు క్లాసులు ఎగ్గొట్టాలి. దానికి అవకాశం హాస్టలులో వున్న వారికి వుండదు. ఆటలాడుకోవలసిన సమయంలో స్టడీ అవర్స్, బలవంతపు చదువు, ఇంటివద్ద తల్లిదండ్రుల పోరు. హాస్టలులో పర్యవేక్షకుని నిఘా. భౌతికమైన శిక్షలు, విద్యార్థులు ఒత్తిడికి తట్టుకో లేక గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకొంటున్నారు. రోగాన్ని కనిపెట్టి సరైన మందు వాడాలి. సుడి ఎక్కడుంటే చురక అక్కడే వెయ్యాలి.

విద్యార్థి విషయాన్ని అవగాహన చేసుకొనే విధంగా బోధించాలి. అందుకు ఒక భాషా మాధ్యమం కావాలి. ఆ భాష విద్యార్థి మనస్సులోకి చొరబడేటట్లుగా ఉండాలి. విద్యార్థి తాను నేర్చుకొన్న విషయాన్ని జీర్ణం చేసుకొని తన సొంత మాటలతో వ్యక్తం చేయ గలగాలి. బోధనకు భాషా మాధ్యమం ఏది కావాలి అన్నప్పుడు మాతృభాషలో మాత్రమే ఇది సాధ్యం అని మానసిక శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు చెప్తున్నారు. భాష మనస్సులో పుడుతుంది. మాటకు మనస్సు స్పందిస్తుంది. "వాడు నోరిప్పితే సంస్కృతం రా" అంటే వాడు అశ్లీల పదాలు పలుకుతాడన్నమాట!. తెలుగు మాధ్యమంలోని పాఠాలలో గూడ జననాంగాల పేర్లు సంస్కృతంలో వుంటాయి. వాటిని ఉపాధ్యాయుడు ఆంధ్రీకరించడు. పరభాషలో చెప్తే మనస్సు స్పందించదు. అందుకే మాతృభాషలో విద్యాబోధనం జరగాలంటారు. ఉపాధ్యాయుడు తన మనస్సులోని భావాలను విద్యార్థుల మనస్సుల లోకి ఎక్కించాలి. దీనికి ఒక భాషా మాధ్యమం కావాలి. మాతృభాష ద్వారానే అది సాధ్యం ఔతుంది. ఈ మాధ్యమం కూడ ప్రామాణిక భాషగా వుండవలసిన అవసరం లేదు. నిపుణుడైన ఉపాధ్యాయుడు రెండు రకాలైన మాధ్యమాలను ఉపయోగిస్తాడు బోధించడానికి వ్యవహారికం వాడతాడు. రాయవలసినవి చెప్పేటప్పుడు రాతభాష వాడతాడు. ఎందుకంటే మాట్లాడేటట్లు రాయడం సాధ్యం కాదు అంతేగాక విద్యార్థి తన సొంతమాటలో రాయగలగాలి. ఆవిధంగా విద్యాబోధన జరగాలి.

1953లో యునెస్కో ప్రాథమిక విద్యమీద ఒక మోనోగ్రాఫ్

విడుదల చేసింది. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి. వారికి మాతృభాషలో విద్యాబోధన జరగాలి. బహుభాషా ప్రాంతంలో భావవ్యక్తీకరణ సామర్థ్యం వున్నంత వరకు మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగించాలి. అందరికీ ప్రాథమిక విద్య అందించాలి అని యునెస్కో సూచించింది.

భాషా బోధన వేరు, భాషలో బోధన వేరు అన్న విషయాన్ని గ్రహించలేనంత వరకూ ఎన్ని చర్చలు చేసినా ప్రయోజనం లేదు. మాతృభాష, పరభాష అన్న విభజనే కాని 1, 2, 3 లాంటి అంకెలతో ఫస్టు లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్, థర్డ్ లాంగ్వేజ్ అని చెప్పడం అశాస్త్రీయం. నిర్బంధంగా తెలుగు బోధిస్తున్నాం అనడం ఏమిటి? తెలుగుభాష ఎవరికి బోధిస్తున్నారు. తెలుగురాని వాడికా? తెలుగు వచ్చిన వాడికా ? తమిళులకు గాని కన్నడిగులుకు గాని ఒరియా వారికిగాని తెలుగు బోధించవచ్చు. తెలుగు మాతృభాషగా గలిగి, తెలుగులో మాట్లాడగలిగి, తెలుగులో తన భావాలను చెప్పగలిగిన వాడికి ఉపాధ్యాయుడు బోధించేదేముంటుంది!?. మౌఖిక భాషకు అక్షరరూపం ఇవ్వడం కోసం అక్షర సంకేతాలు నేర్పుతున్నారు. ఆ భాషకు మెరుగులు దిద్ది ప్రామాణికమైన భాషనేర్పడానికి ప్రయత్ని స్తున్నారు. ప్రయత్నం ఎందుకన్నానంటే డిగ్రీ చదువుతున్న విద్యార్థులు గూడ గ్రామ్యంలో మాట్లాడుతున్నారే గాని ఆమోదయోగ్యమైన భాష మాట్లాడడం లేదు లాంగ్వేజ్ ల్యాబ్‌లో నేర్పేది ప్రామాణికమైన ఉచ్చారణ వినడం, అర్థం చేసుకోవడం. ఉచ్చరించడం, ఇవి మాతృభాపకు ఏవిధంగా ఉపయోగ పడతాయి. 15 సంవత్సరాల మాతృభాషలో చదువేమైంది. ఏ భాషనైనా 40 రోజులలో నేర్చుకొని ఆ భాషలో సంభాషించే విధానాలున్న ఈ రోజులలో భాష నేర్చుకోవ డానికి ఇన్ని సంవత్సరాలు వృధా చేయడం ఎందుకు? బి.ఎ. పట్టా కోసం కొందరు ఆమెరికా విద్యార్థులు ఆరు మాసాలు, లేక ఐదు వారాలు ఆంధ్రప్రాంతాలలో వుండి తెలుగు నేర్చుకోవడం లేదా? విదేశీయాత్రికులు వీలుంటే తాము పర్యటించబోయే ప్రాంతీయ భాషలను నేర్చుకొనే వస్తారు...

తెలుగు భాషను నిర్బంధంగా నేర్చుకోవాలనే నిబంధన విధిస్తు న్నారు. తెలుగు క్లాసులో నేర్పేదేమిటి? మరుగుపడిపోయిన, వాడుకలో నశించిపోయిన పదాలు, వ్యాకరణం, ఛందస్సు, అలం కారాల వంటి శాస్త్ర విషయాలు. ఇవి నిత్యజీవితంలో ఏవిధంగా పనికొస్తాయి. పనికొచ్చే చదువు చెప్పాలి. రాత అలవాటుకోసం భావాలను చక్కగా రాతలో తెలియజేయడంకోసం, రచనలను ప్రోత్స హించాలి. వ్యాసం, కథ, గేయం, పద్యం మొదలైన వాటిని రాయిం చాలి. తెలుగులోనికి అనువాదం చేయించాలి. దీనివల్ల సృజనాత్మక రచనలు చేయలేక పోయినప్పటికీ తెలుగులో రాయడం అలవాటౌతుంది. ప్రపంచ ప్రసి ద్ధులైన రచయితలందరూ వారి మాతృభాషలోనే రచనలు చేశారు. అవి ఇంగ్లీషులోకి అనువాదం ఐతే వాటిని మనం చదువుతున్నాం. మూలభాషలోని పరిమళం అనువాదంలో ఉండదని తెలిసిన కొందరు సాహితీ వేత్తలు అయామూలభాషలను నేర్చు కొన్నారు...

ఇంగ్లీషు భాషలో భాషేతర విషయాల బోధన గురించి చర్చిద్దాం. అనుభవంలోని విషయాలను మాత్రమే ప్రస్తావిస్తాను. నేను యస్.యస్.ఎల్.సి. వరకు తెలుగులోనే చదువుకొన్నాను. పి.యు.సి. ఇంగ్లీషు మీడియంలో చదువుకొన్నాను. క్వార్టర్లీ పరీక్షలు, హాఫియర్లీ పరీక్షలు అయిపోయాయి. మొదటిబెంచీలో కూర్చొన్న ఒక తెలివైన విద్యార్థి బాగా మార్కులు తెచ్చుకొన్నవాడు – ప్రిపరేషన్ హాలీడేస్ ఇస్తారనగా ఒకరోజు జుఆలజీ క్లాసులో What is meant by 'anus' అని లెక్చరర్‌ని అడిగాడు. ఆ లెక్చరర్ తిట్లవర్షం కురిపించాడు. ఇక మన ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం ఎంతో చూడండి. ఎ.జి. ఆఫీసు నుండి ఒక అబ్జక్షన్ వచ్చింది. అందులో ఇలా వుంది. "in this case he was allowing sr.scale w.e.f. 1997 instead of 10/2001" కర్త ఎవరో కర్మ ఎవరో తెలీని ఇంగ్లీషు రాతలు. ఇదీ ఇంగ్లీషుని అర్థం చేసుకొన్న విధానం.

మాకు డిగ్రీలో శాస్త్ర విషయాలను ఇంగ్లీషులో బోధించినప్ప టికీ వాటిని నిత్యజీవితంలోని అనుభవాలతో సంధానం చేసేటప్పుడు తెలుగులోనే చెప్పేవారు. 50 సంవత్సరాల క్రితం చెప్పిన విషయాలు ఇప్పటికీ గుర్తున్నాయి. బహుభాషావేత్త, ఆధునిక సాహిత్య విమర్శకుడు రోణంకి అప్పలస్వామి మాస్టారు డిగ్రీలో మాకు ఇంగ్లీషు పద్యభాగం చెప్పేవారు. క్లిష్టమైన భావాలను బోధించవలసి వస్తే తెలుగులోనే చెప్పేవారు. విద్యార్థి రసానుభూతి పొందాలి. అన్నదే అతని భావం.

లెక్కలు లాంటి సబ్జకులను ఏ మాధ్యమంలోనైనా బోధించ వచ్చు. ప్లస్, మైనస్, ఈజ్ ఈక్వెల్ టు, హోల్ స్క్వేర్, హోల్ క్యూబ్ వంటి పదాలు ఇంగ్లీషువి కావా? సిగ్మా, పై, ఫై డెల్టాలాంటి పదాలు ఏ భాషలోవి అని ఎవరైనా అడిగారా? విద్య వ్యవహారానికి ఉపయోగ పడాలి, రాకెట్ ఎస్కేప్ వెలాసిటీ చెప్పగలిగేవాడు 30 కె.యమ్ దూరంలో వున్న రైలు గంటకు 80 కె.యమ్ వేగంతో వస్తుంటే మన దగ్గరకు రావడానికి ఎంత సమయం పడుతుంది? అని అడిగితే సమాధానం చెప్పగలడా?

అవసరాన్నిబట్టి భాషను వాడుకొంటాడు. వాడుకభాషలో వ్యవహారం సాగిస్తారు. నేను హైస్కూలులో పనిచేస్తున్నప్పటిమాట. రేపు ఏం పరీక్షరా?" అని అడిగితే కొందరు విద్యార్థులు "మూగభాష" (హిందీ) అని చెప్పారు. వారికి పరీక్షలో రాయడం వచ్చు గాని, చదవడం రాదు. పెద్దయిన తరవాత వారిలో కొందరు వ్యాపారస్తులై అనర్గళంగా హిందీ మాట్లాడుతున్నారు. మన విద్యావిధానం ఎలాగుందో చూడండి. మన ఇంగ్లీషు, వ్యవహారానికి ఎంతవరకు ఉపయోగ పడుతుంది. ఇంగ్లీషులో చదువుకొని అమెరికా వెళ్ళాలా? ఇంగ్లాండు వెళ్ళాలా ? యు.కె. ఇంగ్లీషు నేర్చుకోవాలా? యు.యస్, ఇంగ్లీషు నేర్చుకోవాలా?

కొన్ని పరికరాలు కొంటే వాటితోపాటు వాటిని వినియోగించే విధానం తెలిపే పుస్తకాలు ఇస్తారు. అవి ఇంగ్లీషుతో పాటు జపాన్, ఫ్రెంచ్, జర్మనీ, ఇటాలియన్ భాషలలో వుంటాయి. అంటే ఈ రాతలు వినియోగదారుల కోసమే గదా వారు చదువుకొనే భాషలో రాస్తు న్నారు. జపాన్, చైనా మొదలైన దేశాలలోను, కొన్ని ఐరోపా దేశాలలోను ఇంగ్లీషు భాష వ్యవహారానికి పనికి రాదు. మన పొరుగు రాష్ట్రాలలోనూ పనికిరాదు. తమిళం నుండి తెలుగులోకి డబ్ చేసిన సినిమా పేర్లు చదువుకొందికీ పనికిరాదు.

ఇప్పుడు ఇంటర్నెట్ తెలుగులో గూడ వుంది. తెలుగులో ప్రశ్నించవచ్చు. ఒక యంత్రం ఏవిధంగా పనిచేస్తుందో తెలుసు

కోవాలని ఇంగ్లీషులో అడిగితే సమాధానం వస్తు ప్రదర్శన ద్వారా రష్యన్ భాషలో వచ్చింది. బొమ్మలు చూసుకొనే అర్థం చేసుకొన్నాను.

మాపూర్లో యస్.యస్.ఎల్.సి చదివిన వాళ్ళు పూర్వపు ఇంటర్, పి.యు.సి. చదివి ఇంజనీర్లయినవారు వున్నారు. పి.యు.సి. చదివిన తరవాత ఇంజనీరింగులో సీటు వస్తే స్కాలర్షిప్‌తో చదువు కోవడం. సీటు రాకపోతే స్టైయిఫండుతో టీచర్ ట్రయినింగై ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించడం. అంతే. ఇంచుమించు అందరూ పేద చేనేత కార్మికుల పిల్లలే. హయ్యర్ సెకండరీ నుండిగూడ ఇంజనీర్లయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివి కోచింగ్ లేకుండా ఇంజనీర్లయినవాళ్ళూ వున్నారు. ఇంచు మించు అందరూ పేద చేనేత కార్మికుల పిల్లలే. సగటున ఏడాదికి కనీసం ఇద్దరైనా ఇంజనీర్లుంటారు. ఇప్పటికి దగ్గర దగ్గర వందమంది ఇంజనీర్లుంటారు. ఇరవై వరకు అమెరికాలో వున్నారు. అందరూ తెలుగు మీడియంలో చదువుకొన్నవారే....

ఇంగ్లీషు మీడియంలో చదువుకొంటే పెద్ద ఉద్యోగాలు వస్తా యనుకొనేవాళ్ళు పదవ తరగతి వరకు సి.బి.యస్.యి. సిలబస్‌లో చదివించి స్టేట్ సిలబస్‌లో ఇంటర్ మీడియట్ ఎందుకు చదివిస్తు న్నారు. ఒకటే లక్ష్యం. ఇంజనీరింగ్ తరవాత అమెరికా. గత పది సంవత్సరాలలో పెద్ద మార్పు వచ్చింది. విద్యవ్యాపారం అయిపోయిన తరవాత ఇంటర్మీడియట్ ఇంగ్లీషు మీడియంలో కార్పొరేట్ సంస్థలలో చదివించడం కోసం పట్టణాలకు తమ పిల్లలను పంపుతున్న తల్లి దండ్రులు గూడ వున్నారు. వారిలో ఉపాధ్యాయులూ ఉన్నారు. ఐతే ఇంగ్లీషు మీడియం పిల్లలతో పోటీపడి మంచి ర్యాంకులు సంపా దించిన తెలుగు మీడియంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొన్న పిల్లలూ వున్నారు. కాని, వారి ఫొటోలు ప్రకటించే సంస్థలేవి? ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేస్తూ, వ్యాపార ప్రకటనలలో లాగ ఫీజులో రాయితీ వుంటుందని, ఎ.సి. గదులలో పాఠాలు చెప్తారని ప్రచారం చేసేవారు ప్రభుత్వ పాఠశాలలో వున్నారా?

నేటి విద్యావిధానం పరిశీలిద్దాం. మోడల్ ఎలిమెంటరీ స్కూళ్ళలో 1, 2, తరగతులకు నిర్బంధంగా ఇంగ్లీషు మీడియంలో పాఠాలు చెప్తున్నారు. రాబోయే సంవత్సరంలో 3వ తరగతి ఆ తర్వాత 4వ తరగతి. ఈ విధంగా అమలు చేస్తారు. మోడల్ హైస్కూళ్ళలో 6 నుండి ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియంలోనే చెప్తున్నారు. సక్సెస్ హైస్కూళ్ళలో 6 నుండి 10 వరకు ఐచ్ఛికంగా ఇంగ్లీషు మీడియం వుంది. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ఉన్నా ప్రయివేటు స్కూళ్ళలో ఎందుకు చదివిస్తున్నారు? ప్రయివేటు స్కూళ్ళు ఒకటికి పైబడి ఉంటే వాటిలో మళ్ళీ ఎంపిక కోరుకొన్న స్కూలులో సీటు రాకపోతే ఏదో ఒకటి. ప్రయివేటు స్కూళ్ళలో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే అవి మోడల్ ఎలిమెంటరీ స్కూళ్ళు కావా? సక్సెస్ హైస్కూళ్ళు కావా? బస్సులలో ప్రయాణం చేసి పట్టణాల లోని ప్రయివేటు స్కూళ్ళలో చదివే విద్యార్థులను గ్రామాలలోని ప్రభుత్వపాఠశాలలో చేర్పిస్తే అవి మోడల్ ఎలిమెంటరీ స్కూళ్ళు కావా?

సవర పిల్లలను బడికి ఆకర్షించడం కోసం వారి మాతృభాష లోనే 1 వ తరగతి నుండి 5 వరకు పుస్తకాలు రచించారు. 2004 నుండి అమలులోకి వచ్చింది. కొన్ని సంవత్సరాల పరిశోధనానంతరం మాత్రమే అమలులోకి వచ్చింది. ఇప్పుడు వారు తమ భాషలో చదువుకొనే అవకాశం కోల్పోతున్నారు.

ఆంగ్లేయుల పాలనలో అధికారులు ప్రజల భాష నేర్చు కొన్నారు. వారి భాషలోనే వ్యవహారం సాగించారు. క్రైస్తవ మిషనరీలు ప్రజలభాషలో పుస్తకాలు రాశారు. 1912లో వెల్‌ష్మన్ అనే ఫారెస్టు ఆఫీసర్ సవరభాష నేర్చుకొన్నాడు. ఆ భాషలో రచనలు చేశాడు. విదేశీయుల పాలనలో వంద సంవత్సరాల క్రితమే సవర పాఠశాల లుండేవి. సెరంగొలో సవర ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం ఉండేది. వాడుక భాష రాకపోవడం వల్ల ప్రజలకు దూరమైపోతారు. ఒక అమ్మాయి కె.జి. పంచదార కొని ఎంత అని అడిగింది. కొట్టువాడు 'ముప్పై ఐదు' అన్నాడు. మళ్ళీ అడిగింది. మళ్ళీ ముప్పై ఐదు' అన్నాడు. నాకు విషయం అర్థమయింది. 'థర్టీ ఫైవ్' అని చెప్పాను.

తెలుగు సినిమాపేర్లు ఇంగ్లీషు అక్షరాలలో వుంటున్నాయి. 'Pచ్చేడు' అని రెండు లిపులలోను రాసిన సినిమా వుంది. టి.వి. చానల్‌లలో చాలా కార్యక్రమాల పేర్లు ఇంగ్లీషులోనే వుంటు న్నాయి. జీవద్భాష జీవనది లాంటిది. భాష పరిణామ శీలి. భాషలో కొత్త పదాలు చేరుతూనే వుంటాయి. ఏభాషా పదాన్నైనా తనలో కలిపేసుకొనే శక్తి తెలుగు భాషకు వుంది. కాని, ఇంగ్లీషు మాధ్యమం వల్ల తెలుగుభాష మారిపోతుంది. భవిష్యత్తులో వార్తా పత్రికలవాళ్ళూ, టి.వి.వాళ్ళూ అల్పపీడనం, ద్రోణి, ఉపరితల ఆవర్తనం, భూకంపం, ఎన్నికలు, ఆధిక్యం, గృహమంత్రిలాంటి అనువాద పదాలు రాయ వలసిన పనిలేదు. ఇంగ్లీషు మాటలు తెలుగులో రాస్తాం!.

కొన్ని పరీక్షలు ఉపాధ్యాయుని సహాయం లేకుండానే ఇంటి వద్ద చదువుకొని ప్రయివేటుగా పాసవ్వొచ్చు. బోధనా అక్కరలేదు. ఉపాధ్యాయుడే లేనప్పుడు బోధనా మాధ్యమం ప్రసక్తే రాదు. వాళ్ళుగూడ పోటీ పరీక్షలలో నెగ్గుకొస్తున్నారు.

నిత్యజీవితంలో వాడుకొనే లెక్కలు ఎక్కాలు, ఇంగ్లీషు మీడియంలో చదువుకొనే పిల్లలు టూ వన్ జార్ టూ, టూ, టూ జార్ ఫోర్...టూ టెన్ జార్ ట్వంటీ అని చదువుతుంటే మురిసిపోని తల్లిదండ్రులుంటారా! ఈ జార్ ఏమిటి? పిల్లలకు తెలుసా? ఉపాధ్యా యులకు తెలుసా? ఎక్కాలను అక్షరాలలో రాయవలసి వచ్చే టప్పుడు కదా స్పెల్లింగ్ అవసరం వచ్చేది ?

కాన్వెంటులో చదువుకొని బాగా ఇంగ్లీషు మాట్లాడేవారు ఉండే వారు. వారు లెక్కలలో బాగా వెనుకబడి వుండేవారు. వీరెందుకు పనికొస్తారురా అంటే మెడికల్ రిప్రజెంటేటివ్‌గా బాగా పనికొస్తారని హేళన చేసేవాళ్ళం.

పత్రికలవాళ్ళూ, టి.వి. వాళ్ళు సేకరించే ప్రజాభిప్రాయం కూడ శాస్త్రీయమైనది కాదు. దానిలో సింపుల్ ఎన్యూమరేషన్ అనే దోషం వుంది. యస్. నో. లాంటి సమాధానాలు శాస్త్రీయం కావు. సర్వేల ప్రకారం 70 శాతం ప్రజలు (టి.వి. చూస్తూ సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ పంపిన ప్రజలు) ఆంగ్లమాధ్యమాన్ని కోరుతున్నారు అని చెప్పడం పాక్షిక సత్యం. ఎంతమంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియం కోరుతున్నారు. కొన్ని ఇంగ్లీషు మీడియం స్కూళ్లకు వెళ్ళాను. విద్యార్థులందరూ తెలుగు మీడియం కోరుకొంటున్నారు.


మధురాంతకం నరేంద్ర
9866243659

శాస్త్రీయ భాషగా తెలుగు

తెలుగుభాష ప్రపంచంలోని యే యితర భాషకన్నా తక్కువైనది గాదనీ, తెలుగుకు అంతర్జాతీయ భాషకాదగిన గొప్ప లక్షణాలన్నీ వున్నాయనీ చాలామంది నొక్కి చెప్తూ వుంటారు. అయితే మన తెలుగు అంతర్జాతీయ భాషగా రావలసిన గౌరవాన్ని పొందడానికి మారుగా, తెలుగు రాష్ట్రాల్లోనే యింగ్లీషుకంటే తక్కువ ప్రాచుర్యాన్ని పొందడం చాలామంది మాతృ భాషాభిమానులకు బాధ గలిగిస్తోంది. యీ సందర్భంలో తెలుగుభాషకున్న గొప్పతనాలనూ, పరిమితులనూ, నిర్మోహంగా గుర్తించి తెలుసుకోవల్సిన అవసరమెంతో వుంది.

యిటీవల వొక యింటర్వ్యూలో మాట్లాడుతూ వెల్చేరు నారాయణరావుగారు మనం మాతృభాష అనే అనవసరపు మమత్వంలో పడకుండా, తెలుగును శాస్త్రీయ భాషగా మార్చడమెలా గన్న ఆలోచననింకయినా ప్రారంభించాలని సూచించారు. కొన్ని శతాబ్దాల పాటూ తెలుగువాళ్లకు సంస్కృతమే శాస్త్రీయ భాషగా వుండేదనీ, యింగ్లీషువాళ్లు వచ్చాక యింగ్లీషు సంస్కృతం స్థానంలోకి వచ్చిందనీ ఆయన వాదిస్తారు. అలా మనకు చాలా శతాబ్దాలపాటూ ఆలోచనలకు సంస్కృతమే మాధ్యమంగా వుండేదనీ, కథలూ, నవలలూ, లేదా కావ్యాలూ, ప్రబంధాలూ వంటి సాహిత్య రచనలు చేసుకునే సాహిత్య భాషగా మాత్రమే తెలుగు వుందనీ ఆయన అంటారు. యిప్పటికి గూడా ఆలోచించే వాళ్లు యింగ్లీషులోనే రాస్తున్నారనీ, యిప్పుడు మనకు రెండు భారతదేశాలున్నాయనీ, యింగ్లీషులో రాసే వాళ్ల భారతదేశమూ స్థానిక భాషల్లో రాసే వాళ్ల భారతదేశమూ వేరుగా వున్నాయనీ, యింగ్లీషులో రాస్తున్న చాలా పుస్తకాలు తెలుగులోకి రావనీ ఆయన వాదించడంలో కొంత అత్యుక్తి వున్నా అందులో సత్యమే పెద్దది. ఆలోచనలకూ, శాస్త్ర విషయాలను అందించడానికీ తెలుగును అనువైన భాషగా మార్చుకునే ప్రయత్నాలు చిత్తశుద్ధితో యిప్పటికైనా మొదలు పెట్టాలని మనం తెలుసుకుని తీరాలి. తెలుగు విద్యార్థులు యింగ్లీషు మాధ్యమానికెందుకెళ్తున్నారో విస్పష్టంగా విచికిత్సచేసి తెలుసుకుంటేనే మనకు నిజాలు అర్థమవు తాయి. యింగ్లీషు చదువుకోకపోతే కోల్పోయే విజ్ఞానమేమిటో, అది తెలుగులో యెందుకు లేదో గమనించాలి. కొత్త ఆలోచనలు తెలుగే మాధ్యమంగా వున్న వాళ్లల్లో గూడా రాగలిగే పద్ధతులకోసం అన్వేషిం చాలి.

కొత్త ఆలోచనలు వచ్చినప్పుడే కొత్తగా మాటలు పుట్టుకొస్తాయి. యింగ్లీషుభాష సూర్యుడి వెలుతురు పడుతున్న అన్ని భాషల నుంచీ అనేక పదాలు అరువు తెచ్చుకుంది. తెచ్చుకుంటూనే వుంది. యింగ్లీషు



ఇప్పుడీ సమస్య కేవలం సాంస్కృతికమైనది మాత్రమే కాదనీ, దీనికి చాలా రాజకీయ కారణాలున్నాయనీ గుర్తించాలి. సమస్య యేమిటో, అదెక్కడుందో, తెలుసుకోగలిగినప్పుడే, దాని పరిష్కారాలను వెతుక్కోగలుగుతాం.

నిఘంటువులు ప్రతి సంవత్సరమూ యిలా అరువు తెచ్చుకున్న పదాల్ని ప్రత్యేకంగా పేర్కొంటూ వుంటాయి. అలా **యితర భాషా పదాల్ని అరువు తెచ్చుకోవడం తప్పుగాదు. చాలా వరకూ యిది అవసరం గూడా! భాష గూడా మానవ జీవితంలాగే వొక జీవనది. ప్రవహించడం, పరిణామాల్ని పొందడం, దారిలో చాలా వాటిని తనదిగా మార్చుకుని చేర్చుకుంటూ సాగడం దాని సహజ స్వభావం. అయితే అనవసరమైన శుభ్రతను, తనదైన విశిష్టతను నిల్పుకోవడ మెలాగన్నదే ప్రశ్న. పైగా యెంతవరకూ యిలా కలగలుపుకోవచ్చు, దీనికి అవధులూ, యెల్లలూ యేవిటన్నది తేల్చడం చాలా కష్టం. యిది ఆయా వ్యక్తుల అభిరుచులూ, అవగాహనలపైన ఆధారపడి వుంటుంది.** యింగ్లీషు రొమాంటిక్ కాలపు కవులూ, బెంగాలీలో రవీంద్రుడూ మామూలు జనాలు మాటాడుకునే మాటల్ని తమ రచనల్లో వాడినప్పుడు సంప్రదాయవాదులు తమ భాషను పాడు చేస్తున్నారని గొల్లుమన్నారు. మాస్తి వేంకటేశ అయ్యంగారు (గొప్ప కన్నడ రచయిత. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. రవీంద్రుడి సాహిత్యంపైన విమర్శలు వెలయించిన తొలి విమర్శకులలో వొకరు) యే భాషయినా యిలా పాడుగావడమన్నదే దాని సౌభాగ్యమని ప్రకటించాడు.

యింతా రాసిన తర్వాత – వొకసారి నేను రాస్తున్న వాక్యంలోనే 'యింటర్వ్యూ' అనే పదముంది. దాని బదులుగా ముఖాముఖి అనీ వాడవచ్చు. అయితే ముఖాముఖి అని వాడడం మొదట్లో కొంత కొత్తగానే వుండవచ్చు. వాడుతూ వుంటే అలవాటవుతుంది. డిటాచ్‌డ్ అనే మాటకు నిర్మోహం అని మాటనూ, సెంటిమెంట్ అనడానికి బదులుగా అనవసరపు మమతత్వం అనీ రాశాన్నేను. యీ తెలుగు మాటలు యింగ్లీషులోనే అనుకుంటున్న ఆలోచనను స్పష్టంగా తెలుగు పాఠకులకు చేరుస్తున్నాయా, లేదా అన్నది ప్రశ్న. యిక 'పేరాగ్రాపు' అనే మాటకు తెలుగు మాట వుందా!

యే భాషనయినా శాస్త్రీయ భాషగా మార్చుకోవాలంటే కొత్త ఆలోచనలకనుగుణంగా కొత్త మాటలు తయారు చేసుకోవాలి. అలా తయారు చేసుకున్న చాలా మాటలు కొత్తలో కృత్రిమంగానే వుండొచ్చు. కానీ అలవాటు పడ్డాక సహజంగా మారుతాయి. శాస్త్రీయ గ్రంథాల్ని తెలుగులోకి అనువాదం చేసినప్పుడు మన వాళ్లు చాలా యిబ్బందులు పడ్డారు. అయితే చాలా కొత్త మాటల్ని వాళ్లు తయారు చేసుకోగలిగారు.

"క్షీరదాలు' (మేమల్స్) ను గురించి చెప్తూ అవి అంతరోష్ణ లేదా స్థిరోష్ణ జీవులు; వీటికి ద్వైకాండెలిక్ కపాలం, కింద దవడ అర్ధభాగం ఒకే ఒక్క ఎముక, దంతస్థితి కలిగి వుంటుంది. ఇది కపాలంలోగల శల్కలాస్థితో సంధానింపబడి వుంటుంది" – యిలా చెప్పుకుంటూ పోయినప్పుడు, యింగ్లీషు పదాలూ, కొన్ని అనువాద పదాలూ పంటికింద రాళ్లలా యిబ్బంది పెడతాయి. అయితే యిలాగే చదువుకోవలసిన అవసరం వచ్చినప్పుడూ, యిలాగే చదువుకుని నేర్చుకున్నందువల్ల యిబ్బందులు లేనప్పుడూ, విద్యార్థులు యిలాగే చదువుకుంటారు.

శాస్త్రీయ జ్ఞానం అన్నదాన్ని వుద్యోగమనే వుపాధి కల్పనతో ముడిబెట్టినప్పుడు, యిలా తెలుగులో మాత్రమే శాస్త్రీయ జ్ఞానమున్న వాళ్లకు వుద్యోగాలు దొరకడంలో యిబ్బందులు లేనప్పుడు, తెలుగులో శాస్త్రీయజ్ఞానాన్ని పొందడానికెవరూ జంకరు. ప్రపంచంలోని శాస్త్రీయజ్ఞానమంతా తెలుగులో దొరుకుతుందా? లేదు. దొరకడానికేం చేయాలి? తెలుగులో మాత్రమే శాస్త్రీయ పరిజ్ఞానమున్న వాళ్లకంతా మన తెలుగు ప్రాంతాల్లోనే ఉపాధిని యేర్పాటు చేయగలమా? యీ ప్రశ్నలకిప్పుడు సరైన సమధానాల్ని తెలుసుకోవడానికి సందేహించ గూడదు.

అమెరికాలో చాలా సంవత్సరాలపాటు కంప్యూటర్ శాస్త్రంలో ఆచార్యుడుగా పనిచేసిన అప్పాజోస్యుల సత్యనారాయణగారొకసారి నాకో సంగతి చెప్పారు. అక్కడ ఆయన పాఠం చెప్పే తరగతిలో కొందరు చైనా విద్యార్థులు గూడా వుండేవాళ్లట. పాఠం చెప్తున్నప్పుడు తరగతిలోని మిగిలిన విద్యార్థులలో – భారతీయులు గూడా చాలామందే వుండేవాళ్లట – పోలిస్తే చైనా విద్యార్థులు తికమక పడుతూ వుండేవాళ్ళట. అయితే క్లాసు పూర్తవగానే వాళ్లు వెళ్లి తమ అధ్యాపకుడ్ని నేరుగా కలిసి, తమ సందేహాల్ని చెప్పుకునేవాళ్లట. అధ్యాపకుడు యింగ్లీషులో వివరిస్తున్నప్పుడు, వాళ్ళు అనుమతి తీసుకుని తమ గదులకు వెళ్ళి, చైనా భాషలో అదే విషయాలున్న పుస్తకాల్ని తిప్పి చూసి, తాము విన్న పాఠమూ, తమ దగ్గరున్న చైనా భాష పుస్తకంలోని పాఠమూ వొకటోగాదో తరచి చూసుకునేవాళ్ళట. తమ చైనా పుస్తకంలోని అదే పాఠాన్ని కనిపెట్టిన తర్వాత, వాళ్ళు తమ భాషలో ఆ పాఠాన్ని చదువుకుని, త్వరగా అర్థం చేసుకునే వాళ్ళట. యింగ్లీషుభాషలో ఆ పాఠాల్ని చైనీయులకంటే త్వరగా అర్థం చేసుకున్న భారతీయ విద్యార్థులంతా వుద్యోగాలకోసం అమెరికాపైనే ఆధారపడుతున్నారని మనకు తెలుసు. మనతో పోలిస్తే చైనావంటి దేశాల్లోని విద్యార్థులు తమ భాషల్లోనే తమ వునికినీ, మనికినీ వికసింపజేసుకోగలగడానికున్న కారణాల్ని యిప్పటికైనా వెతికి పట్టుకోవాలి.

ఇప్పుడీ సమస్య కేవలం సాంస్కృతికమైనది మాత్రమే కాదనీ, దీనికి చాలా రాజకీయ కారణాలున్నాయనీ గుర్తించాలి. సమస్య యేమిటో, అదెక్కడుందో, తెలుసుకోగలిగినప్పుడే, దాని పరిష్కారాలను వెతుక్కోగలుగుతాం.

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి


డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

తూర్పుగోదావరిలో జానపద జీవనం-ఒడిదుడుకులు

తెలుగులో ఆదికవి నన్నయ ఐతే, అంతకుముందునుండీ అందివస్తున్న ప్రజాసాహిత్యాన్ని పోగుచేసి వర్గీకరించిన వ్యాసుడు నేదునూరి గంగాధరం. సంప్రదాయ సాహిత్యంలో కథాసాహిత్యాన్ని కాశీమజిలీ కథలుగా కూర్చినది మధిర సుబ్బన్న దీక్షితులు. తెలుగుగిరిజనుల వాఙ్మయం పోగుచేసి, వారిని ఉద్యమపథాన నడిపించినవాడు 'శక్తి' శివరామకృష్ణ. కొండరెడ్ల బతుకు కథలను, అమ్మనుడి పత్రికలో ధారావాహికంగా వ్రాసిన గిరిజన సంప్రదాయ వైద్యుడు,కళాకారుడు మారేడిమిల్లి పల్లాల బొర్రంరెడ్డి.

పామర సాహిత్య కేతనం గంగాధరం : 'గ్రామీణులలో సాధనసంపత్తితో పాటు, శాస్త్రజ్ఞానం, రసహృదయం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, వినోదాలు ఉన్నాయి. పట్టణాలలో పెరిగిన వారికే వీటిమీద విశేషాధికారం పరిమితం కాలేదు. ప్రజలు జీవనానికి చాలాకష్టపడేవారు. వారి జీవితంలో ఒకఉత్సాహం ఉండేది. రసజ్ఞాన ప్రేరేపణలుండేవి. ఆధునిక మానవుడికి గ్రామీణుడు సిగ్గరిగాను, కలుపుగోలుతనం లేనివాడుగా, కొత్త వాళ్ళను చూస్తే భయంతో ముడుచుకుపోయేవాడిగా కనిపిస్తాడు. జానపదులకు మేధావుల ఆలోచనా పద్ధతులు పరిచితం కావు' అని ఆచార్య బి.రామరాజు (ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్యము, సంస్కృతి 2001) వర్ణించిన గ్రామీ ణులలో నేదునూరి గంగాధరం ఒకరు అయినప్పటికీ. వాటి సేక రణకు జీవితాన్ని అంకితం చేసిన క్రియాశీలి గంగాధరం.


రామరాజు


నేదునూరి

'గంగాధరం గారు 1904 జులై 4వ తేదీన రాజమహేంద్రికి మూడు మైళ్ళలోవున్న కొంతమూరులో జన్మించారు. 1970 మార్చి11న కాలం చేసారు. పెద్ద చదువులు చదవలేదు. మానవల్లి రామకృష్ణ కవిగారి దగ్గర పరిశోధనలో తర్ఫీదు ఐనారు. బీద బడిపంతులుగా బతికారు. తండ్రి తాతల మడిచెక్క, ఆలి మెడలో పుస్తె, పూస అమ్మి పల్లె పాటల సేకరణకు ధూపం వేసారు. పాతపాటల గంగాధరం అయ్యారు. 'కవికోకిల' అంది లోకం. 'సకల సుకవి జనావర్తిని' అన్నాడు తను. 'జానపద వాఙ్మయోద్ధారకుడు' అంది జనం. 'జీవన సాహిత్య భిక్షువును' అన్నాడు తను. ఖద్దరు శాలువాతప్ప కాశ్మీరు శాలువా కప్పుకున్న పాపాన పోలేదు అంటారు. ఆయన పాటల సంకలనం 'మున్నీరు' ముందుమాటలో పురిపండా అప్పలస్వామి (1973). 1965లోనే వారి 'మిన్నేరు' అచ్చయింది కానీ 1955 లోనే వారి పాటల సంకలనాన్ని బి.రామరాజు సంపాదకత్వంలో వట్టికోట ఆళ్వారుస్వామి 'సెలయేరు'ను ప్రచురించారు.

'నాలుగువేల జానపద గీతాలు, మాండలిక పదాలు, పదివేలకు పైగా సామెతలు, ఐదువందల ముగ్గులు, ఐదువేల వేమన పద్యాలు మరెన్నో సేకరించారు' అని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ప్రచురించిన (2003) అయన 'జానపద విజ్ఞాన వ్యాసావళి' లో పేర్కొంటూ 'పామరజన సాహిత్య కేతనం గంగాధరం' గా ప్రస్తుతిస్తూ, జయధీర్ తిరుమలరావు అయన పరిశీలనలో ప్రత్యేకతను ఇలా ఆవిష్కరిస్తారు :

సాహిత్యానికి చరిత్రకు విడదీయరాని సంబంధం ఉంది. మౌఖిక సాహిత్యానికి చరిత్రకు విడదీయరాని అనుబంధం ఉంది. ఈ రంగంలో గంగాధరంగారు ఎంతో సమాచారాన్ని సేకరించి వాటికీ 'వినికిడి చరిత్రలు' అనే పేరు పెట్టారు.

'భారతదేశంలో కులం, గోత్రం, శాఖ, వర్గం, గ్రామం, ప్రాంతం, వృత్తి, శ్రమ, పని, సందర్భం, శ్రోతలు, రచయితలు, ప్రచురణ సంస్థలు, వర్గం వంటి అనేక అంశాలను బట్టి సాహిత్యం, ప్రదర్శన, సంగీతం, ముడిపడి ఉన్నాయి. చాలామంది సేకరణే పరిశోధన అనుకున్నారు. కానీ గంగాధరం ప్రతి జానపద అంశంలోనూ సందర్భాన్ని గుర్తించి తగు ప్రాధాన్యమిచ్చారు. సామాజిక కోణాల్లోంచి తరచి చూసారు. జానపద సాహిత్యాన్ని ఆయన విద్యావిషయకంగా మార్చడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. దానికి సామాజిక మూలాలలోగల సామాజిక సంబంధాన్ని మరింతగా గట్టిపరచారు.'

అయన 'గ్రామ యాచకవృత్తులు' పరిశోధన ఏంతో విశిష్టమైనది. అటు గాంధీ ప్రేరిత హరిజనోద్యమం కనుమరుగైన వేళ, ఇటు ఆధునిక దళితవాదం చాయలైనా అంకురించని దశలో ఉపకులాలను కుల యాచకులుగా గుర్తించి మొదటిసారిగా రాసారు'

కాశీమజిలీ కథలను తిరగ రాసిన సుబ్బన్న దీక్షితులు: సహస్ర శిరశ్చేద అపూర్వచింతామణి, భట్టి విక్రమార్క, పేదరాసి పెద్దమ్మ వగైరా సంప్రదాయ కథలను రాజమహేన్ద్రిలో కొండపల్లి వీరవెంకయ్య, గొల్లపూడి వీరాస్వామి కంపెనీలు గుజిలీ పుస్తకాలుగా ప్రచురిస్తుండేవి. చదువులు, పత్రికలు, ప్రచురణ సంస్థలు, వ్యావహారిక భాష, ప్రామాణిక భాష, గ్రంథాలయోద్యమాలతో బలపడ్డాయి. రచయితలు ప్రచురణ సంస్థల ప్రచారం – ఈ మార్కెట్ తాకిడికి, ఆయాప్రాంతాలకు పరిమితమైన మాండలికాల్లో మౌఖిక సాహిత్యం తెరమరుగు కాసాగింది. అటువంటి పరిస్థితులలో జానపద సాహిత్యంలో కాశీమజిలీ కథలను తన రచనాశక్తితో తిరగ రాసి, ప్రచురించి ఇల్లు కదలకుండా గడించిన వాడు సుబ్బన్న దీక్షితులు.

'అప్పటివరకు తమ పటనవ్యాసంగాన్ని కేవలం దైవ సంబంధమైన సాహిత్యానికి మాత్రమే పరిమితం చేసుకున్న సాంప్రదాయ

కుటుంబాలకు చెందిన గృహిణులు కాశీమజిలి కథలపట్ల సమ్మోహితులైనారు. పడుచులు పెద్దలకు తెలియకుండా కొంగుచాటున పెట్టుకుని ఇరుగు పొరుగిండ్లనుండి కాశీమజిలి కథల పుస్తకాలు తెచ్చుకుని చదివే వారట' ('కాశీమజిలి కథలు – ఒక అనుశీలన : గంధం సుబ్బారావు. 2011) నవలలకు మూలం ఈ కథలలో ఉందని ఈ కథలలోని పాత్రల వేష భాషలను మార్చి టైట్ పాంట్లు, చొక్కాలు, మినీ లంగాలు తొడిగితే నవలాపాత్రలవుతాయని గోరా శాస్త్రిగారన్నారు.

చదువుకున్నవారు – చదువులేని వారు: శిష్టం–పామరం; ఇంటి భాష – బడి భాష–న్యూనతాభావం : రచయితలు, కళాకారులు మాండలికాన్ని కొల్లగొట్టి విస్తరిస్తున్న మార్కెట్‌కు అనువుగా మలచుకొంటున్న కొద్దీ, బడుగు జీవుల బతుకు తెరువులు, ప్రతిభలు అడుగంటిపోసాగాయి. జనం తమ సాహిత్యం తాము సృష్టించుకునే బదులు, రచనలు వల్లించ సాగారు. విత్తనాలు ఎరువులు తము తయారు చేసుకునే బదులు, మార్కెట్ మీద ఆధార పడసాగారు. గురజాడ, తిరుపతి వేంకటకవులవంటి వారి రచనలలో విశేషాలను బుర్రకథ కళాకారులు, నాటకాలవాళ్ళు సందర్భానుసా రంగా జనానికి చెప్పి రక్తి కట్టించే వారు. క్రమంగా వారు కనుమరుగు కాసాగారు. అంతేకాదు, గిరిజనోద్యమాలలో పనిచేసిన కళాకారులు గిరిజనుల సాంస్కృతిక జీవితం గూర్చి తెలుసుకోక పోవడంతో గిరిజనులు ఆశువుగా పాడుకునే పాటల స్థానంలో కవుల లిఖిత శైలి, వారికి పరిచయం లేని బాణీలు, వారిది కాని భాష, ఉద్యమ వస్తువుతో పాటలు రాయటానికి గిరిజన రైతాంగాన్ని ప్రోత్సహించ లేదు. వారు కార్యకర్తలు వినిపించిన పాటలను ఆదర్శంగా భావించడంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలని, తము ఆస్థాయిలో రాయలే మని భావించడంవల్ల వారు తమ అనుభవాలకు పాటల రూపమివ్వ లేక పోయారు. ఈ పాటలు వారి స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఆటంకాలైనాయి. అని 'శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం' (1991) మీద పరిశోధన చేసిన కె.ముత్యం గమనించారు.

ఇలా అన్నివిధాల, చదువుకున్నవారు, వారిచేత, వారికొరకు రాసే, చేసే పాలన, సృష్టించే సాహిత్యంతో సమాజం చదువుకున్న వాళ్ళు, లేని వాళ్ళుగా విడిపోసాగింది. ఇంటిభాష – బడిభాష మధ్య ఎడం పెరగసాగింది. సామాజిక స్పృహతో కొందరు రచనలు చేసినా, అవి చదువురానివారికి చేరే జానపద మాధ్యమాలు లేవు. వాటిలో సందర్భశుద్ధి, విషయ పరిజ్ఞానం తక్కువ. జానపద కథలు అద్భుతంగా ముగిస్తే, ఈ రచనలు విషాదాంతంగా, విప్లవ మాంత్రి కతతో, మానవీయత, శాస్త్రీయ దృక్పథం గూర్చి నొక్కిచెపుతూ ముగియ సాగాయి.

కంపెనీ హయాంలో కైఫియత్‌ల నుండి అర్జీల దాకా మాండలికంలోనే ఉండేవి. ఐతే విద్యారంగంలో మాత్రం గ్రాంధికం పెత్తనం సాగేది. స్వాతంత్ర్యోద్యమం పుంజుకున్నాక, ఆ వార్తల వ్యాప్తికి పత్రికలు పూనుకున్నాయి. ప్రాంతమంతా పంపిణీ చేయాలంటే ఒక ప్రామాణిక భాష కావాలి. విద్యాబోధనలో గ్రాంధికం పట్టు తప్పించడానికి, తమ పలుకుబడి పెంచుకోడానికి శిష్ట వ్యావహారిక భాషావాదులు పత్రికలు, ప్రచురణకర్తలు ఉద్యమం చేసారు. గ్రామ్యం, పామరం అంటూ మాండలికంలో సాహిత్యాన్ని పట్టించుకోలేదు. కొన్ని తెగల బడులలో బోధనకోసం ఒకరిద్దరు కొన్నికథలు సేకరించారు. వ్యాకరణం సమ కూర్చారు.


తెలుగు మాతృభాషగా ఉన్న గిరిజనులు కొండదొరలు, కొండరెడ్లు, బగతలు, యానాదులు, చెంచుల విషయంలో అదీ లేదు. ఎలాగోలా అర్ధమౌతుంది గదా అని సరిపెట్టుకున్నారు.

బానిస చదువులు– పోటీ ప్రపంచం–అధికారమదం: వక్తృత్వం, రచన, ప్రదర్శనల పోటీ–విద్యార్ధులలో నాయకత్వాన్ని ఆకర్షించసాగాయి. ఈ ప్రభంజనానికి జాతికి జీవగర్ర మాండలికం బలైపోయింది. 'మనది మనకు మోటై పోయింది. సామాజిక జీవనంలో సామరస్యానికి దోహదం చేసే సమష్టి సంస్కృతి నశించి పోసాగింది' (తెలంగాణా జాతీయాలు: నాయని కృష్ణకుమారి).

చదువు ఉద్యోగంకోసం, ఉద్యోగం అధికారం చలాయించడం కోసంగా మార్పు చెందసాగింది. 'నీవేమన్నా కరణానివా, మునసబువా, కనిస్టేపువా, నీకు దడిచేతందుకు' అంటాడు చిలకమర్తి. ఆ భయాన్ని పోగొట్టే భూమి, అడవి, నీటి చదువులు, లెక్కలు చెప్పకుండా, బానిస చదువులు నేర్పసాగాము. 'కాడెద్దులు – ఎకరం నేల' 'దున్నే వాడిదే భూమి' 'పోడు మా జన్మహక్కు' నినాదాలతో నెట్టుకొచ్చాము. చదువులు, ఉద్యోగాలు సంప్రదాయ వృత్తులను తొక్కేసి, విదేశీ మార్కెట్‌ను పెంచసాగాయి...

ఉద్యోగ భద్రత, ప్రచురణకర్తల ఆదరణవల్ల ఔత్సాహిక రచయితలు, పూర్తి రచయితలు, ఉద్యమ రచయితలు ఇలా సాహిత్యగాళ్ళు పెరిగిపోయారు. వెన్నెముక లేని మధ్యతరగతి సాహిత్యంలోకి ప్రవేశించింది. వారి రచనలు, కథన శిల్పంవల్ల చదివిస్తున్నయి కాని, ఆలోచనను రేకెత్తించలేక పోతున్నాయి. చూరులోంచి సూర్యకాంతిని చూసినట్లు ఈ రచనలనుండి సమాజాన్ని చూడడానికి అలవాటు పడసాగాము. 'పల్లె నుడికారానికి దూరమై, నగరాలలో చదువులలో వృత్తులలో ఒక మిధ్యా ప్రామాణిక భాషను మనం వ్యాప్తిలోకి తెచ్చి దానితో బతుకుతున్నాం.' అని కొడవటిగంటి కుటుంబరావు విచారిస్తారు.

'విపిన బంధుర వృక్ష వాటిక–ఉపనిన్మధు వొలికె నిచ్చట': యూరోప్ దేశాలు ఒకనాడు కొత్తదేశాలను వెతుక్కుంటూ పోతే, అక్కడి ప్రజలను అధ్యయనం చేయడానికి వెళ్ళినవారు మానవశాస్త్రాన్ని అభివృద్ధి చేసారు. నాటి నైజాంలో పాపికొండలలోని పేరంటపల్లి చుట్టు పక్కలగ్రామాల్లోఉండే కొండరెడ్డితెగను 1940లలో అధ్యయనం చేసిన మానవ శాస్త్రవేత్త హైమెండార్ఫ్ దంపతులు తమ 'రెడ్డీస్ అఫ్ బైసన్ హిల్స్' లో, కోస్తాతీరంలో ప్రముఖపట్టణం రాజమండ్రికి 30 మైళ్ళ దూరంలోనే ఈ మన్యప్రాంతాలున్నప్పటికీ, ఆ నగర వాసులకు ఈ తెగల పట్ల ఆసక్తి లేదు అని ఎత్తిపొడిచారు. తన ఆధ్యాత్మిక అనుభవాలను ఆంగ్లంలో అనేక గ్రంథాలుగా రాసి, గిరిజన బాల, బాలికలను ఆపట్టణంలో పెట్టి చదివించి,దోపిడీ నుండి వారి విముక్తికి కృషి చేసిన పేరంటపల్లిస్వామి బాలానందకూడ ఈ తెల్లవాడి రచనను పట్టించు కోలేదు. కానీ డార్ఫ్, స్వామి కృషిని ప్రస్తుతించారు. కొండరెడ్ల, చెంచుల సాహిత్యాన్ని డార్ఫ్ సేకరించలేదుగాని, గోండ్ తెగవారి


సురవరం

పురాగాధలను గ్రంథస్తం చేసాడు.

హైమెండార్ఫ్ రచనలను సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'లో (1948) పేర్కొంటూ 'మనపక్కనే అనాదిగా మనభాషనే నానా అపభ్రంశ రూపాలతో మాట్లాడు ఆటవికు లను సంస్కరించుట, వారి జీవన విధా నములను బాగుగ గమ నించి వారిచరిత్రలను వ్రాయుట అనునది నేటికినీ మనలో లేదు. వారిని గూర్చి మన వారిలో కొందరు యువకులు కృషి చేయుట యుక్తము' అని ఉద్బోధించారు.

'కొంత బలము ప్రతాపము గలవారు కొండ ప్రాంతాలలోను కొండలకు మధ్య లోయలలో...చిన్నచిన్న రాజ్యాలు కట్టుకుని తమకు వశమైనంతదేశాన్ని పాలిస్తూ వచ్చారు...ఈ చిన్న రాజ్యాల గురించి మనకు ఏమీ తెలియదు.' అన్నారు మల్లంపల్లి సోమశేఖరశర్మ (1948) 'తెలుగు వారైన కొండరెడ్లు, చెంచులు మన్నెప్రాంతములనున్నారు గదా! వారి వారసులమే మనము'. అంటూ తెలుగు జాతి మూలాలను 1956లో ఆచార్య రామరాజు గుర్తు చేసారు. వారి మార్గ దర్శనంలో సేకరించిన గిరిజన వాఙ్మయాన్ని ప్రాచ్య, పాశ్చాత్య అధ్యయన సంప్రదాయాల నేపథ్యంలో వ్యాఖ్యానించి శివరామకృష్ణ 1982లో ఆవిష్కరించిన పరిశోధన 1991లో 'తెలుగు గిరిజన గీతాలు', 2007లో 'కొండకోనల్లో తెలుగు గిరిజనులు' పరివర్ధిత ముద్రణగా అచ్చులోకి వచ్చింది.

తూర్పు కనుమలు– తూర్పు తీరం మన్నె కొట్టాలు - బోయ కొట్టాలు: ఆంధ్రదేశంలో తూర్పుకనుమలలో వర్షచ్ఛాయ ప్రాంతాలైన నల్లమల ఎర్రమల వెలిగొండ శేషాచలంలలోనివి గట్టి కలప నిచ్చే చిట్టడవులు. కిక్కిరిసిన కొండలమధ్య గోదావరిలోయల లోనివి మెత్తని కలపనిచ్చే పనస, నేరేడు, మామిడిపండ్ల చెట్లుగల కారడవులు, అధిక వర్షపాతం, మంచులతో విశాఖమన్యంలో పంట భాగ్యాలు గలవి బయళ్ళు. సముద్రంలో పెరిగేవి మడ అడవులు. ఈ కనుమలలో మెయిలు మేస్తె - కళ్ళముందర వాన', గోదావరికి మే నెలలో, కృష్ణకు జూన్ నెలలో, పెన్నకు జూలై నెలలో ఏరువాక' ఒకనాటి అనుభవాలు...అడవులను మన్నెకొట్టాలని సముద్రతీర ప్రాంతాలను బోయకొట్టాలని పిలిచేవారు.

రంప పితూరీ : తమచుట్టు తాముతిరిగే నగరాలలో బుద్ధిజీవుల సంగతి ఎలావున్నా, పాలకవర్గాలను మాత్రం మన్యంలో రంప, పితూరీలు కునుకు లేకుండా చేసేవి. ఈ పితూరీలపై ఒక చాటుపద్యం

'రంప గణింపరాని జనరాశిని జంపెడు దుంప, కాన్స్టేబిల్ / గుంపులపెంపు సొంపణప గూర్చిన ఆజము కొంప, దొరలమా / యింప జనించు రొంప, ధరనీశుల తొంప, పితూరిదార్లకున్ / సంపదలిచ్చి ప్రోచుటకు చాలిన మేరువు చెంప ఇమ్మహిన్'.

పాపికొండలలో కొరుటూరుకు చెందిన కారుకొండ సుబ్బారెడ్డి బృందం నానాసాహెబ్ పిలుపు మేరకు తిరుగుబాటు చేసినట్లు, రాజమండ్రి కోర్టు ఉరిశిక్ష విధించిన సందర్భంగా వాఙ్మూల మిచ్చినట్లు జిల్లా గజెటీర్ పేర్కొన్నది. అంతకు ముందు వంద సంవత్సరాలనుండి బందపల్లి కారం తమ్మన్న దొర, రేకపల్లి కొండ్ల భీమిరెడ్డి, అడ్డతీగల, దారబందాల చంద్రయ్య, బోడులూరి అమ్ముల రెడ్డి, పులికంత శంభయ్య, గరిమెళ్ళ మంగడు, చోడి బాలుదొరల నాయకత్వంలో కొనసాగుతున్న రంపపితూరీ బోల్షివిక్ విప్లవానికి మార్గదర్శిగా చరిత్రకారులు కీర్తించారు 1916 లో బాలు దొర లాగరాయి పితూరీ తరువాత, గూడెం కేంద్రంగా 1600నుండి సాగుతున్న తిరుగుబాటుకు అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించాడు...

ఈ పితూరీదార్లందరూ వీరమరణం పొంది సానుభూతి సంపాదించుకున్నారు. వశమైన తరువాత పగవారు కసినంతా చూపిస్తారు. వేటాడి సంపాదించుకున్న అలంకారాలు వీరలాంఛనాలు. ఈ వీరులందరూ గిరిజనుల నిత్యజీవితంలో భాగమైనారు. వారి మీద కోలాటపాటలు, పొడుపు కథలతో వేళాకోళాలు.

'దారకొండ సన్నాసిదొర, కొ–కోడలమ్మా, దేరా వేసి దక్కి కొట్టిడా' గొడుగు సన్నాసి దొర (పుట్ట గొడుగు–చేమ ఆకు) తీగల క్రి దొర (అలుచందలు) కారం పండుదొర (పండు మిరప).

జిల్లా కలెక్టరుగా, తరువాత రివిన్యు బోర్డ్ సభ్యునిగా ఈ రంప పితూరికి దారితీసిన పాలకుల తప్పిదాలను ఎండగట్టిన సల్లివన్ నివేదిక (1880) నిజనిర్ధారణకు నేటికి ఒరవడిగా నిలుస్తుంది.

'అన్ని డిపార్మెంట్లు అనుకూలమే గాని ఫారెస్ట్ డిపార్ట్ మెంటు పరమశత్రు

అడవంత ప్రజలకు ఆధారమై ఉంటె–అడవికట్టేసి రన్యాయముగను

తేనె మైనమువల్ల తెలగాలు కోయలు బతికేటి బతుకెల్ల భంగ మాయే

మానులను పెంచియు (ప్లాంటేషన్) మనుషులను చంపియు ధనము సంపాదించే దారి ఇదియా?'

అంటూ మారేడుమిల్లి మండలం పుల్లంగి వాస్తవ్యుడు పుసర్ల బాలేసు నిరసించాడు. ఆ నిరసనలను విచారించడానికి వచ్చిన ఫారెస్ట్ అధికారి శేషగిరిరావు అవర్గళ్ 'నోట్ ఆన్ రంప ఏజెన్సీ' (1931) గద్యరూపంలో ఉన్న ఆంగ్ల కావ్యం.

ఈ ప్రాంతాలలో పనిచేసిన, అక్కడ నుండి వచ్చిన రచయి తలు, ఉద్యోగులు తమ అనుభవాలను వర్ణించడం తప్ప గిరిజన వాఙ్మయం, సమస్యలను అధ్యయనంచేసి మన అవగాహన పెంచలేక పోయారు. అడవి, సముద్రం, బీళ్ళు వంటి ఉమ్మడి వనరుల మీద జీవించే గిరిజనులు, మత్స్య కారులు, పశు పాలకులను అర్థం చేసుకోవాలంటే ప్రత్యేకంగా కృషిచేయాలి. కానీ మనపూర్వులు మన వంటి సోమరులు కారు.

అడవిలో చరిత్ర జాడలు : శ్రీనాథ మహకవి దక్షారామంలో వేశ్యారత్నం 'గంధర్వాప్సరో భామిని' చిన్నిపోతి మరుజన్మ 'వేగి కురు వాటికా దేశ విపినభూమి'లో అంటే మన్యంలో కలుగునని ఆశీర్వదించి తన రస దృష్టిని చాటుకున్నాడు. రెడ్డి రాజులు 'దండకా రణ్య మధ్య పుళింద రంభాహి వంశజులకు అభయ మొసంగి'

నారని పేర్కొన్నాడు.

నరసింహస్వామి, చెంచిత కాలిలో ముల్లుతీస్తున్న కోరుకొండ దేవాలయంలో 13 వ శతాబ్ది శిల్పం, ఆ కోవలో మొదటిదిగా నరసింహ సంప్రదాయవేత్తలు నిర్ధారించారు. నాడు గిరిజనులను సాధారణంగా కోయలు, చెంచులు, సవరలు అని దిగువవారు పిలిచే వారు. 'జీలుగుకల్లు తాగి(న) మద సింధుర యానలు', 'ముదురంగ పండిన మాలూర ఫలములబోలు కుచస్త్రీల చెంచుకన్యలు' నాటి రసికులను కవ్విస్తుండేవి.

దండకారణ్యం - కళింగ దేశం- తూర్పుకనుమలు - రంపరాజ్యం : కాకతీయుల దాడికి నిలువలేని ఒకనాటి చక్రకూటంలో, (నేటి బస్తర్ రాయభూపాలపట్నం) మద్దేటి పాలకులు నాగవంశీయులు గోదావరితీరం వెంట దేవీపట్నం పక్కన తొయ్యేరు చేరి, అక్కడనుండి మారేడుమిల్లి మండలం తాడేపల్లిలో ఒకవీధి మద్దివీడు / మద్దేటికి చేరారు. వారితో వచ్చిన వారి ఉగ్రదేవత దంతేశ్వరి / మహాకాళి / మావెలి.

తరువాత రంపచేరి రెడ్డిరాజుల సామంతులుగా పాలించారు.

విజయనగరం జిల్లాలో పద్మనాభం యుద్ధం(1794) తరువాత విశాఖమన్యంలో గూడెం, గొలుగొండ పాలకుల అండతో తిరుగు బాటు చేస్తూ, తమ అడవులలో తలదాచుకున్న పాయకరావు జాడ చెప్పినందుకు, తెల్లవారికి రంపపాలకులు దగ్గరైనారు. వారు ఇచ్చిన అలుసుతో, వారసత్వరడ్డు సాకుతో గిరిజననాయకుల 'ముఠాలు' లాక్కుని, కల్లుమీద మొదలుపన్నుపై చిగురుపన్ను వేసి ప్రజలను హింసించి, పితూరికి కారకులైనందుకు, బ్రిటిష్ ప్రభుత్వం 1870లో బహిష్కరిస్తే, గోకవరందగ్గర. రంప. ఎర్రంపాలెంలో స్థిరపడ్డారు. ఈ వలసలను వర్ణిస్తూ రాజుల పండుగలో ...

'చక్కెరదేవి కోటజలోన చేదండాలు పట్టి - రండో చేరి పాండు గులార భోంచేయ రండో / లే లే లే ల లేల మ్మారో ఓలేలేల లేల - లేలే లేల లేలయ్యారో ఓ లే లే ల లేల' (చక్రకూటం)...'

అంటూ లేలలు పాడుతూ గిరిజనులు పాండవరాజులను ఆహ్వానిస్తారు.

'అరవైయారు తానాలకు కొ...కోడలమ్మా, మద్దివీడు మావెలి దుర్గమా' అని కొండరెడ్ల కోలాటం పాట ఈ పాలకులతో పాటు వచ్చిన వారి రైతులు కోయదొరలు. వారికీ తమకుగల తేడాలను 'దొరలం కాము దొసలం కాము తుమ్మేదిరో-మన్యం కట్ల రెడ్లం మేము తుమ్మేదిరో'... అంటూ తెలుగు తెగలు పేర్కొంటారు.

పురుషోత్తమపట్నం, రామగిరి, దేవీపట్నం, చోడవరం ఇమ్మిడి వరం, భూపతిపాలెం, మొల్లేటి దుర్గం, లక్కొండ మల, శివరామ పట్నం, వీరభద్రపురం, రాజవొమ్మంగి, శరభవరం, కాపవరం, పోతవరం, పోలవరం, ఫజుల్లాబాద్, అమీనాబాద్, ఫోక్సుపేట, మన్యంలో ఇటువంటి గ్రామనామాలన్నీ చరిత్రకు ఆనవాళ్ళు.

గిరిజనుల వ్యక్తిత్వం- పరిసరం : కానీ గిరిజన సమాజం, సమిష్టి నిర్ణయం, కట్టుబాట్లు, నోటి మాట, ఇచ్చి పుచ్చు కోవడం / వస్తు మార్పిడి ఆధారంగా నడుస్తుంది అక్కడ సామెత శాస్త్రం, యౌవనం వినోదం, అట పాటలే అమ్మవారికి మేలు కొలుపులు... గ్రామీణులకు అక్షరాస్యత, కార్తెలు, నగదు విలువ తెలుసు. కానీగిరిజనులకు అక్షర గంధమే లేదు. ఋతువులు తప్ప కార్తెలు తెలియదు...అడవిలో జంతువులు అతని పరిసరంలో ప్రధాన భాగ స్వాములు...

అడవికి ఆటగాడు (నెమలి), కొండకు కోలగాడు (కొండగొర్రె) చేనుకు చేటుగాడు (కుందేలు) మెట్టకు మేలగాడు(కొండమేక) దారికి దడ్డడు - (దారి వెంట నడిచే బలశాలి-పులి) పక్షులలో గుంజి (గుడ్లగూబ) రాజు, బట్టి పిట్ట మంత్రి, ఏట్రింత పోలీసు, మైనా మేడమీది రాచపాప, నెమలి నర్తకి, తిత్రిక పిట్ట మంత్రగత్తె. తొండ, మిండే, బల్లి గురువులు..


పరిసరాలకు అతడు పెట్టుకున్నపేర్లు అతడు అడవితల్లికి చేసే సహస్ర నామార్చన... తీయమామిడి గొంది, పికిలిపిట్ట వేనం, కణుజు నాకిన రాయి. పులి బరుకుడు మాను వంపు...నెమలాట పనుకులు, తుమ్మెదల బొక్క, తూరు రాయి కట్టువ, తేనె గండి మోరు, గుమ్మళ్ళ దొడ్డి (ఆటవరుసలో గుమ్మలు) గుబ్బట్ల గండి (గబ్బి గుబ్బెతలు అని కావ్యప్రయోగాలు)...వీటిమధ్య తన చేవడి బసలు (కల్లు చెట్టు చుట్టూ విడిది) వేట బసలు, చేను బసలు, గొట్టు బసలు, అట బసలు, మగనాలి మెట్టలు(కోపగృహాలు) కొండల్లో, లంకల్లో పోదు వ్యవసాయం పోదు కోసం చెట్టు చేమ నరికి తగలపెట్టె ముందు...

'చీమలార, దోమలారా, చిరుకోటి జీవులార, మా కొండ చేనుకు అగ్గులు పెడుతున్నాం తప్పుకొండహో!' అని హెచ్చరిస్తారు. 'కొండ కొండ కొండ వెదురునరికి - గండి మీద ఇల్లు కట్టి - ఇత్తుపొత్తు లేక మనము ఇద్దరమే దెంగితిందాం' 'కొండచేను కోమటి దుకాణం'. పోడుచేలో అన్నిపంటలు పండుతాయి, చేనులో మకాం ఉన్న కుటుంబాలు దేశవిడినెలలో(సంక్రాంతి) పంటలన్నీ గ్రామంలోకి తెచ్చుకుంటారు. కల్లుపారు అందుకుంటుంది. ఆ హుషారుతో తుళ్ళి పడే వారి ప్రాంగణాలు...

'ఆటసిరి కల్లములోన అడ వేడుకలయ్య-పాటసిరికల్లములోన పాడవేడుకలయ్య' / 'ఆడవాలె పాడవాలె- వేడుకలు చేయవాలె' పాటలతో మారు మోగి పోతూ ఉంటాయి...' ఇటువంటి విలక్షణమైన వాతావరణంలో వారి కాలజ్ఞానం కూడా విశిష్ఠమైనదే ...

పాలకుల వలసలు : ఓడలు బండ్లైనట్లు, రెడ్డిరాజ పరి వారంలో ఓడిపోయిన కొందరు రెడ్డిపోలవరం మీదుగా గోదావరిదాటి పాపికొండల మొదలు గుజ్జుమామిడివలస బొడ్లంక కారడవులలోకి చొచ్చుకు పోయి తలదాచుకుని, కొన్ని గ్రామాలకు నాయకులు 'ముటాదారు' లై రంపరాజు సామంతులైనారు. స్థానిక గిరిజనులతో వియ్యమందారు. ఈ పాలక వర్గం 'పన్నెండు ముఠాలకు నల్లగవర్నర్లు పల్లాలవారు' అని రంపరాజ్యంలో నానుడి. కొండరెడ్లుగా పిలుపుకు ముందు వీరిని, (విశాఖ మన్యంలో) పొరుగు వారైన కొండదొరలుగా భాష, సాహిత్యం, ఆచార వ్యవహారాల బట్టి భావించ వచ్చు. అక్కడి కొండదొరలు తమను మత్స్య దేశంలో అజ్ఞాత వాసం చేస్తున్న 'పాండవదేశం పాట పూజారులు'గా వర్ణించుకుంటారు. కొండరెడ్లలో కొందరు తమను పాండవ రెడ్లుగా చెప్పుకుంటారు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక ఆదర్శాలు : 'విరాటరాజు దేశం విటిక పండుగలు- కొండవారి దేశం కొలువు పండుగులు - కాశి వారి దేశం - గంగ పండుగులు' - జోర, జోర, జోర, పంచ



పాండవులారా'...అంటూ నంది, కొలువు పండుగులలో తాము అంటే పాండ వులపాట్లను 'పంచ పాండవుల పంట – దుర్యోధనుడి పంట' గ పాడుతుంటారు. ఈ పాటలో కాశివారిదేశం, శృంగవరపుకోట– అరకు దారిలోగల కాశిపట్నం విజయనగర సంస్థానంలో భాగం. ఆ కొండలోగల విరాట పర్వతం / పుణ్యగిరి తీర్థం దేవత ధారల గంగమ్మ.

వద్దాది రాజధానిగా పాలించిన మత్స్య రాజ్యాన్ని రెడ్డిరాజులు, తరువాత కృష్ణదేవరాయలు .తన కళింగ దండయాత్రలో జయించి నట్లు 'మాడుగుల గెల్చె– వద్దాది మసి యొనర్చె' నని మనుచరిత్ర. దండకారణ్యంలోని కళింగదేశంలో తూర్పుకనుమలలో తెలుగు గిరి జనుల వ్యాప్తి, చరిత్రలకు గిరిజనుల సంస్కృతి సాహిత్యం సజీవ సాక్ష్యం. యార్లగడ్డ రామవరం మండలంలోని ధారల దుమ్మకొండ నుండి సోకిలేరు, పాములేరు, సీలేరు, కన్నేరువాగులు ప్రవహించే ఈ మన్యంలో ఎన్నో దారకొండలు, దారవాడలు, ధారగడ్డలు, ధారాల మ్మలు.

అడవికి రాజులు, నీటికి జలకన్యలు, పంటలకు పాండవ రాజులు – ఇటువంటి వారు (కొండల్లో) తెలుగు వారికే కాదు, ప్రపంచంలో అన్ని సంస్కృతులలో అధిదేవతలు. జలకన్యల రూప మైన ప్రాణుల పేరుగల స్థలాలు ఏదో ఒక నీటి వనరులకు గుర్తులు కప్పకొండ, తాబేలుగండి, ఎండ్రిక పర్వతం, మత్స్య గడ్డ. (ఫెరన్) నీటిగన్నిక., పాండ్ స్కేటర్ – గన్నిక పురుగు.

ద్రవ పదార్థం కాబట్టి కల్లుకూడా గన్నికలదే. అందువల్ల పండుగచేసి వారి అనుమతితో కల్లుగీత మొదలు పెట్టాలి.

సీలేరు చుట్టూగల 'జాడిదేశం. జలుబు దేశం'. (ఝూడ్ అంటే హిందీలో చెట్టు, తూర్పు కనుమలలో ప్రాచీన రాజధాని ఒడిశాలో నందపురం ప్రభువులకు ఝూర్ఖండ్ పాదుషాలని బిరుదు) అక్కడ వెట్టిని తట్టుకోలేక వలస వచ్చిన వ్యవసాయ కూలీలు కొండకాపులు. కొండ కమ్మరలు. పాలకులకు పాలితులకు మధ్య సంబంధాలు నడిపే కోలగాళ్ళు అంటే కొలువుగాళ్ళు / గ్రామనౌకరులుగా వాల్మీ కులు కుదురుకున్నారు. గంగాలమ్మ ఆ తెగలో గొర్లె వారి ఆడపడుచు. వారికీ కొండరెడ్లకు మన్నన చుట్టరికాలున్నాయి.

అందగత్తె గంగమ్మను రాజు చెరబట్టబోతే, ఆమె తన అందా లన్నీ దిగువారికి చెందాలని శపించి, దేవతగా మారుతుంది. ఈ దేవతనే విశాఖమన్యం ఇలవేల్పు నందపురం కోడలు మోద కొండ మ్మకు కోడలిని చేసి 'మన్నె ఇంటి రాజయిన మాల ఇంటి గంగును పెండ్లాడిన పదాన్ని' తుమ్మెద, అలపదం వేసి గిరిజనులు పాడు కుంటారు. మోదకొండమ్మ జాతరను రాష్ట్ర గిరిజనోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

క్రమంగా విస్తరించిన ఏలేశ్వరం, గోకవరం వ్యాపారుల వారపు సంతలు : అక్కడ 'తూరుపు కుంచముతో. తూరగొలిచే బేరగాళ్ళు– పడమర కుంచముతో పారగొలిచే బేరగాళ్ళు'. కూరలమ్మి నారలమ్మి కొండసంత మండువలలో మొగ్గల చీరలు కొనుక్కోవడానికి వారు పడే పాట్లు.

వ్యాపారుల 'పావలా వడ్డీ– గుద్దుల బ్యాంకులు'., ఆ అప్పుల కోసం తమ భూములను అటవీ సంపదను తాకట్టు పెడుతున్న గిరిజనులు., అడ్డతీగల తాలుకాలో బ్రిటిష్ గ్రామాలకు మునసబులుగా కాపులు, కరణాలు ప్రవేశించడంతో మన్యం తన స్వతంత్రాన్ని కోల్పోయింది. రాతకోతల వలలో, చిక్కుకుంది. వ్యాపారస్తులు, పాలకవర్గం పెట్టే ఆశలు పట్టాలు, ఉద్యోగాలు, పదవులు, పథకాలు నిధులు, నిండుకుండవంటి గిరిజనులను ఆకర్షించ సాగాయి. వాటిని అందుకునే ఆరాటంలో వెలితి పడుతూ తప్పటడుగులు వేయసాగారు.

'రాజరాజము రంపరాజము– రాజు వచ్చి చేయివేయ– రాజమంతా తొనుకు తొణికే' / ఎర్రటి రైకలు ఎక్కటి వమ్మా– ఏలేశ్వరం సంతలకాటివి / నయ్యకేసి రంగులవాడు– రంగుపూసల బేరగాడు / చింతలు చెల్లివి సంతకు పోదాం–చిట్టి చిట్టి గాజులు కొందరా / సంతల దారిన చెప్పిం టిమి– నీల్ల దారిన కలుసుకుందరా' ఇలా సంతలో మోజులు ఊరిస్తూ, అట విడుపులుగా మారాయి.

తెల్లవాడి పాలనలో పితూరిలను అణచడానికి వేసిన బాటలు, వాటి వెంట దిగబడిన కలప, వెదురుదొంగలు వారి మందీమార్బలం ప్రలోభాలు దుర్మార్గాలు.

'రంకుచేసి బొంకు చేసి గాజులు కొన్నదో – కిలింగిచ్చ

సోంబేరి'. / గూడెం సంతకెళ్ళి గుట్టుచక్కగా ఆడుకురావో / 'గుమస్తా వాడితో గుద్దుకున్న లంజ'.

1970లొ ముఠాలు, ఎస్టేట్లు రద్దు చేసి రైతువారీగా పట్టాలి చ్చారు. పల్లం భూములన్నీ గిరిజనేతరుల పరమయ్యాయి. 1990కల్లా అడవి నాశనమైంది.

భూమి అడవి నీరు – ఉద్యమాలు : చిప్కో ఉద్యమనాయ కుడు చండీప్రసాద్ పర్యటనతో 1987 నుండి ప్రజహితవ్యాజ్యాల ద్వారా అడవిని కాపాడే ప్రయత్నం, దగాపడినస్త్రీలకు కోర్టులో వాదించుకునే ధైర్యం, వృత్తి పనులలో నైపుణ్యం పెంచుకోవడం, పొదుభూములలొ తోటలు వేసుకోడం, 'చెకింగ్ కాటాలు' నిర్వహించు కుంటూ సంతలో మోసాలు అరికట్టడం, అన్యాక్రాంతమైన భూములు సాధించుకునే మెళకువలు నేర్పడం ప్రారంభమై 1997లో పశ్చిమ గోదావరిలో కబ్జాదారులపై కథనంగా మారింది.

ప్రభుత్వం భూమి రికార్డులను ప్రజలకు పంచిపెట్టింది. ఈ ఉద్యమాలలో గిరిజనులు తమ సాహిత్యం తాము అల్లుకున్నారు.

మామిళ్ళు కొట్టొద్దు–మాపొట్ట కొట్టొద్దు / (అడవిలో) 'కూలివాడుగా కాదు పనివాడుగా మారాలి' / మారేడుమిల్లి మన్యంలోన మాసిపోయిన దిగువ పోతులా / కళ్ళులేని కోర్టు గంగమ్మా – గుడ్డి నాకొడుకుల తీర్పమ్మా / కొన్నవాడిది కాదు రాజులమ్మా – దున్నేవాడిది భూమి రాజులమ్మా'

స్కీములు పద్దులు– భూములు కావాలి ఈ పాటలు, నినా దాలు ఆ ఉద్యమాల్లో ఉత్సాహాలకు మచ్చుతునకలు..

ఎవరిదీ అడవి ? : చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు, అంతా నాశనం అయ్యాక, ప్రభుత్వాలకు అడవి, సముద్రం వంటి సమష్టి సంపదలను తాము కాపాడలేమని జ్ఞానోదయమైంది.

గిరిజనులకు వారి సంప్రదాయపద్ధతుల ప్రకారం అడవిని కాపాడుకోడానికి, వారి జ్ఞానం గుర్తింపుకు ప్రపంచవ్యాప్తంగా చట్టాలు చేయసాగాయి. వాటి అమలుకు శ్రీకారం చుట్టి ప్రతి ఊరి సంప్రదాయ సరిహద్దుపటాలను గీయించి 'అడవిలో బ్రతుకులు ఒకనాడు నేరం – ఈ నాడు వరం' అనే కరపత్రంతో పాటు, రంప చోడవరం గిరిజనాభివృద్ధి సంస్థ సంప్రదాయ విజ్ఞానం చిత్రిస్తూ 2008.9.10 లలో 'రమ్యమైన రంప' కాలెండర్లు ప్రచురించింది .

ఆ కరపత్రంలో పేర్కొన్న వనరులు స్థలాలు 'మగనాలి మట్టలు, చేవడి బసలు, గొట్టి బసలు చీపురు పొలాలు' మొదలైన పదాలను అడవి హక్కుల గుర్తింపు పట్టాదారు పాసు పుస్తకాలమీద రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించింది. కానీ, గిరిజనులను అడ్డుపెట్టుకుని అడవి నరుకు, గనుల తవ్వకం ముమ్మరమైంది. నీటి వనరులు తరలించడానికి కట్టే రిజర్వాయర్లు / పోలవరం డొంలవల్ల లక్షలాదిగా ముంపు బారిన పడుతున్నారు. సూరంపాలెం రిజర్వాయర్ నిర్వాసితుల జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి కాకినాడ రాజీవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లా (లా కాలేజి) చేసిన అధ్యయనం ఏంతో మార్గదర్శకంగా నిలుస్తుంది. ఐతే అనుదినం గిరిజనుడు ఎదుర్కొంటున్న ఈ సమస్యల పాఠాలు, లెక్కలు, పటాలు, నైపుణ్యాలు. సార్వత్రిక విద్యలో భాగమైతే తప్ప జనానికి పట్టుపడవు. పాలకులను నిలదీసే శక్తి వారిలో పెరగదు.

సముద్ర తీరంలో ఆటు పోట్లు : 'ప్రాచీనాంధ్ర నౌకాయానము' (1923) లో భావరాజు వెంకట కృష్ణరావుగారు వివరించిన జాడలు 'ఈ ఓడ ఈతవాయి దాటితే చూద్దాము 'తూర్పు గోదావరిలో జానపద జీవనం– ఒడిదుడుకులు (గండం గడిస్తే చూద్దాము తవాయి – బర్మాలో రేవు పట్టణం) ఓడ సిబ్బంది మాలెం, తండేలు, పుంజరి, గుమ్టిలు ఓడలబోది (జెట్టి) వంటి పదాలు మత్స్య పరిశ్రమ 'మాండలిక వృత్తి పదకోశం' లో (1970) కనిపిస్తున్నాయి. 'జంబై లే షోకుల లంగరి', 'హై లెస' వంటివి జాలరుల పాటలలో తరచూ వినిపించే పల్లవులు., సముద్ర తీరంలో 'బీల'.' తంపర'లుగా పిలిచే ఊటభూములకోసం శ్రీకాకుళం జిల్లా కాకరపల్లిలో జరిపిన పోరాటం ఈ వనరుల అవసరాన్ని నొక్కి చెపుతున్నది. సముద్ర తీరమంతా కాలుష్యంతో నిర్జీవంగా మారిన తరువాత బుద్ధివచ్చిన ప్రభుత్వం, తీర ప్రాంతమత్స్యకారుల హక్కులు గుర్తించడానికి ప్రభుత్వం 2009లో ముసాయిదా బిల్లు పంపిణి చేసింది.

ఆ అమ్మే మరణిస్తే !: ఎన్నో కోట్ల ఏళ్ళ మథనం ఫలితంగా సముద్రంలోంచి కాస్త భూమితేలింది. సమష్టి సృజనాత్మకత జానపదంగా దక్కింది. అడవు ల్లోంచి వచ్చే నదులు సముద్రంలోకి ప్రవహించి దాని ఉధృతి తగ్గిస్తున్నయి. ఈ నదులవెంట వెళ్ళే ఒండ్రులో పెరిగే మడ అడవులు, తీరంలో సవర తోటలు సముద్రాన్ని రెచ్చిపోకుండా అదుపు చేస్తున్నాయి. ఇప్పుడు ఒండ్రు బదులు ఇసుక మేటలు వేస్తున్నాయి. అడవులు 'తృణ కాష్ట జల సమృద్ధి'ని, గ్రామాలు 'వాపి కూప తటాకాల'తో ఆహార భద్రతను ఇస్తున్నాయి. ఈ సంబంధాలు తలక్రిందులైతే మళ్ళీ భూమి సముద్రంలోకి పోతుంది.భూగోళం అగ్నిగుండంగా మారుతుంది. మనపూర్వులకు వలె పోయి తలదాచుకునేందుకు వీలు లేకుండా అడవులు ఎడారు లుగా మారతాయి..

ప్రవాహినీ దేశ్యా, నదీ వేగేన శుధ్యతి, జాతి జీవ నాళిక జానపద గీతిక. అన్నారు. ఈ విషయంలో గంగాధరంగారు సేకరించిన గంగా గౌరీ సంవాదం మనకు హితవు చెపుతుంది...

గంగ సముద్రులది అనాది బంధం.మధ్యలో వచ్చిన పార్వతి, శివుని జటాజూటంలో మయాన మజిలీ చేసిన గంగను సవతిగా భావించి 'రాళ్ల దొర్లిన దాన! రాణ ఎందులకే రొయ్యలమ్మే దాన రోషమెందులకే' అని తూలనాడుతూ, కోయ నా సవతితో కులుకు తావేల, జాలరి వాడలో చాటుగా తిరిగి – తెచ్చుకుంటివి నీవు జగదాల గంగ' అని కసరికొడుతూ, తరిమి వేస్తుంది. గంగ అంతర్ధాన మౌతుంది. మంచినీరు లేక జనం హాహాకారాలు. చివరకు గంగా గౌరీ రాజీపడతారు. ఇప్పుడీ సవతిపోరు తారాస్థాయికి చేరింది. ఇప్పుడు కల్పించుకోకపోతే ఈ భూమి, నీరు, ఈ దేశి సంస్కృతి మనకు దక్కదు. 'ఈ పుడమితల్లి, ఆ సమష్టి సంస్కృతి మరణిస్తే ఆ పాపం ఎవ్వరిది?'. సంస్కృతి వికృతిగా మారిన తరుణంలో, ప్రకృతితో సత్సంబంధాలను నిలబెట్టడానికి పాటుపడే...

'కొందరు నవయువకులు రాబోవు యుగం దూతలు – పావన నవజీవన బృందావన నిర్మాతలు'

నవల

డి.పి. అనూరాధ
9010016555



(జరిగిన కథ)

***ఆ**స్ట్రేలియా వెళ్లాలనుకున్న సూర్యవర్మకి బ్యాంకాక్లో ఓ అపరిచితుడితో పరిచయం అతడి గమ్యాన్నే మార్చేస్తుంది. విదేశీ నేలలపై తెలుగు జాతి ఘనకీర్తి చరిత్రను వెలికి తీసే బాధ్యతను తెలుగు తల్లి పరోక్షంగా తనకి అప్పగించిందని తెలుసుకుంటాడు. అందుకే కాలాతీతంగా అతడి ప్రయాణాలు జరుగుతుంటాయి. తెలంగాణ నుంచి ప్రాచీనకాలంలో వలస వెళ్లిన మన జాతీయులను, నేటి మయన్మార్లోని తెలుగు సంతతి వాళ్లని కలుసుకుంటాడు. అటునుంచి అనుకోని విధంగా హరిపుంజాయి రాజ్యంలో అడుగుపెడతాడు. ఆ తరవాత అతడి మజిలీ ఎక్కడో?*

పిరమిడ్ ఆకారంలో ఉన్న అయిదు అంతస్తుల బౌద్ధస్థూపం ...ప్రతి అంతస్థులోను నిలువెత్తు బుద్ధుడి విగ్రహాలు ప్రతిష్టించారు. సుమారు 60 బుద్ధ విగ్రహాలు ఉంటాయి.. నా చుట్టూ ఆడా మగా.. పిల్లలూ పెద్దలూ ఎంతో మంది మోకాళ్లపై కూర్చుని ప్రార్థనలు చేస్తున్నారు. నేను కూడా వాళ్లతో పాటు కూర్చుని ఉన్నా.

వందల ఏళ్ల నాటి నిర్మాణంలా ఈ స్థూపం కన్పిస్తోంది. అగరవత్తులు... కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. రకరకాల పళ్లను, వరి మొలకలను స్థూపం ముందు నివేదనగా అర్పిస్తున్నారు. వాళ్ళ వేషభాషలు భిన్నంగా ఉన్నాయి.

స్త్రీలు స్కర్టులు, షర్టులు ధరించారు. పురుషుల్లో కొందరు లుంగీలు, మరి కొందరు ప్యాంటులు వేసుకున్నారు. భిన్నమైన తలకట్టులో ఉన్నారు. అగరవత్తుల సువాసన కూడా మన దేశంలోలా లేదు. వేరే ఎక్కడో... ఏదో దేశంలో ఉన్నాను. ఎక్కడో అర్థం కావడం లేదు.

మెల్లగా లేచి పరిసరాలను పరిశీలిస్తున్నాను.. ఇది ఏ ప్రాంతం అని పక్కనున్న వారిని అడిగితే 'లంఫూన్, థాయిలాండ్' అని చెప్పారు.

ఆశ్చర్యం కలిగింది. అయితే నేనిప్పుడు థాయిలాండ్లో ఉన్నానన్నమాట. మయన్మార్ నుంచి నేను థాయిలాండ్‌కు వచ్చానన్నమాట. ఇక్కడ తెలుగు మూలాలకు సంబంధించి ఏం సమాచారం తెలుస్తుందో చూడాలి.

థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్, టూరిస్టు ప్రదేశం పటాయా గురించి తెలుసు కానీ లంఫూన్ అనే నగరం పేరు ఎప్పుడూ వినలేదు. ఆ దేశంలో ఈ నగరం ఎక్కడ ఉందో? ఇలా ఆలోచిస్తూ పరిశీలిస్తూ ఉంటే, ఎదురుగా "వాట్ చామదేవి" ఇంగ్లిష్ అక్షరాలున్న బోర్డు కన్పించింది. వాటి పైన వేరే లిపిలో అక్షరాలున్నాయి. బహుశా థాయిలిపి కావచ్చు.

పక్కనున్న వారికి ఆ బోర్డును చూపించి ఏమిటని ఆరా తీశా.

థాయిభాషలో వాట్ అంటే ఆలయం. హరిపుంజాయి మహారాణి చామదేవి సమాధినే ఇలా అ స్థూపంగా నిర్మించారు.. మొత్తం 21 మీటర్ల ఎత్తని పేర్కొన్నారు.

ఒక్కసారిగా గతం అంతా గుర్తుకువచ్చింది. చామదేవి మహారాణి ఆస్థానం, హరిపుంజాయి రాజ్యం, మంత్రివర్యులు, రాజ్య పర్యటన, ప్రవల్లిక పరిచయం, ఏనుగు అంబారీ, ప్రవల్లిక నా ప్రేమను తిరస్కరించడం, తెల్ల కలువను తెమ్మని తను షరతు విధించడం, దాన్ని కోసే ప్రయత్నంలో నేను ఊబిలోకి జారిపోవడం.

అయితే అక్కడ అలా ముగిసిన నా కథ, మళ్లీ ఇక్కడ లంఫూన్లో చామదేవి సమాధి దగ్గర తిరిగి ప్రారంభమైంది. అయితే కాలచక్రంలో ఎన్ని వందల ఏళ్ళు పయనించి వచ్చానో...

ఈ సమాధిని చూస్తే చాలా ఏళ్ళు గడిచినట్టుగా అన్పిస్తోంది. అయితే చామదేవి మహారాణి కాలగతిలో కలిసిపోలేదు. ఆమె నేటి



ప్రజలకు ఆరాధ్య దేవతగా మారింది. ఈ విషయం నాకెంతో సంతోషం కలిగించింది.

పక్కనే పెద్ద భవనం ఉంది. బంగారు తాపడం చేసిన తలుపులు.. బహుశా బౌద్ధాలయం అయి ఉంటుంది.

లోపలికి వెళ్లి చూస్తే పెద్ద బుద్ధ విగ్రహం.. బంగారు వర్ణంలో ...అక్కడా ప్రార్థనలు జరుగుతున్నాయి. బౌద్ధ గురువులూ ఉన్నారు. ఆ ఆలయ గోడల మీది పెయింటింగ్స్ ఇట్టే ఆకర్షించాయి.

చామదేవి సపరివారంగా నదీ మార్గంలో లంఫూన్ రావడం.. సింహాసనం అధిష్టించడం.. మగ కవల పిల్లలకు జన్మనివ్వడం... వీరాంగ దండయాత్ర...

కోటలోపలికి బల్లెం వేయడంలో విఫలమై వెనుదిరగడం.. చామదేవి అనేక బౌద్ధారామాలను నిర్మించడం...లంఫూన్ కు పెద్ద కొడుకును, లాంపెంగ్ కు చిన్న కొడుకును రాజులుగా పట్టాభిషిక్తులను చేయడం.. రాజమాతగా ప్రజల మన్ననలు అందుకోవడం.. చామదేవి మరణం... పెద్ద కొడుకు ఆమె చితిని అంటించడం ..

ఆమె అస్థికలపై చామదేవి గుడిని పెద్ద కొడుకే నిర్మించినట్టు ఆ పెయింటింగ్ లు తెలియజేస్తున్నాయి. చామదేవి జీవిత గాథనంతా ఆ చిత్రాలు చెబుతున్నాయి.

అలనాటి కోట గురించి పక్కనున్న వారిని అడిగాను.. అవన్నీ కాలగతిలో కలిసిపోయాయని చెప్పారు.

ఆమె నిర్మించిన 'అరణ్యకరం' బౌద్ధ విహారం మాత్రమే మిగిలి ఉందని తెలియజేశారు. ఇప్పటికి చాలాసార్లు మరమ్మత్తులు చేసిన తరవాత ఇలా మిగిలిందని కూడా చెప్పారు.

ఆ ఆలయ ప్రాంగణంలో ఎన్నో సావనీర్ షాపులు.. ఎక్కడ చూసినా చామదేవి ప్రతిమలే.. కీ చెయిన్ల నుంచి మూడు అడుగుల విగ్రహాల వరకూ ఉన్నాయి. ఇత్తడి, వెండి, బంగారు విగ్రహాలు కూడా ఉండడం ఆశ్చర్యం కలిగించింది. ఓ నడి వయసు జంట చామదేవి వెండి విగ్రహాన్ని కొంటున్నారు.

'ఎందుకు ఈ విగ్రహన్ని కొంటున్నారు? ఎవరు ఈమె వివరిస్తారా? ' అని ఆ జంటను అడిగాను.

"ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాణి ఈమె. ఇప్పటికీ ఈ ప్రాంతాన్నంతా ఈమె ఆత్మ రక్షిస్తుందని మేం నమ్ముతున్నాం. మా స్నేహితుడి ఇంట్లో గృహప్రవేశం ఉంది. వారికి బహుమతిగా ఇవ్వడానికి ఈ విగ్రహాన్ని కొంటున్నాం".. అని వాళ్లు తెలిపారు.

చామదేవి అనే పేరు థాయిపేరులా లేదే? అని ప్రశ్నిస్తే..

"అవును... ఇది ఇండియన్ పేరు.. ఒకప్పటి హరిపుంజాయి రాజ్యం ఆనాటి మన్ రాజ్యాలలో ఒకటి... అంతకు మించిన సమాచారం మాకు తెలియదు.,.." వారి పనిలో వారు నిమగ్నం అయ్యారు.

ఆలయం నుంచి వెలుపలికి వచ్చాను.

లంఫూన్ ప్రశాంతమైన నగరం.. ఆనాటి సాంస్కృతిక వారసత్వాన్ని అలాగే కొనసాగిస్తోంది. అపార్ట్మెంట్ల సంస్కృతి ఇంకా ఈ నగరాన్ని తాకలేదు. కార్లు, టూ వీలర్ల సందడీ తక్కువే. టూ వీలర్లలో వెనుక కూర్చున్న వారే కాదు పిల్లలు కూడా హెల్మెట్లు పెట్టుకోవడం ఆశ్చర్యం కలిగించింది. 'చామదేవి మెమోరియల్ పార్క్'కి దారి అని ఓ సైన్ బోర్డ్ కన్పించింది. ఈ దేశంలో మొదట థాయి అక్షరాలలో రాసి దాని కింద ఇంగ్లీష్ లో రాస్తున్నారు. అంటే వీళ్లకి తమ మాతృభాషంటే ఎంతో గౌరవం అన్నమాట. అలాగే విదేశీ టూరిస్టుల సౌకర్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని ఇంగ్లీష్‌లో కూడా రాస్తున్నారు.

ఆ మెమోరియల్ పార్కును చూడాలన్న ఉత్సాహంతో ఆ దారిలోనే వెళ్లాను. ప్రతి కూడలిలో ఏనుగుల శిల్పాలు.. చూడముచ్చటగా ఉన్నాయి..

ప్రవల్లిక, నేను ఏనుగు అంబారీపై వెళ్లడం గుర్తుకువచ్చింది. అంటే ఆనాడే కాదు నేడు కూడా ఈ నేల మీద ఏనుగులు ప్రసిద్ధి అన్నమాట. ఆనాటి వారసత్వాన్ని వీళ్లింకా కొనసాగిస్తున్నారు. ప్రవల్లిక గుర్తుకు రాగానే మనసు ఎలాగో మారిపోయింది. అసలు ఎవరా





అమ్మాయి, తనకూ నాకూ ఏమిటీ సంబంధం?

మయన్మార్లో కన్పించింది.. థాయిలాండ్లో కన్పించింది.. కానీ మాటి మాటికీ మాయమవుతోంది. తనెక్కడున్నా కలుసుకోవాలి.. తననే జీవితభాగస్వామిగా చేసుకోవాలి..

ఏదో సంగీతం వినిపించి ఈ లోకంలోకి వచ్చాను. ఏడుగురు వ్యక్తులు ఓ చెట్టు కింద టేబుల్స్ పై కూర్చుని ఒక్కో వాయిద్యాన్ని వాయిస్తున్నారు. అందరూ లుంగీలే ధరించారు. పాతిక నుంచి యాభై ఏళ్ల మధ్య వయస్కులై ఉంటారు. సంగీత వాయిద్యాలు కూడా మనతో పోలిస్తే భిన్నంగా ఉన్నాయి. ఏదో సరదాగా వాయిస్తున్నట్టుగా ఉంది. డబ్బుకోసం కాదు. పార్కుల్లో పిల్లలు ఆడుకుంటున్నట్టుగా వీళ్లందరూ రోడ్డు పక్కన కూర్చుని సంగీత ప్రపంచంలో ఓలలాడుతున్నారు. మన దేశంలో ఇళ్లల్లోనో, కాలేజీల్లో, ఫంక్షన్ హాల్స్ లోనో ఆర్కెస్ట్రా సభ్యుల్ని చూస్తాం.

కానీ ఇక్కడ స్నేహితులందరూ కలిసి వాయిద్యాలను వాయిస్తూ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నట్టుగా ఉంది. థాయి సంగీతం వీనుల విందుగా ఉంది. అక్కడ కాసేపు గడిపి ముందుకు సాగాను. చామదేవి మెమోరియల్ పార్క్ రానే వచ్చింది.

దీర్ఘ చతురస్రాకారంలో ఎంతో విశాలంగా పార్క్ ఉంది.

ఓ వైపున మండపం నిర్మించి దాని పై పది అడుగుల స్తంభంపై చామదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఓ చేతిలో ఖడ్గం, మరో చేతిలో పూలమాల. ఓవైపు కరుణామూర్తి..

మరో వైపు శత్రువుల పాలిట చండిక.. అన్నట్టుగా ఆ విగ్రహాన్ని చూస్తే అర్థం అవుతుంది. ఎడమ వైపు పైట వేసుకున్నట్టుగా ఆ విగ్రహాన్ని మలిచారు. నడుముకు ఒడ్డాణం కూడా ఉంది.

పార్క్ నిండా పూల మొక్కలే. జనాలు ఏదో పార్క్ కి వచ్చి కాసేపు సేదతీరి వెళ్తున్నట్టుగా లేదు. వచ్చేవాళ్లందరూ పెద్ద పెద్ద పండ్ల బుట్టలతో వస్తున్నారు.

వాటిల్లో డజన్ల కొద్దీ అరటిపళ్లు, డ్రాగన్ ఫలాలు, ఆపిల్ పండ్లున్నాయి. ఆ బుట్టల్ని విగ్రహం ముందు ఉంచి మోకాళ్లపై కూర్చుని కళ్లుమూసుకుని ప్రార్థిస్తున్నారు. కొంత మంది గట్టిగా ఏవో మంత్రాలు జపిస్తున్నారు.

ఓ జంట... భార్యాభర్తలై ఉంటారు బహుశా. చామదేవి విగ్రహాన్నే తదేకంగా చూస్తోంది ఆ ఇల్లాలు. ఆమె కళ్లనుంచి నీళ్లు జలజలారాలిపోతున్నాయి. ఆమె భర్త స్థితీ ఇంచుమించు అలాగే ఉంది. ఏదో పుట్టెడు దు:ఖంలో ఉన్నట్టున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, వారి కష్టాలను కడతేర్చే దేవతలా చామదేవి మహారాణి రూపాంతరం చెందడం నాలో ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

మండపం ముందు లెక్కలేనన్ని రంగురంగుల కొవ్వొత్తులు.. అగరవత్తులు వెలుగుతున్నాయి. ఎవరితోనైనా మాట్లాడదాం అని చుట్టూ చూశాను.

ఓ నడి వయసు వ్యక్తి, ప్యాంటూ షర్టూ టక్ చేసుకుని వస్తున్నాడు. అతడిని మండపం ముందే ఆపేసి..

'ఈవిడ ఎవరు? ఎందుకింత పూజలు ... 'అని అడిగాను.

'ఆమె చామదేవి.. ఉత్తర థాయిలాండ్లో తొలి రాజ్యాన్ని స్థాపించిన రాణి... ఎనిమిదో శతాబ్దానికి చెందింది. మన్ జాతీయురాలు. మా కోర్కెలు తీర్చే కల్పవల్లి. కష్టమొచ్చినా సుఖమొచ్చినా మొదట ఆమెకు విన్నవించడానికి ఇక్కడికి వస్తాం. విద్యార్థులు, ఉద్యోగార్థులు, పెళ్లికావలసిన వాళ్లు, పిల్లలు లేని వాళ్లు, ఇల్లు కట్టుకోవాలని కలలు కంటున్నవాళ్లు ... ఇలా అందరూ ఆ దేవతనే ప్రార్థిస్తుంటారు.

సమస్యేదైనా ఈ చల్లని తల్లి దీవెనలతో కడతేరిపోతుంది' అని వివరించాడు.

'ఈమె పేరు ఇండియన్ లాగా ఉంది, ఆ దేశంతో ఈమెకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా..'

'అవును, ఈమెది థాయిపేరు కాదు. ఇండియా అయి ఉండొచ్చు. మాకు ఆ వివరాలు తెలియదు. ఇక్కడికి దగ్గరలోనే 'హరిపుంజాయి నేషనల్ మ్యూజియం' ఉంది అక్కడ ప్రయత్నించండి..' అంటూ ఆయన ముందుకు వెళ్లాడు.

లంపూన్ ప్రసిద్ధ టూరిస్ట్ ప్రదేశాలలో నేషనల్ మ్యూజియమ్ కూడా ఉన్నట్టుంది.

అడిగిన వెంటనే ఆటో వాడు మ్యూజియం దగ్గరికి తీసుకువచ్చాడు.

కాలానికి తగినట్టు నా ఆహార్యం మారుతోంది. ఆనాడు రాజసభలో పంచకట్టులో ఉన్నాను. కానీ ఇప్పుడు మాత్రం జీన్సు టీ షర్టు, ప్యాంటుల్లో మామూలుగానే ఉన్నా.

ఏదో మాయ చేసినట్టుగా నా జేబులో కూడా థాయి కరెన్సీ నోట్లు. ఈ మాయంతా తెలుగు తల్లే చేస్తోందని అర్థం అయింది.

మ్యూజియమ్ బిల్డింగ్ పైన గణేష్ చిత్రం ఉంది..

'ఆ గుర్తు ఏమిటి?' ఆటో వాడినే అడిగాను.

'థాయిలాండ్లో కళల విభాగానికి చెందిన అధికారిక చిహ్నం'... చెప్పాడు అతడు.

మన విఘ్నేశ్వరుడు ఈ దేశంలో కళల విభాగానికి గుర్తుగా ఉన్నాడా.. చాలా ఆశ్చర్యం కలిగింది.

మ్యూజియం భవనం పెద్దదే. మూడు అంతస్థులుగా ఉంది. పై రెండు అంతస్థులలో పురావస్తు పాత్రలు.. ఆభరణాలు.. వివిధ



కాలాల్లో వినియోగించిన ఆయుధాలను భద్రపరచారు. దిగువ అంతస్తులో లంపూన్ ప్రాంతంలో దొరికిన ఎనిమిది శిలాశాసనాలను ప్రదర్శనలో పెట్టారు.

ఈ శాసనాలన్నీ మన్ భాషలో ఉన్నాయి. మన్ భాషా లిపికి మూలం దక్షిణ భారతదేశానికి చెందిన పల్లవ లిపి అని ఇక్కడ బోర్డుపై స్పష్టంగా పేర్కొనడం విశేషం. ఈ మన్ భాష లిపి నుంచే లాన్నా లిపి, దాన్నుంచి థాయి లిపి రూపుదిద్దుకున్నాయని కూడా రాశారు. చామదేవి కాలం నుంచి ఆ శాసనాలు ఉన్నాయి. కొన్నిటి ఆనవాళ్లు మాత్రమే మిగిలాయి.

11 వ శతాబ్దికి చెందిన ఓ మన్ శాసనంతో తెలుగు లిపిని పోల్చడానికి ప్రయత్నించా. మన్ అక్షరాలు కూడా తెలుగులా గుండ్రంగా ఉన్నాయి. వీరి లిపిలో వత్తులు కూడా ఉన్నట్టుగా ఉంది. ఆ శిలా శాసనాలను పరిశీలిస్తుంటే పరిచయం అయ్యారు ఫ్రెంచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఒలీవియో.. నలభై లోపు వయసుంటుంది. ఆజానుబాహుడు. నన్ను చూడగానే 'మీది భారతదేశమా..' అంటూ పలకరించారు. రూపురేఖలని బట్టి నా ఉనికిని ఆయన పసిగట్టారని అర్థం అయింది.

'అవునని..' తలూపాను.

'మీ దేశమంటే నాకు చాలా అభిమానం. ఆగ్నేయాసియాలో అడుగడుగునా భారతదేశ ప్రభావం కనిపిస్తుంది.

'మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు' వివరాలు అడిగా.

'ఛింగ్మయి యూనివర్సిటీ లో సియామ్ హిస్టరీ ప్రొఫెసర్ గా ఆరు నెలల కోసం వచ్చాను. ఈ లంపూన్ కి పాతిక కిలోమీటర్ల దూరంలో ఛింగ్మయి ఉంది' తెలిపారు ఆయన.

'చామదేవి ఎవరు? ఈమెకు ఇండియాతో ఏదైనా సంబంధం ఉందా ?'

'అవును థాయి వాళ్లతో పోలిస్తే చామదేవి పేరే కాదు రూపం కూడా భిన్నంగా అన్పించింది. ఖాళీ సమయాల్లో ఆమె గురించి పరిశోధించడం మొదలుపెట్టా.

కొన్ని ఆసక్తికర విషయాలను సేకరించా.


'చామదేవి 8 వ శతాబ్దికి చెందినదైతే ఆమెకు సంబంధించిన గ్రంథాలు ఆ తరవాతి కాలంలో రాశారు. చామదేవి ఇతివృత్తానికి సంబంధించి 15 వ శతాబ్దికి చెందిన రెండు గ్రంథాలు బహుళ ప్రాచుర్యం పొందాయి. ఒకటి బోధిరామ్ సిరి రాసిన చామదేవివంశ, రెండోది బౌద్ధగురువు రత్తనపన్న రాసిన జినకలమాలిని.

ఈ రెండు గ్రంథాలూ పాలీభాషలో ఉన్నాయి. చామదేవి వంశం వాళ్లు ఈ ప్రాంతాన్ని 500 ఏళ్లు పరిపాలించారు. వీరాంగను పెళ్లిచేసుకోవడానికి ఇష్టపడని చామదేవి తన ఇద్దరు కొడుకులకూ వీరాంగ కూతుర్లనే ఇచ్చి పెళ్లిచేసిందట. పెద్ద కొడుకు మహందాయక్ ను లంఫూన్ కు, చిన్న కొడుకు అనందాయక్‌ను లంపాంగ్ కు రాజులుగా చేసింది. థాయిలాండ్లో బ్యాంకాక్ తరవాత రెండో అతి పెద్ద నగరం చింగ్మయి అయితే, మూడో అతి పెద్ద నగరం లంపాంగ్. ఈ నగరాన్ని ప్రాచీన కాలంలో కెలంగ్ అనే వారు. భారతదేశంలోని కళింగకు మారు రూపం కావచ్చు. మయన్మార్, థాయిలాండ్, వియత్నాం, కంబోడియాలలో ఎన్నో హిందూ వలస రాజ్యాలు కన్పిస్తాయి. ఇక ఇండోనేషియా పేరే ఇండియా నుంచి ఏర్పడింది. అక్కడ అడుగడుగునా ఎన్నో భారతీయ వలస రాజ్యాలు..' ఆయన ఓ తరగతి గదిలో పాఠం చెబుతున్నట్టుగా మాట్లాడుతున్నారు.

'మరి చామదేవికి దక్షిణ భారతదేశంతో ఏదైనా సంబంధం ఉందా..' మధ్యలో ఆపేస్తూ అడిగా.

'ఆమె మన్ రాజ్యానికి చెందిన రాణి. ఒకప్పుడు మధ్య థాయిలాండ్ ప్రాంతంలో 'ద్వారావతి' అనే గొప్ప మన్ రాజ్యం ఉండేది. చరిత్రగతిలో అది పూర్తిగా కరిగిపోయింది. ద్వారావతి ఏ ప్రాంతంలో ఉండేది అన్న దానిపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. మన్ జాతీయులు కృష్ణాగోదావరి ముఖ ద్వారాల నుంచి దక్షిణ బర్మాకు అక్కడి నుంచి థాయిలాండ్, కాంబోడియాలకు వ్యాప్తి చెందారని బ్రిటిష్ చరిత్రకారులు ఎప్పుడో తేల్చిచెప్పారు. అది నేటికీ ప్రామాణికమైన పరిశోధన. దానితో ఎవరూ విభేధించలేదు. చామదేవి మూలాలు ఆ నేలతో ముడిపడే ఉంటాయి. మరో ఆశ్చర్యకరమైన విషయం... లండన్లోని బ్రిటీష్ మ్యూజియంలో తొలి పల్లవులకు చెందిన రాణి చామదేవి వేయించిన శాసనం ఈనాటికీ





ఉంది. చామదేవి.. చారుదేవి దగ్గర దగ్గర పేర్లలా ఉన్నాయి. చామదేవికి జామదేవి, చిన్నమ దేవీ అనే పేర్లూ ఉన్నాయని చారిత్రక గ్రంథాలు చెబుతున్నాయి.

చిన్నమదేవి పేరే చింగ్మయిగా మారిపోయి ఉండవచ్చు. ఏది ఏమైనా బుద్ధుడితో సమానంగా ఆమె పూజలు అందుకుంటూ నేడు ఉత్తర థాయి ప్రజల గుండెల్లో దేవతలా గూడుకట్టుకుని ఉంది' అని ఆ ఫ్రెంచ్ ప్రొఫెసర్ ముగించారు.

మన తెలుగు నేలతో చిక్కని మూలాలు ఉన్న కథను ఇలా విదేశీయుల నోటి వెంట వింటుంటే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి.

'థాంక్యూ ప్రొఫెసర్, మిమ్మల్ని నేనెప్పుడూ గుర్తుపెట్టుకుంటాను' షేక్ హ్యాండ్ ఇవ్వబోయాను.

'ఈ మాత్రం దానికేనా..' అంటూ ఆయన నన్ను కావలించుకున్నాడు.

'నీ పేరేమిటి ?'

'సూర్యవర్మ'

'ఓహ్... వండర్ ఫుల్... సూర్యవర్మ ది గ్రేట్' అని గట్టిగా నవ్వాడు.

ఎందుకు నవ్వాడో అర్థం కాలేదు... కానీ నేనూ నవ్వాను. ఇద్దరమూ కలిసి మ్యూజియం బయటికి వచ్చాం. తను అద్దె బండి మీద లంపూన్ కి వచ్చారట.

'మీరెక్కడికి వెళ్లాలో చెప్పండి అక్కడ విడిచిపెట్టి వెళ్లిపోతాను ' అని అడిగారు. కానీ నాకు ఏమీ తోచలేదు. ఎక్కడికి వెళ్లాలో అర్థం కాలేదు.

'మీరు వెళ్లండి పర్వాలేదు' అన్నాను. మళ్లీ ఇంకోసారి ఆయనకు థాంక్స్ తెలియజేశా.

ఆయన హెల్మెట్ ధరించి చేయి ఊపుతూ అక్కడి నుంచి బయల్దేరారు. నేను కాసేపు ఆయన వెళ్లిన వైపే చూస్తూ నిలుచున్నా.

చామదేవి సమాధి దగ్గరకే మళ్లీ వెళ్లాలనిపించింది. వాట్ చామదేవికి ఎలా వెళ్లాలో అడుగుతూ సైన్ బోర్డుల వెంట నేరుగా వెళ్లిపోయా.

చామదేవి సమాధి దగ్గర ఇంకా జనాలు ప్రార్థనలు చేస్తూనే ఉన్నారు. నేనూ వాళ్లలో ఒకరిగా కలిసిపోయా. రెండు చేతులూ జోడించి నమస్కరించి 'అమ్మా... ఇన్నేళ్లూ నువ్వెవరో తెలుసుకోకుండా బ్రతుకుతున్న జాతి మాది.

నువ్వు నాకు కన్పించి మయన్మార్ అంతా నాతోనే ఉన్నా గుర్తుపట్టలేకపోయాను.

నిన్ను వినుక్కున్నాను.. కనురుకున్నాను. చరిత్రను మరిచిపోతున్న జాతిగా అపకీర్తి తెచ్చుకోము తల్లీ. నీ గురించి మేమందరూ తెలుగసుకునేలా చేస్తాను తల్లీ. నీలా ఇంకా ఏయే దేశాలలో మనవాళ్లు రాజ్యాలు స్థాపించారో మున్ముందు తెలుసుకునేలా చేయి తల్లి... కన్నీటి భాష్పాల మధ్య ఆ దేవతను ప్రార్థిస్తూ అలాగే కూర్చుండిపోయాను. నాలో ఏదో తెలియని శక్తి ఆవహించింది.

(తరువాయి వచ్చే సంచికలో...)

ఆహ్వానం
11,12, జనవరి
2020
సుందరయ్య
విజ్ఞానకేంద్రం
హైదరాబాదు

'సృజనాత్మక ధిక్కారం'

విప్లవ రచయితల సంఘం
యాభై ఏళ్ల మహాసభలు

తెలుగురాష్ట్రాల బయట

కలకత్తాలో తెలుగువారు

బద్రి కూర్మారావు
9704798643



కలకత్తాలోని కాళీఘాట్, సాల్ట్‌లేక్, హౌరా, హుగ్లీ, సంత్రాగచ్చి, శ్రీరాంపూర్, టిటాగర్, సెంగలి మొదలగు ప్రాంతాలలో తెలుగు వారు సుమారు లక్ష నుండి లక్షా ఏభైవేల వరకు ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలవారికి హైదరాబాద్ కంటె 'కొల్‌కొతా' దగ్గరగా ఉండటం చేత, జూట్ మిల్లులు, కాగితం పరిశ్రమలలో ఉపాధి దొరకటం, ఆ రోజులలో 'కొల్‌కొతా'లో జీవన ప్రమాణ స్థాయి తక్కువగా ఉండటం, ప్రతి సామాన్యుడికి రైలు అందుబాటులోకి రావటం, వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పొందూరు, టెక్కలి, పలాస, మందస, సోంపేట ప్రాంతానికి చెందిన దేవాంగ కులస్తులు అధిక సంఖ్యలోను పద్మశాలి, కాపు, యాదవ, రెడ్డి, చాకలి కులస్తులు తక్కువ సంఖ్య లోను వలసపోయారు. మాల, మాదిగ కులస్తులు ఒడియా తెలు కుల కులస్తులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. విశాఖజిల్లా అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాల నుండి కాపులు, గవర కులస్తులు, ఇతర కులాల వారు ఉన్నారు. ఇచ్చట తెలుగువారు సుమారు 150 సం॥క్రితము నుండి నివసిస్తున్నారు. వీరిలో చాలాశాతం నిరక్ష్యరాస్యులే.

1882 సం॥ టిటాగడ్ జూట్ మిల్లు స్థాపన నుండి తెలుగు వారున్నారు. అలాగే రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బర్మాపై జపాన్ వారు బాంబులు వేయడంతో ఉత్తరాంధ్రవాసులు కాలినడకన 'కొల్‌కొతా' చేరుకొని జూట్‌మిల్లులలో పనికి చేరారు. స్వాతంత్ర్యం అనంతరం కొల్‌కొత్తాలో కర్రమిల్లులు (సామిల్లులు) ఏర్పాటుతో శ్రీకాకుళం జిల్లా సోంపేట, పలాస, ఇచ్ఛాపురం ఉద్దానం వాసులు అగ్నికుల క్షత్రియ (పల్లి), యాదవ కులస్తులు అధిక సంఖ్యలో ఈ మిల్లులలో పని చేయడానికి కొల్‌కొత్తా చేరుకున్నారు. ప్రస్తుతం ఒక్క టిటాగఢ్‌లోనే 15,000 మంది తెలుగు ఓటర్లున్నారు.

తెలుగువారి కోసం తెలుగు పాఠశాలలు ఏర్పాటు చేయబడినవి. దేవాలయాలు, గుడులు, తెలుగు పండుగలు జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఊళ్ళకు ఊళ్ళు తెలుగు ఊళ్ళు, తెలుగు బోర్డులు, కొంతమంది పేర్లుతో తెలుగు బస్తీలు (వీధులు) ఏర్పడ్డాయి. సోద్‌పూర్, ఖుర్దా, కమర్‌హోటీ...ఇలా ఎన్నో ఊళ్ళలో తెలుగువారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. 24 పరగణాల జిల్లాలో 9 తెలుగు బడులు, హుగ్లీ జిల్లాలో నాలుగు బడులు ప్రాథమిక పాఠశాలలు, హయ్యర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. 1నుండి 5 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపంపే తెలుగుపుస్తకాలను వీరు చదువుకుంటారు. 6,7 తరగతుసురవరంలకు తెలుగు మీడియం పుస్తకాలు ఖరగ్‌పూర్ వాళ్ళు రూపొందిస్తారు. టిటాగఢ్, హుగ్లీ ప్రాంతాలలో తెలుగు గ్రంథాలయా లున్నాయి.

కలకత్తా ఆంధ్రా అసోసియేషన్ : (1936)

కలకత్తా ఆంధ్రా అసోసియేషన్ సాహనగర్ (కాళీఘాట్ దగ్గర) 1936 సెప్టెంబర్ 9వ తేదీన వినాయక చవితినాడు 20 మంది సభ్యులతో శ్రీ వడ్లమాని వెంకటేశం పంతులు వ్యవస్థాపక అధ్యక్షునిగా ఆవిర్భవించింది. అప్పటి నుండి ఎన్నో మైలురాళ్ళు దాటుకుంటూ 2010-11 సం॥ ప్లాటినం జూబ్లీ (75 సం॥) జరుపుకొంది.

ఆంధ్రరాష్ట్రం మొదటి ముఖ్యమంత్రి శ్రీ ప్రకాశం పంతులు, ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర గవర్నర్ సి.ఎమ్.త్రివేది, నందమూరి తారక రామారావు వంటి తెలుగు ప్రముఖులు ఎందరో కలకత్తా ఆంధ్రా అసోసియేషన్‌ను సందర్శించారు.

తెలుగు ప్రజలకు విద్యా, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో తోడ్పాటు అందించడం ఈ సంఘం యొక్క ప్రధాన లక్ష్యం. కల కత్తాలో తెలుగుభాష, సాహిత్యం, తెలుగు సంస్కృతుల పరిరక్షణ వీటి ధ్యేయం. అలాగే తెలుగుజాతి ఔన్నత్యానికి, ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తోంది.

కలకత్తాలో మొదటి తెలుగు మాధ్యమ పాఠశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 1938 లో ఏర్పాటు చేయబడింది. దీనికోసం కృషి చేసినవారు డా॥ సి. సాంబశివరావు (విద్యావేత్త, సామాజిక కార్యకర్త). 1953లో ఆంధ్ర సంఘం పాఠశాల స్థాపించబడి తెలుగు ఒక సబ్జెక్టుగా ఆంగ్ల మాధ్యమంతో ప్రస్తుతం 12వ తరగతి వరకు 1000 మంది విద్యా ర్థులతో వర్ధిల్లుతున్నది. ఈ పాఠశాలలో చదువుకున్న తెలుగువారు దేశమంతటా మంచి హోదాలలో పనిచేయుచున్నారు. ఇది తెలుగు వారికి గర్వకారణం. వీటితోపాటు పొట్టిశ్రీరాములు హైస్కూలు, జ్యోతిర్మయి విద్యాలయం, ఆంధ్ర విద్యాలయం, పని చేస్తున్నాయి.

తెలుగు ఉగాది, శ్రీరామనవమి, వినాయక చతుర్థి, సామూ హిక సత్యనారాయణ వ్రతాలు జరుపుతారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయాలు, నూకాలమ్మ గుడులు తెలుగు ప్రజల భక్తి, సాంస్కృతిక అవసరాలను తీర్చుతున్నాయి. తెలుగు ప్రాంతాల నుండి రప్పించిన తోలుబొమ్మలాటలు, హరికథలు, బుర్రకథలు, పగటి వేషాలు, పౌరాణిక నాటకాలతో ఉత్సవాల సమయంలో తెలుగుతనం ఉట్టిపడుతుంది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు, సినీ కళాకారులను తెప్పించటం, టి.వి. ఆర్టిస్టులను రప్పించడం, అష్టావధానాలు, కవి సమ్మేళనాలు, జానపద కళలు ప్రదర్శనలతో తెలుగు ప్రాంతాలతో సాన్నిహిత్య సంబంధాలు నెరపు తున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే ధ్యేయం గా ఏర్పడిన ఈ సంస్థకు ప్రస్తుతం శ్రీ వేదుల సాయిశ్రీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు.

ఒకప్పుడు 8 జ్యూట్ మిల్లులలో పనిచేసిన తెలుగు కార్మికులు

కవిత

స్వేచ్ఛ నా భాష

పంపిణీ న్యాయ నిరాకరణ నిర్ణయమయ్యాక
దత్తాంశాలను పని చెయ్యనివ్వరు!

ఆఖరి వరసలో ఆఖరి మనిషై,
అంబేద్కర్ ఆకలితో ఎదురు చూస్తూనే ఉంటాడు!
వితండపు నైరాశ్య హేళనల నటనాలయం
నడుస్తూనే ఉంటుంది!

అభివృద్ధి మోత ఎత్తదలుచుకున్నపుడు
వెనకబాటు ఆక్రందనలకు నివృత్తేమీ మిగలనీయరు!

అరాయించుకునే శక్తి లేని నేను
ఆంగ్రేజి మన్ను తినలేను
దేవభాష పుష్పక విమానాలెక్కి విహరించలేను
బలుసాకు భాషను వొదులుకోలేను
నేల మీద నా కాలి నడక నాపలేను

స్వేచ్ఛ నా భాష

స్వేచ్ఛ స్థానికం నేను స్థానికం

సృష్టించే కాడ
శ్రమించడం నా భాష

ప్రేమించే కాడ ప్రకృతి నా భాష

వెట్టి విపత్తు దాటే కాడ
వలస వలలో ఇరుక్కో నిది నా భాష

ఉద్యోగం కాడ తగిన సేవ నా భాష

అర్పించే కాడ కృతజ్ఞత నా భాష

మసలుకునే కాడ
మానవత్వం నా భాష

పోగొట్టుకున్నకాడ వెతుక్కోవడం నా భాష

వెదికే కాడ
సాధించుకోవడం నా భాష

నేర్చుకున్న కాడ
భద్రపరచుకోవడం నా భాష

గుదిబండ మొయ్యాల్సి వచ్చినపుడు
స్వేచ్ఛాగానమే నా భాష

నన్ను నాకు యజమానిగా
నిలబెట్టేదే నా భాష

బతుకే బాసైన కాడ
బతకడమే నా భాష

కృపాకర్ పొనుగోటి
9948311667

ఇప్పుడు 7జ్యూట్ మిల్లులు మూతపడగా ఒక్క జ్యూట్ మిల్లులో మాత్రమే పనిచేస్తున్నారు. కర్రమిల్లులు కూడా మూత పడటంతో తెలుగువారు ఇతర వృత్తులలోకి వెళ్ళటంతోపాటు చదువు, ఉద్యోగాలు పేరిట మరల ఆంధ్రప్రాంతం వైపు కొందరు చేరుకుంటున్నారు.

'ఆద్రా'లో తెలుగువారు

పశ్చిమబెంగాల్‌లోని పురూలియా జిల్లాలోని 'ఆద్రా' ఒక చిన్న పట్టణం. ఇది కొల్‌కొతా, ఖరగ్‌పూర్ స్టేషనులకు 4 గంటల ప్రయాణం చేయగల దూరంలో ఉంది. ఇది ఒక రైల్వే డివిజన్. ఇచ్చటకు తెలుగువారి రాకకు నాంది పలికిన వారు శ్రీకాకుళం జిల్లా పెద్దపాడు నివాసి శ్రీ కోలా సూర్యనారాయణగారు. ఈయన బర్మాలో ఉన్నప్పుడు రెండవ ప్రపంచ యుద్ధకాలం (1939-45) లో సుభాష్ చంద్రబోసు స్థాపించిన అజాద్ హింద్‌ఫౌజ్ (ఐఎన్ఏ)లో చేరి స్వాతంత్ర్యం అనంతరం కొల్‌కొతా చేరుకుని రైల్వేలో ఉద్యోగం సంపాదించాడు. తరువాత ఆద్రా డివిజన్‌కు బదిలీ అయినాడు. తనతోపాటు తన గ్రామస్తులు అనేక మందిని ఆద్రాకు తెప్పించి ఉద్యోగాలలో చేర్పించాడు. అలా తెలుగువారి సంఖ్య పెరిగింది.

ఆద్రాలో ఒక్క యాదవ కులస్తులే సుమారు 350 కుటుంబాలు ఉంటాయి. తరువాత తెలగ, కాపు, కాళింగ, మంగలి, కంసాలి, హరిజన కులాలవారున్నారు. ఇతని కుమారుడు కోలా సింహాద్రి ఇచ్చటనే పుట్టి ఇక్కడనే చదివి ఉద్యోగం పొంది మరికొంత మంది తెలుగువారికి సహాయం చేసి పదవీవిరమణ గావించాడు.

ఆద్రాలో ఒకటి నుండి 5వ తరగతి వరకు తెలుగు మీడియం బడులు ఉండేవి. ఎస్.ఇ. రైల్వే ఉన్నత పాఠశాల (బాలికలు) లో 5వ తరగతి వరకు తెలుగు మీడియం ఉండి తరువాత హిందీ మాధ్యమం ఉండేది. తరువాత ఆంధ్రా సమాజం ఏర్పడింది. శ్రీకృష్ణ మందిరం, రామమందిరం, బాలాజీ మందిరం, నూకాలమ్మ గుడి నిర్మించారు.

వినాయక చవితి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు జరుపుకొంటారు. పెళ్ళిళ్లు తెలుగు పద్ధతులలోనే స్వగ్రామాలకు వచ్చి జరుపుకుంటారు.

అయితే ప్రస్తుతం వీరిలో ఎక్కువ మంది పదవీ విరమణ గావించారు. తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఒక్కొక్క కుటుంబం విశాఖపట్నం, శ్రీకాకుళం వంటి పట్టణాలకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం ఆద్రాలో తెలుగు మాధ్యమం పూర్తిగా కనుమరుగైంది.

డా.కాళిదాసు పురుషోత్తం
9000642079

'ఆమె లేఖలు'

ఒక పరిచయం : *ఆమెపేరు జూలియా ఛార్లోటి (Julia Charlotte). కుటుంబ సభ్యుల ఇష్టానికి వ్యతిరేకంగా విధురుడు, పిల్లల తండ్రి అయిన థామస్‌ను పెళ్లాడి అతనివెంట 1836లో ఇండియా వచ్చేసింది. థామస్ జడ్జిగా మద్రాసు ప్రెసిడెన్సిలో పదిచోట్ల పని చేశాడు. 1837లో ఆయన రాజమండ్రిలో జడ్జి పదవి చేపట్టాడు. జూలియా రాసిన మొత్తం లేఖల్లో ఇక్కడి జీవితం, ప్రజలు, సమాజం గురించి అనేక విషయాలు ప్రస్తావించింది; సంస్కృతి, విద్యా విషయాలను ఈ లేఖల్లో చర్చించింది. స్త్రీ విద్యపట్ల గాఢమైన అభిమానం వున్నా, క్రైస్తవం మీద చాలా ఇష్టం తనకు. ఈ ఉత్తరాల్లో ఆమె భర్తను జడ్జిగారు అని తరచు పేర్కొంది. 'జడ్జి దంపతులు' అంటే, జడ్జి థామస్, జూలియా దంపతులు. కుమార్తె అనారోగ్యం వల్ల ఈ దంపతులు 1839లో ఇంగ్లాండు వెళ్లిపోయారు. థామస్ 1840లో చనిపోయాక, ఆమె ఛార్లెస్ మేట్‌ల్యాండ్‌ను వివాహం చేసుకొని జూలియా మేట్‌ల్యాండ్ అయింది. యాత్రా చరిత్ర రచయిత్రిగా, బాల సాహిత్య రచయిత్రిగా జూలియా మంచి పేరు సంపాదించింది. 1843లో ఆమె ఈ లేఖలను "Letters From Madras During the years 1836 -1839" పేరుతో ప్రచురించిందిగాని, బయటకి రానివ్వలేదు. తర్వాత జూలియానే ఈ లేఖా రచయిత్రి అని వెల్లడి అయింది.*

సీనియర్ పత్రికా రచయిత, గురజాడ పత్రాల మీద విశేష పరిశ్రమ చేసి 'గురుజాడలు'- గురజాడ సమగ్ర రచనల సంపుటం సంపాదకులుగా వ్యవహరించిన పెన్నేపల్లి గోపాలకృష్ణ (1937-2011) పాతికేళ్లక్రితం ఈ లేఖలను 'ఆమె లేఖలు' పేరుతో అనువదించారు. అనువదించారనడంకన్నా, ఆ లేఖలను సొంతమాటల్లో వివరించారు. దీని జెరాక్సుకాపీ నాకు పంపించారు చదవమని. తర్వాత, ఆయన ఈ లేఖలను అనేక పర్యాయాలు తిరగరాసి, సవరణలు చేసి అచ్చుకు ప్రతిని సిద్ధం చేశారు. దురదృష్టవశాత్తు పుస్తకం అచ్చుకాకముందే ఆయన అనారోగ్యంతో మరణించారు.



పెన్నేపల్లి గోపాలకృష్ణ
(1937-2011)

ఆమె తన ఊరూ పేరూ చెప్పుకోకపోయినా, అనామకురాలు కాదు. పుట్టిందీ, పెరిగిందీ, జీవితం అంతా గడిపిందీ ఇంగ్లాండులో. కొంతకాలం మాత్రం ఇండియాలో ఉంది. ఆ కొద్దికాలమే దాదాపు రెండు శతాబ్దాలపాటు ఆమెను చరిత్రపుటల్లో జీవింపజేసింది. ఆమె భర్త ఈస్టిండియా కంపెనీ హయాంలో ఆంధ్రదేశంలో జిల్లా జడ్జిగా పనిచేసిన 'తెల్లదొర'. ఆమె తన భర్తను చేరుకోడానికి 1836లో ఇంగ్లాండులో ఓడనెక్కి దాదాపు నాలుగు నెలల తర్వాత, డిసెంబరులో - మద్రాసు తీరంలో దిగింది. మద్రాసులో కొన్నాళ్లు, రాజమండ్రిలో చాలాకాలం, కొన్నిరోజులు చిత్తూరులో గడిపి, 1840 జనవరిలో తిరిగి స్వదేశం వెళ్లిపోయింది. 'చుట్టపుచూపు'గా ఈ దేశం వచ్చి, ఇక్కడ గడిపిన మూడు సంవత్సరాలలో ఆమె చాలా విషయాలు గ్రహించింది. ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, మంచిచెడులు, అలవాట్లు, మర్యాదలు, నమ్మకాలు, పిల్లల చదువు సాములు, సామాన్యుల జీవన విధానాలు, సామాజిక కట్టుబాట్లు, స్త్రీల పరిస్థితులు - ఇలా ప్రతి అంశాన్ని నిశిత దృక్పథంతోనే కాక, సానుభూతితో కూడా ఆమె పరిశీలించింది. మౌనంగా పరిశీలించడంతోపాటు, ఎప్పటికప్పుడు తన అనుభవాలను, అనుభూతులను ఇంగ్లండులోని తన సన్నిహితులకు ఉత్తరాలు రాసి తెలియజేసేది. అలా ఆమె 27 ఉత్తరాలు రాసింది. ఎవరికి రాసిందీ తెలియదు ; ఎక్కడికి రాసిందీ తెలియదు. తన ఊరూ పేరే కాదు, తాను రాస్తున్న ఊరూపేరూ కూడా రహస్యంగానే ఉంచింది. జాబుల్లో వచ్చే ఏ పేరూ నిజం కాదు. మొత్తం జాబుల్లో మొదటి నాలుగూ సముద్రయానం చేస్తూ రాసినవి. తర్వాత ఐదు లేఖలు మద్రాసు నుంచి, తక్కినవి రాజమండ్రి, ఆ పరిసరాల నుంచి, చివరి రెండు మూడు చిత్తూరు, బెంగుళూరు నుంచి రాసినవి.

మొదటి నాలుగు ఉత్తరాల్లో తన సముద్ర ప్రయాణం అనుభవాలు, అక్కడక్కడా తాను చూసిన ప్రదేశాలు, అక్కడి వింతలు, ప్రజల


జీవన సరళి గురించి ఆమె ముచ్చటిస్తుంది. ప్రయాణం మొదలయ్యే నాటికి ఆమె గర్భిణి. ఆరోగ్యం ఏమంత బాగులేదు. కాస్త కుదుట పడగానే మొదలు పెట్టి, 25వ తేది మెడెయిరాలో పూర్తి చేస్తుంది. అందులో తన దినచర్యను వివరిస్తూ – "రాత్రి తొమ్మిదికే పడక; తెల్లారి ఐదయ్యేసరికి కోళ్ళు, కుక్కలు, పిల్లలు, పందుల బృందగానం తో మేలుకొలుపు. దానితోపాటు పసిపిల్లల ఏడుపులు, తల్లుల సముదాయింపులు...మరికాసేపటికి నౌకర్లు కీచులాడుకోడాలు. "ఇవన్నీ చూసి నవ్వే ఓపిక కూడా లేదు నాకు..." అంటుంది.

ఆమె సోదరుడు 'ఫ్రాంక్' మెడెయిరా దాకా తోడొచ్చాడు. ఫ్రాంక్ సరదామనిషి. ఓడలో అందరితో స్నేహంగా వుండేవాడు. ఓడ మెడెయిరా తీరంలో ఆగగానే అందరూ తీరం చేరుకొంటారు. మెడిరా అందమైన ప్రదేశం ఇటలీలో వుంటుంది. అక్కడ ఒక 'కన్యాగురుకులవా'సాన్ని (monastary) సందర్శిస్తారు. అందులోన సన్యాసినులు ఇనుప చువ్వల్లోంచి నవ్వుతూ మాట్లాడి పూలు అమ్ముతారు. వాళ్లకి పోర్చుగీసు తప్ప మరే భాషా రాదు. వాళ్లు చెప్పేది వీళ్లకు అర్థమైనా, వీళ్ల మాటలు వాళ్లకు అర్థంకావు. అందుచేత ఆ యినుప చువ్వలకు అటూ యిటూ ఊర్కే తలలూపుతూ, స్నేహంగా ఒకర్నొకరు చూస్తూ వుండిపోతారు. ఆమె సోదరుడు ఫ్రాంక్ మెడెయిరా నుంచి తిరుగు ప్రయాణం కట్టాడు. ఓడ ఆ రాత్రే బయలు దేరుతుంది.

రెండోలేఖ : ఇకపై రోజూ ఒక ఓడ ఎదురవుతుంది గనక, జాబులు పంపడానికి అనుకూలంగా ఉంటుందని కెప్టెన్ తెలియజేయడంతో అందరూ తమ ఇళ్లకు ఉత్తరాలు రాయడం మొదలు పెట్టారు. ఆమె కూడా అక్కడి వాతావరణాన్ని వర్ణిస్తూ "మేమిప్పుడు ఉష్ణమండలంలో ప్రవేశించాం. చల్లనిగాలి వీస్తున్నది. వాతావరణం బాగుంది. ప్రయాణం బాగా సాగుతున్నది. రోజుకి సరాసరి 150 మైళ్లు వెళ్తున్నాం" అని రాస్తుంది. మెడెయిరాలో వున్నపుడు తాను చాలా బొమ్మలు గీసిందికానీ వాటిని పూర్తి చేయలేదు. పూర్తి చేద్దామంటే ఓపికలేదు. రెండు మూడు తమిళ పదాలు నేర్చుకొంది. సాధారణంగా ఓడల్లో స్త్రీలకు పనులుండవు. కబుర్లతో కాలక్షేపం చేస్తుంటారు. ఎండ తీవ్రంగా వున్నా, ఆమె క్యాబిన్‌లో మాత్రం చల్లగానే వుంది. సెప్టెంబరు 8వ తేదీ రాత్రి న్యూసౌత్ వేల్సు నుంచి వెడుతున్న వేవ్ (wave) అనే ఓడను దాటారు. అందులో వలసపోతున్న జనం ఉన్నారు. 23వ తేది తెల్లవారి మెడగాస్కర్ నుంచి రియో వెడుతున్న ఫ్రెంచ్ ఓడ ఎదురయింది. ఓడ వెన్నెల్లో చాలా దూరంగా వుందికానీ తీరా విచారిస్తే అది రహస్యంగా బానిసల్ని చేరవేస్తున్న దొంగ ఓడ అని తేలింది.

మూడో లేఖ : తేదీ లేదు. తన తమ్ముడికి రాస్తుంది. ఉత్తరం అంతా ఓడ భూమధ్యరేఖ దాటేప్పుడు 'క్రాసింగ్ ద లైన్' అనే ఉత్సవం జరుపుకోడం, నెప్ట్యూన్ వగైరా వేషాలు వేయడం, గెడ్డాలు గీసుకోవడం వంటి సరదాలు, సంబరాలను గురించి రాస్తుంది.

(తరువాయి వచ్చే సంచికలో...)



సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

అతి సుకుమారం.....!!

ఒక కార్పొరేటు బస్సు పిల్లల్ని బడికి తీసుకువెళుతుంటే నగరం నడిరోడ్డులో సాంకేతిక లోపంతో ఆగిపోతే వాహకులు ఆ బస్సును పిల్లల చేత కొంత దూరం దాకా నూకించారని, అలా చెయడం పిల్లలతో చాకిరీ చేయించడమే అని ఎవరో పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేయించారట!! ఈ మధ్య ఫోటోతోసహా వార్తగా వచ్చింది. అది చదివి నాకు అసహ్యము ఆశ్చర్యమూ కలిగాయి.

ఎందుకంటే అరశతాబ్దానికి ముందు నేను చదివే తరగతి ప్రాథమిక పాఠశాల పుస్తకాల్లో చివరి పేజీల్లో కొన్ని సామెతలు ఇచ్చే వారు. వాటిలో "అతి సుకుమారం కటిక దరిద్రం" అన్నదీ ఒకటి. నా చిన్న బుర్రకు అప్పుడు అర్థం కాకపోయినా "శారీరక శ్రమ చెయ్యకుండా సోమరిగా కూర్చొని పరుల కష్టాన్ని దోచుకు తినడం మంచి పద్ధతి కాదు" అని కొన్నేళ్లకు అర్థం చేసుకొన్నాను.

అయితే ఇప్పుడు ఆ సామెత నేటి విద్యార్థులకు చక్కగా సరిపోతుంది.

ఎందుకంటే అప్పుడు బడి 7.30 లేక 8 గం.కు మొదలై పది గంటలకు ఉదయం పూట ముగిసేది. విద్యార్థులయిన మేము పాలు ఇచ్చే పశువులను మేపడానికి తోలుకుపోయి రెండు గంటలకు మధ్యాన్నంపూట బడి సమయానికి వాపసు వచ్చేవాళ్ళం. మరలా నాలుగ్గంటలకు వదిలాక వారివారి అవసరాలను బట్టి చంటి పిల్లలను ఎత్తుకు పోయి ఆడించడమో, వంటచెరకు కోసం వెళ్లడమో, గడ్డి కోసమో, పశువులపాకలో పేడతీయడమో, బావులనుంచి నీరు తేవడమో, కులవృత్తులకు సంబంధించి పెద్దలకు చిన్న పనులు చేస్తూ సహకరించడమో ఏదో ఒకపని తప్పనిసరిగా చేసేవాళ్లం. బడిదగ్గర ఖాళీస్థలంలో తోటను పెంచి వంతులవారీగా నీరుపోసి కాపలా కాసే వారం. కొందరు బీద పిల్లలయితే శనీ, ఆదివారము...ఇతర శెలవు దినాల్లో వ్యవసాయ పనుల కాలంలో కూలి పనులకు కూడా వెళ్లేవారు.

పై చదువులకు ఎక్కువమంది వెళ్ల లేకపోయినా, ఇప్పటిలాగా నూటికి తొంభైతొమ్మిది మార్కులు తేలేక పోయినా మధ్యలో బడి మాని వేసినా, అందుబాటులో ఉన్న ఏదో ఒకపని చేస్తూ (చిన్నప్పటి నుంచి పని చేస్తూ పనిని గౌరవించడం తెలుసుకాబట్టి) బతుకు సాగించాము.

మా చదువులు మేమే చదివి, హోం వర్కుగూడా మేమే చేసుకొని, మా పుస్తకాలకు అట్టల్ని, అవి చినిగిపోతే వేపా, జాలి (తుమ్మ) చెట్లను వెదికి బంక తెచ్చి అతికిచ్చుకొనే వాళ్లం.

ఇప్పటి చదువుల్ని గమనించండి పుట్టిన పిల్లలు అలా తప్పటడుగులు వేస్తూ నడవడము, పెద్దల్ని అనుకరించి నాలుగు మాటలు పలకడమూ చేస్తూనే "బేబీ సిట్టింగో" అదేదోలాంటి వాటిలో వదలి పెట్టి మరలా ఇంటికి పిల్చుకువస్తున్నారు. అది ముగిసీ ముగియక ముందే అంగనవాడీ లేక యల్‌కేజీ....బడికి.

అది ఎలాగంటే చిన్న పిల్లలు పూర్తి నిద్ర ముగించక ముందే బలవంతంగా లేపి స్నానం చేయించి అప్పటికే సిద్ధం చేసిన టిఫన్‌ను బతిమాలుతూ సంచికి కూరినట్లు తినిపించి, యూనీఫారమూ బూట్లలో ముస్తాబు చేసి, ఒక చంకలో, మరో చేత్తో పుస్తకాల సంచీ, సద్ది క్యారియరూ...దగ్గరయితే బడిదాకా, దూరమైతే బస్సు స్టాపుదాకా మోస్తూ ఒక వస్తువులాగా అక్కడ అప్పచెప్పడం.

మరలా వదిలే సమయానికి గంట ముందుగానే ఎవరో ఒకరు వెళ్ళి మోసుకొచ్చి తామే బట్టలూ, బూట్లూ మార్చడం. చిరుతిండి వద్దువద్దన్నా వదలకుండా తినిపించి అలాగే తోడు వెళ్ళి ట్యూషను మందలో తోలడం!! చివరికి షాపుకు వెళ్ళి తనకు కావలసిన నోటు పుస్తకాలూ, పెన్నూ, పెన్సిలూ కొనుక్కొనే స్వేచ్ఛకూడా అటు తల్లి దండ్రులు కానీ, ఇటు పాఠశాల యాజమాన్యంకానీ కల్పించడం లేదు.

వారికి ఒక ఆట లేదు. పాటలేదు. ఆట అంటే క్రికెట్టు. పాట అంటే సినిమా పాటలే. ఈ దుస్థితి వల్ల ఎన్ని గ్రామీణ ప్రాచీన క్రీడలు కాలమై పోయిన! ఎన్ని విలువైన జానపదుల స్థానిక గేయాలు కనుమరుగై పోయిన ఎవ్వరికీ పట్టదు.

ఇలా చేయడాన్ని చాలామంది పిల్లల మీద అమితమైన ప్రేమ, గారాబము అని అనవచ్చు కానీ, నేను దీన్నే అతి సుకుమారం కటిక దరిద్రం అని అంటాను.


ఎందుకంటే వీరు అనుకోని పరిస్థితులలో తమ బూట్లను తాము ఏకాలికి ఏదో తెలుసుకొని తొడుక్కో లేరు. ఏదినం ఏ పుస్తకాలు తీసుకొని పోవాల్నో, ఎప్పుడు ఏ పరీక్షలు ఉంటాయో, పుస్తకాలకు అట్టలు ఎలా వేసుకోవాలో తెలియక సకలాంగ వికలాంగులుగా తయారవుతున్నారు.

వీరు చదివే చదువులకు తగిన ఉద్యోగాలు దొరుకుతాయని ఏకోశానా నమ్మకాలు లేవు. ఎందుకంటే కాలానుగుణంగా అన్ని రంగాల లోనూ ర్పులు వస్తుంటాయి. ఇప్పుడున్న అవకాశాలను బట్టి మాత్రమే వేలం వెర్రిగా ఒకే చదువులు అందరూ చదివితే దానిలో దారులు మూసుకొనిపోతే వీరు ఎలా బతకాలి?? కాబట్టి అన్ని రకాల పనులనూ(ఇంటి పనులతో సహా) గౌరవించడం, వారి పనులు వారే చేసుకొనడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అవకాశం ఇవ్వాలి.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు,
ప్రముఖ రచయిత

ధారావాహిక

జోగిని మంజమ్మ ఆత్మకథ ⑥



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289

(గత సంచిక తరువాయి...)

అభిమానుల చప్పట్లే నాకు పురస్కారాన్ని తెచ్చిపెట్టింది.

ఆ రోజు 'జోగిని నృత్యం' నేర్చుకునేటప్పుడు నాకు ఇది ఒక 'కళ' అని తెలియదు. అప్పట్లో చిన్నపిల్లవాడిని. అందులోనూ ముత్తెం కట్టించుకున్న, జడలు వచ్చిన పిల్లవాడు నృత్యం చేస్తున్నాడు. అంత చిన్నపిల్లవాడే నృత్యం చేస్తున్నప్పుడు నేనెందుకు నేర్చుకోకూడదని నేర్చుకున్నాను.

'కళ' అని నేర్చుకోకుండా బతుకుతెరువు కోసం నేర్చుకున్నాను.

ఇది 'కళ' అని తెలిసింది చాలా ఆలస్యంగా, అంటే 1989లో.

హరపనహళ్ళిలోని కుసుమ చిత్రమందిరం దగ్గరున్న వీధిలో కాళవ్వ జోగమ్మతో కలిసి నృత్యం చేస్తున్నాను. అక్కడ డ్యూటీలో ఉన్న పి.ఎస్.ఐ. గారు మా దగ్గరికి వచ్చారు. నాకు భయం వేసింది. నృత్యం చేయడం ఆపాను. కాళవ్వ నృత్యం చేయమని తన పాటకొనసాగించింది. ఆయన మా దగ్గరికి రావటం గమనిస్తూనే భయంతో నృత్యం చేస్తున్నాను.

మా దగ్గరికి వచ్చి, "మీరు వేదిక మీద కార్యక్రమం చేస్తారా? మేము అందుకు ఏర్పాట్లు చేస్తాం" అని అన్నారు.

కాళవ్వ వెంటనే అంగీకరించింది.

దాంతో నాలో మరింత భయం మొదలైంది.

నాకెందుకో పోలీసులంటే చిన్నపిల్లవాడిగా ఉన్నప్పటి నుంచీ భయం.

దాంతో ఏ పోలీసును చూసినా అమ్మ కొంగులో దాక్కునే వాడిని.

ఇరవై రెండేళ్ళు వచ్చినా ఆ భయం పోలేదు.

కాళవ్వ ప్రదర్శన ఇవ్వడానికి ఒప్పుకుంది.

అప్పుడు నేను కాళవ్వ దగ్గరికి పోయి భయం తోటే, "వేదిక అంటే ఏమిటి? మనం ఎక్కడ కార్యక్రమం ఇవ్వాలి?" అని అడిగాను.

"అదే స్టేజ్ అంటారు కదా, వీళ్ళు వేదిక అంటారు" అంది.

అప్పట్లో నాకు స్టేజ్ అన్నది తెలుసు. దాన్నే వేదిక అంటారని తెలియదు.

ఆరోజు సాయంత్రం వేదిక దగ్గరికి వెళ్ళాం.

వేదిక చుట్టూ పోలీసులు ఉన్నారు.

నేను మళ్ళీ భయపడ్డాను.

కార్యక్రమం ఇవ్వలేనని కాళవ్వకు చెప్పాను.

ఆమె నాకు ధైర్యం చెప్పింది. నాలో ధైర్యం నింపింది. అయినా లోలోపల భయం. ఆ భయంతోటే చక్కగా నృత్యం చేశాను. ఆ పోలీసులు, అక్కడ గుమిగూడిన జనం చప్పట్లు కొట్టారు. కార్యక్రమం ముగిసిన తరువాత పోలీసులు వచ్చి నన్ను పలకరించారు. నా నృత్యాన్ని అభినందించారు. ఆ రోజు అదొక 'కళ' అని తెలిసింది. ఆ 'కళ'కు గౌరవం ఉందని తెలిసింది. ఈ కళను ప్రదర్శించేవాళ్ళకు గౌరవం ఉందని తెలిసింది.

అయితే ఈ కళకు దైవిక శక్తి ఉందన్నది నేనేనాడూ మరవలేదు.

అందువల్ల ఈ కళను కేవలం కళగా చూడలేదు.

దైవంగా ఆరాధిస్తూ వచ్చాను.

ఈ కళాక్షేత్రానికి వచ్చేవాళ్ళు కూడా కళను దైవమని తెలుసుకోవాలని కోరుకుంటున్నాను.



ఈనాడు సరదాగా నేర్చుకుంటున్న యువకులలో ఈ భావన కనిపించటం లేదు. వాళ్ళల్లో నా భావనను కానీ, మగజోగమ్మల భావ నలు కానీ వెదకడం ఎంత వరకు సమంజసమో నాకు తెలియదు. అయితే వారి కొన్నివిషయాలు, ప్రవర్తనలు నన్ను నొప్పించాయి.

ఉదాహరణకు సుంకన్నగారు ఒక వీధినాటక బృందాన్ని ఏర్పరిచారు. అతను ఈ కళను నేర్చుకుని ప్రదర్శిస్తున్నారు. అతనికి నేనే ఈ కళను నేర్పించాను. ఈ నృత్యం కోసం కొన్ని వాయిద్యాలను ఉపయోగిస్తారు. వారి కార్యక్రమంలో హార్మోనియం, తబల, తప్పెట, చౌడకెలను ఉపయోగిస్తారు. చౌడికెను క్రమబద్ధంగా వాయించే జోగప్పను తమ బృందంలో పెట్టుకున్నారు. వారి ప్రదర్శన ఆడంబ రంగా, విచిత్రంగా ఉంటుంది. వేదిక మీదికి వచ్చేటప్పుడు ఉధో... ఉధో...అని కేకలు వేస్తారు. ఒళ్ళంతా భండారాన్ని చల్లుకుంటారు.

మాకూ, వాళ్ళకు వ్యత్యాసాలు మొదలయ్యేవి ఇక్కడే.

'ముత్తెం' కట్టించుకున్న మేము భండారాన్ని బంగారంగా భావిస్తాం. ఒక్కింత కూడా నేల మీద పడకుండా చూసుకుంటాం. దేవతకు అర్పించేటప్పుడు సవదత్తిలో నేలపై భండారం పడుతున్నది ఆచరణ సందర్భంలో మాత్రమే. అప్పుడు చల్లటంలో ఒక అర్థముంది. నృత్యం చేసేటప్పుడు భండారం, వేపకొమ్మలను, వేపాకులను విసరుతూ వాటిని తొక్కుతారు. 'కళ'ను దైవమని, 'కళ'ను కేవలం 'కళ'గా భావిస్తున్న మాకు వాళ్ళకు మధ్య తేడా ఇదే !

అయినా అవకాశాల విషయానికి వస్తే మా కన్నా ఎక్కువ అవకాశాలు వాళ్ళకే దొరికాయి. ఇక ముందు కూడా దొరుకుతాయనే విషయం మాకు తెలుసు.

వాళ్ళు ఢిల్లీ, మహారాష్ట్ర మొదలైన ప్రాంతాలకు వెళ్ళి ప్రదర్శనలు ఇచ్చి వచ్చారు. అయితే కళ కోసం జీవితాన్నే ఫణంగా పెట్టి అనేక కష్టాలు అనుభవించి, తరాల నుంచి తరాల వరకూ కాపాడుకుంటూ వచ్చి 'కళనే జీవితం' అనుకున్న మాకు సంవత్సరం నుంచి ఒక్క కార్యక్రమం లేదు. వాళ్ళేమో పెద్దపెద్ద వేదికలపై కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు.

నేను అసూయతో ఈ మాట చెప్పడం లేదు. కళకోసమే జీవితాన్ని ముడుపుగా పెట్టిన మాలాంటివారికి కూడా అవకాశాలు కల్పించాలని అడుగుతున్నాను.

ఈ వ్యక్తులు ఈ విధంగా చేయటం చూస్తే ఒకవైపు బాధ కలిగితే, మరొకవైపు సంతోషమూ కలుగుతోంది. ఎందుకంటే నా సముదాయపు ఈ కళను ఎవరూ ఇష్టపడటం లేదు. ఈ రోజు ఈ కళను నమ్ముకుని జీవితం సాగించడం కష్టం. ఈ కళను నేర్చుకుం దురు రండి అని ఎవర్నయినా పిలిస్తే నన్ను ఉదాహరణగా చూపించి, నువ్వు నాటకాలు, నృత్యం చేసి పురస్కారాలు పొందావు. అది సరే, ఇప్పటిదాకా ఏం సంపాదించావు?" అని అడుగుతారు. వాళ్ళు అలా అడగటం నిజమే. అయితే నేను డబ్బు సంపాదించలేదు. కానీ ప్రజాభిమానాన్ని సంపాదించాను. నేను ఎక్కడికైనా వెళితే 'మంజమ్మ నమస్కారం, రా కూర్చో' అంటారు. ఆ ప్రేమ కన్నా గొప్పది కావాలా? నేను ఇప్పుడు నృత్యం చేస్తున్నప్పుడు నా నృత్యంలోని భంగిమలను చూసి జనం చప్పట్లు కొడతారు. అదే నాకు కోటి రూపాయలతో సమానం.

ఈ చప్పట్లే ఈ రోజు నాకు అనేక పురస్కారాలను తెచ్చిపెట్టింది.

నేను సంపాదించిన డబ్బు ఈ పురస్కారాలను తెచ్చిపెట్టలేదు.

నాకే కాదు ఎవరికీ డబ్బు పురస్కారాలను తెచ్చిపెట్టదు.

అయినా నా సముదాయం ఈ కళవైపు రావడానికి సంకోచిస్తోంది. అలాంటి పరిస్థితిలో పదిపైసల వరకైనా ఆ యువకులు కాపాడుతున్నారని సంతోషం కలుగుతోంది. అలాగైనా ఈ కళ ఇంకా నిలబడివుందికదా అనే స్వార్థం నాది. అయితే ఆడంబరంగా మారిన 'కళ'కు దీర్ఘకాలం భవిష్యత్తు ఉండదనే భయం నన్ను వేధిస్తోంది.

భిక్షాటనకు వెళ్ళటం మానేశాను

నేను ఇప్పుడు ఈ కళను ప్రదర్శించడం తప్ప వేరే ఏదీ చేయడం లేదు.

గతంలో భిక్షాటనకు వెళ్ళేదాన్ని.

ఇప్పుడు భిక్షాటనకు వెళ్ళడం లేదు.

కళకు అవకాశాలు తక్కువ.

ఎప్పుడైతే 'కర్నాటక ప్రభుత్వం మరియు యక్షగాన నాటక అకాడెమీ' పురస్కారం లభించిందో అప్పుడు నాకు పరిచయం అయిన కుర్రవాళ్ళు 'నువ్వు పేరు సంపాదించుకున్న కళాకారిణివి. నువ్వు ఇలా రోడ్లమీద, సంతలలో భిక్షానికి నిలబడటం బాగుండదు. నీకు ఒక పేరు ఉంది. భిక్షం ఎత్తడం మానెయ్. మేము మాకు చేతనైనంత సహాయం చేస్తామని చెప్పారు.



అంతేకాకుండా నాకూ వయసు దాటింది.

భిక్షం అడగటం మానేశాను.

జీవనం కోసం కార్యక్రమాలను నమ్ముకున్నాను.

నిజం చెప్పాలంటే నాతోపాటు ఉన్న వృద్ధకళాకారులు, నా అక్కాచెల్లెళ్ళు, నా పిల్లలు భిక్షాటనకు వెళుతున్నారు. హొసపేట, హగరి బొమ్మనహళ్ళి, కూడ్లిగి, సందూరు తాలూకాలోని పల్లెల్లో చౌడికి, శ్రుతిపెట్టె, పడ్లీగి తీసుకునిపోయి ఇంటింటికి, అంగళ్ళకు తిరిగి భిక్షం అడుగుతారు. భిక్షాటనకోసమే సంతలను వెదుక్కుంటూ పోతారు. కలెక్షన్ చేసుకుని నాదగ్గరికి వచ్చి వంద, రెండు వందలు ఇస్తారు. భిక్షాటనలో వచ్చి కాయగూరలూ, కొన్ని గింజలూ ఇస్తారు. రేషన్ కార్డు ఉంది. అక్కడ బియ్యం దొరుకుతుంది.

ఇలా జీవితం సరళంగా సాగిపోతోంది. ఆడంబరంగా ఏమీ లేదు. నేను పట్టుచీర కొన్నాను. నేను రుచికరంగా వండుకుని తిన్నానని చెప్పలేను. అన్నం, చారు, ముద్ద, చట్నీకి లోటు లేదు. నేను అవసరాలకు మించి డబ్బు దాచుకోలేదు. నాతోపాటు ఉన్నవాళ్ళల్లో కొందరు బంగారం, వెండి కొన్నారు. నేను అవేవీ కొనలేదు. నేను ఏదైనా సంపాదించి వుంటే అది ప్రజాభిమానాన్ని. ప్రజల స్వచ్ఛమైన ప్రేమను. గౌరవనీయులైన కులపతుల పక్కనే కూర్చునే అవకాశం సంపాదించుకున్నాను. ఇంతకన్నా గొప్ప ఆస్తి మరొకటి లేదని అనుకుంటున్నాను.

అభిమానులారా, కళాసక్తులే దేవుళ్ళు అనే మాటను విన్నాను. అది వాస్తవం.

ఈ కళాభిమానులు మా కళను మెచ్చుకున్నందుకు ఎన్నో అవకాశాలు దొరికాయి.

గౌరవాలు, సన్మానాలు, పురస్కారాలు దొరికాయనే సత్యం నాకు తెలుసు.

అమ్మ గుండెలు బాదుకుని భోరుమని ఏడుస్తోంది

ఈ కళ నా జీవితంలో అనేక దుఃఖాలను, సంతోషాలను ఇచ్చింది.

వాటిల్లో దుఃఖమే ఎక్కువ.

అలాంటి విషాదకరమైన సంఘటనల్లో ఒకటి రెండు మీకు చెప్పాల్సిందే !

నేను కాళవ్వతోపాటు హరపనహళ్ళిలో నాటకాలు వేస్తుండేదాన్ని. వారానికి కనీసం నాలుగైదు ప్రదర్శనలు ఇస్తూ దాదాపు ఆరు నెలలు అక్కడ నాటక ప్రదర్శన ఇచ్చాం. ఆ ఊళ్ళో నాకు పరిచయం ఉన్న వాళ్ళంతా నన్ను 'పరశురాముడు' అని కాళవ్వను 'యల్లమ్మ' అని పిలిచేవారు. ఈ పాత్రల్లో గురుశిష్యులమైన మేము ఆ విధంగా పేరు సంపాదించుకున్నాం. ఆ సంతోషంతో కాళవ్వ "ఒకసారి మీ తల్లితండ్రులను పిలిపించు. వాళ్ళు కూడా నాటకం చూడనీ. నీ నటనను చూసి సంతోషపడనీ" అని అంది.

దావణగెరెకి హరపనహళ్ళి దగ్గరగా ఉన్న కారణంగా అమ్మను పిలిచాను.

అమ్మ వచ్చింది.

ఆ రోజు అమ్మకు జోగమ్మల బృందం చేత సన్మానం జరిగింది.

చాలా సంతోషంతో సన్మానాన్ని స్వీకరించింది.

నాటకం చూడాలని అమ్మ ముందు వరుసలోని కుర్చీలో కూర్చుంది. ఆ రోజు కూడా పరుశురాముడి పాత్రను నటించాను. అమ్మ నా కళాభివ్యక్తిని చూస్తోందని అనుకున్నాను. ఆ సంతోషంతో ఉన్నాను. ప్రతి రోజుకన్నా చాలా బాగా నటించాను. పాత్ర కోసం పెట్టుకున్న మీసాలు, గడ్డం, పాత్రలో కనిపించే పౌరుషం, ఆ వేషాన్ని చూసి నా తల్లి గుండెలు బాదుకుని బాదుకుని ఏడ్చింది.

ఆ యల్లమ్మ దేవితో, "నా కొడుకును నీ కోసమే కన్నానా? నా నుంచి ఇలాంటి కొడుకుని లాక్కోవటానికి నీకు ఎలా మనస్సు ఒప్పింది? నువ్వు దయలేనిదానివి. నువ్వు నా కొడుకును లాక్కోకుండా ఉంటే ఇప్పుడు నాటకంలో పరుశురాముడిలా విజృంభిస్తున్నాడు కదా, అలా ఉండేవాడు" అంటూ భోరుభోరున ఏడుస్తోంది. గుండెలు బాదుకుంటోంది. జనమంతా నన్ను చూడటం కన్న ఎక్కువగా అమ్మనే చూస్తున్నారు. పాపం తల్లిపేగు బాధపడుతోందని జాలి చూపించారు. అమ్మ సంకటం చూసి నాకూ దుఃఖం కలిగింది. అయితే ఆ సంకటాన్ని లేకుండా చేసే శక్తి నాకు లేదు. ఇప్పటికీ లేదు. ఆ సత్యాన్ని గ్రహించి నాటకంలో మునిగిపోయాను.

మరొక విషయం చెప్పాలి. ఎందుకంటే మమ్మల్ని ఇంటివాళ్ళు ఎలా చూస్తారు అనటానికి ఈ సంఘటన పెద్ద ఉదాహరణ.

మా అన్న కోసం పిల్లను చూడటానికి ఇంటివాళ్ళందరూ వెళ్ళారు. ఆ అమ్మాయి ఇంటివాళ్ళు మా అన్నదమ్ములు ఏం చేస్తారని



సహజంగానే విచారించారు. నాతమ్ముడొకడు జోగమ్మగా మారాడనే సత్యాన్ని వాళ్ళకు చెప్పివుండొచ్చు. అలా చెప్పడం అంత సులభం కాదని నాకూ తెలుసు. వాళ్ళు సహోదరుడి ప్రేమకోసం వాస్తవాన్ని వివరించి చెప్పే అవకాశం ఉండింది. దాన్ని వాళ్ళ దగ్గర దాచి వచ్చాడు.

నేనప్పుడు చిలకనహట్టిలో ఉన్నాను.

అక్కడికి వచ్చిన అతను, "నేను పెళ్ళి చేసుకుంటున్న అమ్మాయి ఇంట్లో నువ్వు జోగమ్మ అయిన విషయాన్ని చెప్పలేదు. నువ్వు పెళ్ళికి వస్తావా? ఏం చేయాలనుకుంటున్నావో ఆలోచించుకో" అన్నాడు.

"ఈ మాటల అర్థం ఏమిటంటే నువ్వు జోగమ్మవి కావటం వల్ల వాళ్ళకు చెప్పలేదు. దయచేసి నువ్వు నా పెళ్ళికి రావదద్దన్నట్టుకదా?" అని అన్నాను.

అప్పుడతను, "అవును, మన వైశ్య సమాజంలో తమ్ముడు జోగమ్మ అయ్యాడంటే ఎవరూ కన్యను ఇవ్వరు. అందుకే అలా చెప్పాను. నువ్వు రావద్దు" అని సూటిగా చెప్పి పోయాడు.

ఆరోజు నాకు కలిగిన దుఃఖం అంతా ఇంతా కాదు. ఈ జీవి తమే వద్దని అనిపించింది. ఇంట్లో జరిగే శుభకార్యాల్లో పాల్గొనటానికి నిరాకరించారుకదా అని బాధ కలిగింది. జనం మమ్మల్ని 'మంగళ ముఖి'లంటారు. కొన్ని సందర్భాలలో శుభ సంకేతంగా భావించి మమ్మల్ని పూజిస్తారు. కుటుంబం విషయానికి వచ్చినపుడు మమ్మల్ని నిరాకరిస్తారు. ఇంటివాళ్ళే మమ్మల్ని అశుభులుగా చూస్తారు. అలాంటి బాధాకరమైన సంఘటనలు జీవితాన్ని దృఢపరిచాయి.

అప్పట్లో ఇంటివాళ్ళు, జనం నన్ను వేధించారు.

కొన్ని సంవత్సరాల తరువాత ప్రతిభావంతురాలైన కళాకారిణిగా నా గురించి పత్రికలలో ప్రకటింపబడి. పురస్కారాల మీద పురస్కారాలు వచ్చాయి. 'బదుకు జటకాబండి' కార్యక్రమం వచ్చింది.

ఇది చూసిన తరువాత నా అన్న, బంధువులు అందరూ ఫోన్లు చేశారు.

ఇంటికి రమ్మని పిలిచారు.

అయితే నేను వెళ్ళలేదు.

వెళ్ళకూడదని నిర్ణయించుకున్నాను.

ఎందుకంటే ఆరోజు నేను కనిపిస్తే ముఖం తిప్పుకుని వెళ్ళేవాళ్ళు. పండుగ-పబ్బాలకు పిలిచేవాళ్ళు కాదు. దేనికీ నన్ను చేర్చుకోని కుటుంబం ఈ రోజు నాకు కొత్తగా కీర్తిప్రతిష్ఠలు వచ్చాయని రమ్మని పిలుస్తున్నారు. ఆ కుటుంబానికి ఆ రోజు వద్దనుకున్నదాన్ని ఈ రోజు కావాల్సి వచ్చాను. ఆ రోజు అవమానం తెచ్చినదాన్ని, ఈ రోజు గౌరవం తెచ్చేదాన్నయ్యాను. అంటే కుటుంబంలో ఇలాంటి అభిప్రాయం కలగడానికి కారణమైంది ఈ జోగిని సముదాయం. అయితే ఈ సముదాయం ఆనాటి కాలంలో నన్ను ఆదుకుంది. నా చేయి పట్టుకుని నడిపించింది. నాకు ఆసరా ఇచ్చింది. నన్ను సాకింది.

ఈ సముదాయాన్ని నేను ఎన్నడూ వదలిపోకూడదని నిర్ణయించుకున్నాను.

ఆ నిర్ణయం ప్రకారమే నేనెక్కడికీ వెళ్ళలేదు !

గురువునే కొట్టి సంకటం అనుభవించాను !

కాళవ్వ నా 'జోగిని నృత్యకళ'కు రెండవ గురువు. మొదటి గురువు బసప్ప. అతనితో మహా అంటే ఆరేడు నెలలు గడిపి ఉండొచ్చు. కాళవ్వ జోగినితో సగం జీవితం గడిపాను. కష్టసుఖాలను పంచుకున్నాను. ఆమె కష్టసుఖాల్లో భాగస్తురాలినయ్యాను. ఆమె కూడా అంతే.

అందువల్ల ఆమె నాకు కేవలం గురువు మాత్రమే కాదు. తల్లి కూడా అయ్యింది. ఆమెతో నాకు అభిప్రాయ భేదాలు రావటం చాలా తక్కువ. అకస్మాత్తుగా అలాంటి సందర్భం వస్తే, నేనే సర్దుకుపోయేదాన్ని. ఎందుకంటే ఆమె నన్ను చాలా అభిమానించేది. నువ్వు కళాకారిణిగా ఎదుగుతావని చెప్పి నటనలోని మెలుకువలను, తన గురువు తనకు నేర్పించిన కథలను నేర్పించేది. నా మీద అంతటి నమ్మకాన్ని పెట్టుకున్న గురువును నేను ఒకసారి కొట్టేశాను !

ఒకసారి నాటక ప్రదర్శన ఇవ్వడానికి బళ్ళారిజిల్లా కుడుతిని గ్రామానికి వెళ్ళాను.

ఆ రోజు ఎందుకో ఆమె నాతో అసభ్యంగా ప్రవర్తించింది.

అశ్లీలమైన పదాలు వాడింది.

నా మెడలో ఉన్న తాళిని తెంచి పడేసింది.

అప్పుడు నాకు భరింపరాని కోపం వచ్చింది.

ఆ కోపంతో ఆమె చెంప మీద కొట్టాను.


ఆమె నివ్వెరపోయింది.

అక్కడ ఉన్న వాళ్ళందరూ తెల్లబోయి చూస్తుండిపోయారు.

కాళవ్వ నన్ను ఏమీ అనలేదు.

అక్కడున్న జోగమ్మలు మౌనంగా ఉండిపోయారు.

నాకూ ఏమీ తోచక భయంతో మౌనం వహించాను.



మంజమ్మ గురువు కాలవ్వజోగిని

మా ప్రాంతంలో ఆనాటి కాలంలో కాళవ్వ జోగమ్మకు గొప్ప పేరుప్రఖ్యాతులు ఉండేవి. ఎక్కడకు పోయినా ఆమెను ఎంతగానో గౌరవించేవారు. చుట్టుపక్కలున్న రంగస్థల కళాకారులు కూడా ఆమె పట్ల, ఆమె కళపట్ల మెప్పుదలను వ్యక్తపరిచేవాళ్ళు. పల్లెపల్లెల్లో ఆమెకు పెద్దపెద్ద అభిమాన గుంపులు ఉండేవి. అప్పటి కళాకారులు ఆమె బృందంలో పని చేయడమే ఒక గౌరవంగా భావించేవారు.ఇదంతా నాకు తెలిసినప్పటికీ ఒళ్ళు తెలియని కోపంతో నాకు తెలియకుండా కొట్టాను.

ఆ సంఘటన జరిగిన కొద్దిసేపటి తరువాత తన బట్టలు, వస్తువులు, సర్దుకుని, "నాటకం వద్దు, ఏమీ వద్దు" అంటూ కాళవ్వ అక్కడి నుంచి బయలుదేరింది.

కాళవ్వ వెళ్ళిపోతోందన్న వార్త ఊరి జనానికి తెలిసింది.

అప్పుడు ఊరి జనం కాళవ్వను ఆపి, "మీలో మీరు గొడవ పడ్డారు. మా ఊరివాళ్ళు మీతో గొడవపడలేదు. అందువల్ల ఊరి ప్రజలపట్ల కానీ లేదా ఊరి గురించి కానీ తప్పుగా అనుకునే పరిస్థితే రాదు. మీరు నాటకం ప్రదర్శిస్తామని మాకు మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నాటక ప్రదర్శన ముగించి వెళ్ళిపోండి. ఇందులో మా ఊరి మర్యాద కూడా ముడిపడివుంది. జాతర కోసం అనేక ఊళ్ళ నుంచి జనం వచ్చారు. వారి ముందు మా ఊరిపరువు తీయకండి" అని గట్టిగా చెప్పారు.

ఆ ఊరి ప్రజల అభిప్రాయానికి కాళవ్వ గౌరవమిచ్చి ఆగిపోయింది.

అప్పుడు నాకు ఒకింత సంతృప్తి కలిగినా నా మనస్సులో ఉన్న బాధ, కోపం తగ్గలేదు.

అలాగని ఆ బాధను బయటపెట్టే పరిస్థితిలోనూ నేను లేను.

ఎందుకంటే ఆ రాత్రి నాటకం వేయాలి. కాళవ్వ యల్లమ్మ పాత్ర ధరిస్తే, నేను పరశురాముడి పాత్రను అభినయించేదాన్ని. ఎక్కడ ప్రదర్శించినా మా ఇద్దరి మీదే నాటకం విజయం ఆధారపడేది. ఆమె నాతో మాట్లాడకపోతే నాటకం రక్తికట్టదు. రసవంతంగా సాగదనే వాస్తవమూ తెలుసు. అందువల్ల నాలో నేను సంకటం అనుభవిస్తున్నాను.

మా బృందంలో మౌనం కమ్ముకుంది.

అది గ్రహించిన సోమక్క జోగమ్మ–

"కొద్దిసేపు జాతరలో తిరిగి వద్దాం రండి" అని అందరిని పిలిచింది.

కాళవ్వ ఆమె మాటను కాదనేది కాదు.

ఆమె వెనుక జోగమ్మలందరూ బయలుదేరారు.

నేను కూడా వారి వెంబడి బయలుదేరాను.

వెళ్ళేటప్పుడు దారిలో జ్యూస్ అంగడి కనిపించింది.

అక్కడ జోగమ్మలందరిని నిలిపి, "అమ్మా, జ్యూస్ తాగుదాం రామ్మా" అని నేనే కాళవ్వను పిలిచాను.

ఆమె నవ్వుతూ, ''పదా శెట్టి, కొట్టేటప్పుడు అమ్మ కనిపించలేదు. కొట్టిన ఇంతసేపటికి వరకూ లేని అమ్మ ఇప్పుడు గుర్తొచ్చిందా నీకు?" అని చెప్పి జ్యూస్ తాగి నన్ను ఓదార్చింది.

కాళవ్వలో ఉన్న మంచి గుణం ఏమిటంటే తన తప్పు ఉన్నప్పుడు మెత్తబడేది. లొంగిపోయేది. ఆ రోజు కూడా ఆమె ఓడిపోయింది. ఆమె ఓడిపోయినందుకే నాటకం బాగా వచ్చింది. మా బృందానికి మంచి పేరు వచ్చింది. నాలో ఉన్న భయం మాయమైంది.

అయితే మరుసటి రోజు, "నేను తప్పు చేశాను. అంటే ఇక ముందు నన్ను దేనికీ పిలవకండి. నేను నృత్యం చేయడానికి రాను. నాటకాలు వేయడానికీ రాను. మీ బృందంలో ఉండను" అని చెప్పి బయటికి వచ్చాను.

మనస్సుకు బాధ కలిగినందువల్ల కొద్దిరోజులు తల్లితండ్రుల దగ్గర ఉంటే మనస్సు సర్దుకుంటుందని కల్లుకంబకు వెళ్ళాను. అక్కడే ఇరవై రోజులు గడిచిపోయాయి. నేనూ ఆ వైపు (కాళవ్వ జోగిని దగ్గరికి) వెళ్ళలేదు.

మేము రాణిబెన్నూరులో అయిదేళ్ళు వరుసగా నాటకం వేశాం.

ఆరవ సంవత్సరమూ మమ్మల్ని పిలవటానికి ఆ ఊరివాళ్ళు కాళవ్వ దగ్గరికి వచ్చారట.

అప్పుడు కాళవ్వ, నింగమ్మ అనే జోగమ్మను, "నువ్వు వెళ్ళి మంజమ్మను పిల్చుకుని రా" అని కల్లుకంబకు పంపింది.

నింగమ్మ మా బృందంలో ఉన్న వృద్ధురాలైన జోగమ్మ. కొట్టూరు దగ్గర్లోని గజాపుర గ్రామానికి చెందింది. ఆమె దగ్గర కూడా నేను మీ బృందంలోకి రానని మొండిగా చెప్పాను.

అప్పుడు మా తల్లితండ్రులు, "వెళ్ళు, అంత పెద్దమనిషి ఇంటి వరకూ మనిషిని పంపింది. నువ్వు పోకపోతే ఆమెకు మర్యాద ఇచ్చినట్టు ఉండదు. వెళ్ళి నాటకంలో పాల్గొని రా" అని మందలిస్తూ అన్నారు.

కవిత

మానవ చరిత్ర

కాలం
కలిసి రావటం కాదు
కాలం నీ చేతిలో
కరవాలం కావాలి!
అర్థించడం కాదు
ఆజ్ఞాపించడం నీ హక్కై పోవాలి!
మూఢనమ్మకాల ఊబిలో
కూరుకుపోయి
వాస్తవాలకు గోరీ కట్టేందుకు
నీ మనసును
నీవే వంచించుకోకు!
సత్సంకల్పం
సత్ఫలితమని సంకోచించకు
మానవుడే
ఈ ప్రపంచాన్ని
మహిమాన్వితం చేశాడు
నీ మీద నీకే నమ్మకం లేనపుడు
పూడ్చబడిన శవానివే నీవు?!
కోట్ల సంవత్సరాల మానవ చరిత్రలో
ఎన్నెన్నో మలుపులు తిరిగి...
ఎన్నెన్నో
అనుభవాలు పొందిన మేధస్సుకు
మళ్ళీ సంకెళ్ళు వేసి
చరిత్రను వక్రీకరించకు!
రాతి యుగం నుండి
రాకెట్ యుగం దాకా
ఆలోచనా సంఘర్షణలే
అభివృద్ధికి సోపానాలు!
మానవుడే మహనీయుడు?!?!

– రాపోలు పరమేశ్వరరావు
9951416618

తల్లితండ్రుల మాటకు విలువ ఇచ్చి రాణిబెన్నూరులో నాటకం చేశాం. మనస్సు విరిగిపోయినా నాటకం బాగా జరిగింది. ఊరికి బయలుదేరేటప్పుడు కాళవ్వ 'నువ్వు మా వెంబడి వచ్చెయ్. జరిగిందేదో జరిగి పోయింది" అని పిలిచింది.

అయితే నేను ఆమె వెంబడి వెళ్ళలేదు.

ఆ జాతరలో పరిచయం అయిన హగరిబొమ్మనహళ్ళి తాలూకాకు చెందిన గెద్దెకెరె గ్రామంలోని చంద్రమ్మ, ధనసింగ్ అనే జోగమ్మల దగ్గర చేరాను. ధన్‌సింగ్ జోగమ్మ లమాణి సంప్రదాయానికి చెందిన వాడు. వాళ్ళిద్దరూ కళాకారులు కాదు. బతుకుతెరువు కోసం భిక్షాటన చేస్తున్నారు. లేచీ లేవగానే పల్లెల మీదకు వెళ్ళిపోయే వాళ్ళు. రాత్రి ఏ సమయంలో తిరిగి వచ్చే వాళ్ళో వాళ్ళకే తెలియదు. రోజూ స్నానం, పూజా చేసుకోవాలని అనుకునేవాళ్ళు కాదు. అయితే నేను రోజూ స్నానం, పూజా చేయందే బయటికి వెళ్ళేదాన్నికాదు. అలాంటి సంప్రదాయాన్ని అలవాటు చేసుకున్నాను.

అందువల్ల నాకూ వారికి పొందిక కాలేదు.

భిక్షకు వాళ్ళొక ఊరికి వెళితే నేనొక ఊరికి వెళ్ళేదాన్ని.

చీకటి పడేలోగా ఇల్లు చేరేదాన్ని.

అయితే వాళ్ళు ప్రతిరోజూ ఇంటికి వచ్చేవాళ్ళు కాదు. ఏ గుడిగోపురాల్లోనో, బడులు, సత్రాల్లోనో ఉండిపోయేవాళ్ళు. అంతేకాకుండా వాళ్ళకు తాగుడువంటి అలవాట్లు ఉండేవి. దాంతో నాదగ్గర ఉన్న డబ్బులు లాక్కుని పోయేవాళ్ళు. భిక్షమెత్తుకుని కూడబెట్టిన గింజలుకూడా అమ్ముకుని తిన్నారు. నేను కిరాణా సామాన్లు తీసుకుంటున్న అంగడిలోనూ నా పేరిట అప్పు చేశారు. ఆ కారణంగా రేషన్ తీసుకుని రావటానికి నా చెవిదుద్దులు కుదువపెట్టాల్సి వచ్చింది. ఆ సమయంలో కట్టుకోవడానికి బట్టలు, తినడానికి తిండి లేని పరిస్థితిని అనుభవించాను.

రెండునెలలు ఇంటిఅద్దె కట్టలేదు. వాళ్ళ దగ్గర అద్దె అడిగితే 'మేమేమి ఇక్కడ ఉండటం లేదు. నువ్వే ఉంటున్నావు' అని అన్నారు. ఇంత జరిగినా ఎందుకో వాళ్ళను వదలి ఒంటరిగా జీవితాన్ని ప్రారంభించే స్థితిలో నేను లేను. కాళవ్వ దగ్గరికి తిరిగి వెళ్ళాలని అనిపించలేదు. అప్పుడు గురువుకు చెంప దెబ్బ కొట్టినందుకు ఈ రోజు ఈ స్థితి వచ్చిందనే సత్యం అర్థమైంది.

ఇది నేను పొరబాటుగా అర్థం చేసుకున్నానని వాళ్ళు అనుకున్నా పరవాలేదు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు గురువు, గురువు చెప్పిన మాట, గురువు ఇచ్చిన జ్ఞానాన్ని తిరస్కరించలేదు.

తిరస్కరించకూడదని నా అనుభవం నేర్పింది !

(తరువాయి వచ్చే సంచికలో...)

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

పిట్టచూపు

చలసాని నరేంద్ర
9849569050

పౌరసత్వ చట్టంపై విద్వేషాల వ్యాప్తి ప్రమాదకరం



దేశవిభజన కాలంనుండి మన నేతలు ఇస్తున్న హామీలకు కార్యరూపం దాల్చుతూ భారత పార్లమెంట్ పౌరసత్వ సవరణ చట్టాన్ని ఆమోదించడం ఒక చారిత్రాత్మక ఘట్టం. వాస్తవానికి నెహ్రూ నుండి ఇందిరాగాంధీ, మన్మోహన్‌సింగ్ వరకు, మమతాబెనర్జీ నుండి సీతారాం ఏచూరిల వరకు పాకిస్థాన్, బాంగ్లాదేశ్‌ల నుండి ప్రాణ భయంతో శరణా ర్థులుగా వచ్చిన వారికి పౌరసత్వం కల్పిం చాలని కోరుతూ వచ్చారు. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ చట్టం తీసుకురాగానే ఒకేసారి ఏదో జరగరానిది జరుగుతున్నట్లు ఖంగారు పడుతున్నారు.

ఈ సందర్భంగా దేశంలో పలుచోట్ల జరుగుతున్న నిరసనలు హింసారూపం దాల్చడం కేవలం సంకుచిత రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలోనే అని చెప్పవచ్చు... ఈ చట్టాన్ని చదివిన ఎవ్వరికైనా దీని ప్రభావం భారత పౌరులు ఎవ్వరిపైనా పడ బోదని స్పష్టం అవుతున్నా, ఎందుకు ఇంతగా విద్వేషాలు రెచ్చగొడుతున్నారో అర్ధంకాదు. **నిరసనలతో పాల్గొంటున్న వారు చట్టం గురించి తెలియని వారైె ఉండాలి లేదా ఉద్దేశ్య పూర్వకంగా వదంతులు, విద్వేషాలు వ్యాప్తి చేసే ప్రయత్నమైనా అయి ఉండాలి.**

నిరసన పేరుతో అస్సాంలో సచివాల యంపై దాడి చేయడం కోసం వామపక్ష తీవ్ర వాద శక్తులు, తీవ్రవాదులు, కొన్ని రాజకీయ శక్తులు కుట్ర పన్నినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం చూస్తుంటే, దీని వెనుక లోతైన రాజకీయకుట్ర దాగిఉన్నట్లు భావించవలసి ఉంటుంది. పైగా, ఇప్పటివరకు ప్రభుత్వం నిర్దిష్టచర్యలు కూడా చేపట్టని జాతీయ పౌర సత్వ రిజిస్టర్ అంశంతో దీనిని కలిపి గందర గోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు.

పశ్చిమబెంగాల్‌లో మొదటి రెండు రోజులు ఎటువంటి నిరసనలు లేకపోయినా ప్రభుత్వమే కొన్ని వర్గాలను సమీకరించి రాజకీయ ప్రయోజనాలకోసం నిరసనలకు ఆజ్యం పోసినట్లు కనిపిస్తున్నది. ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలలో పోలీసులపై దాడులకు పాల్పడటం సహితం యాదృచ్ఛికంగా జరిగినదని చెప్ప లేము.

భారత పౌరులు ఎవ్వరిపైనా ప్రభావం చూపని ఈ చట్టాన్ని 'భారత్' అనే ఆలోచననే ధ్వంసం చేస్తుందని, ముస్లింలను రెండో తరగతి పౌరులుగా చేస్తున్నారని... ఏవేవో ఆరోపణలను ముఖ్యమంత్రులు, పలు పార్టీల అగ్రనేతలు చేస్తూ ఉండటం గమనిస్తే **ప్రజల మధ్య కలతలు పెంచడానికే ఆందోళనలకు ఆజ్యం పోస్తున్నట్లు స్పష్టం అవుతున్నది.**

అయితే ఈ చట్టంపై వాస్తవాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేయకుండా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలపై రాజ కీయ దాడులకు పాల్పడి, పాకిస్థాన్‌వారికి పౌరసత్వం ఇవ్వాలని అంటారా చెప్పండి అంటూ ప్రధాని, హోమ్ మంత్రి వంటి వారు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సహితం ఆమోదయోగ్యం కాబోదు. **సంకుచిత రాజ కీయ పరిధులకు అతీతంగా ఈ చట్టానికి సర్వామోదం లభించే చొరవ ప్రభుత్వం నుండే ప్రారంభం కావలసి ఉంది.**

పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలకు మాత్రమే కాదు భారతదేశ పౌరులు ఎవ్వరికీ సంబంధించింది కానేకాదు. కేవలం మూడు దేశాలు – పాకిస్థాన్, బాంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్తాన్ ల నుండి ఇప్పటికే భారతదేశంలోకి వచ్చి, నివాసం ఉంటున్న మతపర మైనారిటీలైన హిందువులు, జైనులు, బౌద్ధులు, శిక్కులు, పార్సీలు, క్రైస్తవులకు మాత్రమే పౌరసత్వం కల్పించడం కోసం ఉద్దేశించిన చట్టం ఇది. కాని, ఈ చట్టం భారతీయ ముస్లింలకు ఆందోళనకరమై నది అంటూ ఒక అభూతకల్పన అసత్యాన్ని ప్రచారం చేస్తున్నారు.

మతపరమైన హింస కారణంగా 2014కు ముందు భారత దేశంలోకి శరణా ర్థులుగా వచ్చి, నివాసం ఉంటున్న వీరు ఇప్పుడు భారత పౌరసత్వంకోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ చట్టం అవకాశం కల్పి స్తుంది. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత భారత పౌరులు ఎవ్వరినీ తమ పౌర సత్వం నిరూపించుకోవడం కోసం ఎటు వంటి పత్రం సమర్పించమని కోరే ప్రసక్తే తలెత్తదు. కేవలం ఆ విధంగా కొందరు తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తున్నారు.

స్పష్టంగా పేర్కొన్న మూడు దేశాలలో మతపరమైన వివక్షతకు, హింసకు గురికావ డంతో భారతదేశంకు వలస వచ్చి, నివాసం

ఉంటున్న ఆ దేశాలలోని మైనారిటీలకు పౌరసత్వం కల్పించడం కోసం ఉద్దేశించిన చట్టం ఇది. ఈ చట్టం అమలులోకి రావడంతో ఇప్పటికే అమలులో ఉన్న సహజ న్యాయ చట్టాలు ఏవీ రద్దు కాబోవు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల ప్రకారమే ఏ దేశానికి చెందిన పౌరులైనా భారత పౌరసత్వం కావలి అనుకొంటే దరఖాస్తు చేసు కోవచ్చు.

ప్రస్తుత చట్టాల ప్రకారం ప్రపంచం లోని ఏ దేశానికి చెందిన ముస్లింలైనా భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అటువంటి అవకాశాన్ని ఈ చట్టం రద్దుచేసే ప్రసక్తి లేదు. సహజ న్యాయం క్రింద భారత పౌరసత్వం జారీచేసే పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 క్రింద వారు భారత పౌరసత్వంకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే ముస్లింలను తప్పించే ప్రయత్నం ఏమీలేదని చెప్పవచ్చు.

ఈ చట్టం మూడు దేశాలలోని ఆరు మతాలకు చెందిన వారికి భారత పౌరసత్వం ఇవ్వడం కోసం ఉద్దేశించినది. భారత దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన హిందువులు, జైనులు, బౌద్ధులు, శిక్కులు, పార్సీలు, క్రైస్తవులను తిరిగి వెనుకకు పంపే ముందు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉద్దేశించినది ఈ చట్టం అయినప్పటికీ, ఇందులో ఎవ్వరినీ దేశం నుండి పంపించి వేయడం గురించి ప్రస్తావించనే లేదు.

ఎందుకంటే ఆ అంశం మరో చట్టం – విదేశీయుల చట్టం పరిధిలోకి వస్తుంది. భారత దేశంలోకి అక్రమంగా ప్రవేశించి, నివాసం ఉంటున్న ఎవ్వరినైనా వెనుకకు పంపించి వేయడం అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. ఆ పక్రియలో ఈ చట్టం ఎటువంటి మార్పునూ తీసుకు రాదు.

ఈ చట్టం హిందువులకు అప్పటికప్పుడు పౌరసత్వం కల్పించదు. వారు భారత్‌లో కనీసం ఐదేళ్లపాటు నివసించి ఉండాలి. ఆ తర్వాత పౌరసత్వం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఈ పక్రియ మొత్తం జరగడానికి సంవత్సరంకు పైగా పడుతుంది. చాలా మంది వాదిస్తున్నట్లు ఈ చట్టం హిందువుల పట్ల పక్షపాతంతో కూడుకున్నది కానేకాదు.

మూడు దేశాలకు చెందిన ఆరు మతాలవారికి సడలింపు ఇవ్వడం జరిగింది. మిగిలినత అన్ని దేశాలకు చెందిన వారికి సాధా రణ సహజన్యాయ చట్టం వర్తిస్తుంది. ఉదాహ రణకు, తమిళనాడులోని శరణార్థుల శిబిరా లలో శ్రీలంకకు చెందిన చాలామంది తమిళ హిందువులు నివసిస్తున్నారు. వారిని ఈ చట్టం పరిధిలోకి తీసుకురాలేదు. ఈ శ్రీలంక తమిళులు అందరు 1990వ దశకంలో ఎల్ టి టి ఇ తో యుద్ధం జరిగిన సందర్భంగా భారత దేశంలోకి పారిపోయి వచ్చినవారు. వారు చాలా శిబిరాలలో నివసిస్తున్నారు.

షియాలు, అహ్మదీయాలు, బలోచిలు, రోహింగ్యాలను ఎందు కని చేర్చలేదని ప్రశ్నిస్తున్నారు. ముస్లింలలోనే ఉన్న ఈ వర్గాలు అన్ని కూడా ప్రపంచంలో ఎక్కడా ప్రత్యేక మతంగా గుర్తింపు పొంద లేదు. వీరంతా ముస్లింలు కావడంతో వారు పాకిస్థాన్, బాంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్తాన్‌లలో మైనారిటీలు కారు. ఈ దేశాలు అధికారికంగా ఇస్లామిక్ దేశాలు లేదా ఆయా దేశాలలో అత్యధికంగా ముస్లిం జనాభా ఉండటం తెలిసిందే.

ఈ చట్టం ఆ దేశాలలోని మైనారిటీ ప్రజలకు ఉద్దేశించినది కావడంతో దీనిలో ముస్లింలను చేర్చడం సాధ్యం కాలేదు. అయినా, ఈ ఇస్లామిక్ దేశాలలో తమ ఇస్లాం పద్ధతులను ఆచరిస్తున్నందుకు ముస్లింలు ఎవరైనా హింసను ఎదుర్కొంటూ ఉంటే వారు భారత దేశంలో ఆశ్రయంకోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

మతం పేరుతో వివక్షతను రాజ్యాంగం నిషేధించడంతో ఈ చట్టం భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. భారత రాజ్యాంగం భారత పౌరులు అందరికి వర్తిస్తుంది. ఈ చట్టం భారత పౌరులు కాని కొందరికి ప్రత్యేకంగా నిబంధనలు రూపొందించింది. కాబట్టి, ఈ చట్టం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నదని చెప్పడం సరికాదు.

పైగా, మన రాజ్యాంగంలో, చట్టాలలో ఇప్పటికే పలు వివక్ష పూరిత నిబంధనలు ఉన్నాయి. మనకు ప్రతి పౌరునికి సమాన న్యాయం లేదు. పలు అంశాలలో వివిధ మతాలకు విభిన్న చట్టాలను మన రాజ్యాంగం అనుమతిస్తుంది. మనకు హిందూ దేవాలయాలు ప్రభుత్వ నియంత్రణలో ఉండగా, మసీదులు, చర్చిలు ఆ విధంగా లేవు. హిందువులు, హిందువేతరులు నిర్వహించే పాఠశాలలకు విభిన్న చట్టాలు ఉన్నాయి.

ఈశాన్య రాష్ట్రాలలో, ముఖ్యంగా అస్సాంలో కొందరు ప్రజలు ఈ చట్టాన్ని వ్యతిరేకించడం నిజమే. అయితే ఈ చట్టాన్ని దేశంలోని ఇతర ప్రాంతాల వారు వ్యతిరేకించడానికి, ఈశాన్య ప్రాంత ప్రజలు వ్యతిరేకించడానికి పూర్తిగా భిన్నమైన కారణాలు ఉన్నాయి. **మతంతో సంబంధం లేకుండా, బాంగ్లాదేశ్ నుండి లేదా మరెక్కడి నుంచైనా అక్రమ శరణార్థులను ఈశాన్య ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ కారణంతో వారు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారు.**

కానీ, ఈశాన్య రాష్ట్రాల వెలుపల ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు ఇందులో ముస్లింలను చేర్చలేదని వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకించడంలో వీరిద్దరూ పూర్తిగా భిన్నమైన ధ్రువాల్లో ఉన్నారని గమనించాలి.

గతంలో నెహ్రూ దగ్గర నుండి ఇందిరా గాంధీ వరకు పాకిస్థాన్, బాంగ్లాదేశ్ లలో మతపరమైన వేధింపుల కారణంగా మనదేశానికి వలసవచ్చిన వారికి పౌరసత్వం కల్పించడం గురించి హామీలు ఇచ్చారు. 2003లో రాజ్యసభలో నాటి ప్రతిపక్షనేత మన్మోహన్ సింగ్ పార్లమెంట్‌లో ఈ విషయమై నాటి ఉపప్రధాని ఎల్ కె అద్వానీని ప్రశ్నించారు. **మమతా బెనర్జీ నాలుగేళ్ల క్రితం ఈ విషయమై డిమాండ్ చేశారు. ఇప్పుడు వ్యతిరేకం అనడం కేవలం రాజకీయ కారణాలతోనే అని స్పష్టం అవుతున్నది.**

పాకిస్థాన్, బాంగ్లాదేశ్‌ల నుండి శరణార్థులుగా వస్తున్న వారిలో అత్యధికులు దళితులే అని గమనించాలి. దేశ విభజన సందర్భంగా ఇస్లాం రాజ్యంలో మైనారిటీలకు రక్షణ ఉండదని, పాకిస్థాన్‌లోని దళితులు అందరూ ఏ దారి దొరికితే అందులో భారత్‌కు తిరిగి వచ్చేయాలని డా.బి ఆర్ అంబేద్కర్ పిలుపి చ్చారు. రెండు దేశాల మధ్య 'జనాభా మార్పిడి' జరగాలని కూడా డిమాండ్ చేశారు. ఇటువంటి అంశంలో సంకుచిత రాజకీయాలకు చోటిచ్చి, రాజకీయ విద్వేషాలు వ్యాప్తి చేయడం ప్రమాదకరం.

ధారావాహిక

నంద్యాల నారాయణరెడ్డి
9360514800

సొతంత్రకాల సదువులు 8

పారిపో[redacted]

1957 [redacted] తరగతికి వచ్చేస్తిమి. మామూలుగానే కొత్త బట్టలూ కొత్త పొత్తాలూ కొత్త కలాలూ కొత్త పాటాలూ...అయితే ఇస్కూలు పాతదే, మేస్టర్లూ పాతవాళ్లే, హోసూరూ పాతదే...హోసూరుపేట మాకు ఇప్పుడు కొట్టిన పిండి. సందుసందూ గొందిగొందీ మాకు పరిచయమే.

పేటను ఆనుకొని ఉత్తర దక్షిణాలుగా మూడు గుట్టలు. ఉత్తరాన వెంకట రమణస్వామి గుట్ట; ఆ గుట్టకింద రాగాలు తీస్తా తెలుగు మాట్లాడే పందిజోగివాళ్ల గుడిసెలు; గుడిసెలు దాటుకొని వస్తే దుడ్డ చెరువు; చెరువును ఆనుకొని బెంగుళూరు శాల్యం (సేలం) బాట; బాటను దాటుకొంటే పేటను కాపుకాస్తా బండాంజనేయుని గుడి; చంద్రచూడేశ్వరుని గుట్ట; దక్షిణంగా 'ఒకానొక కాలంలో బ్రహ్మగుడి ఉండేదంట' అని పెద్దలు చెప్పే నాలికకొండ; దానికింద అగ్రహారం; పేటకు ఇంకొకపక్కన చల్లని చూపుల గ్రామదేవత కోట మారెమ్మగుడి; పేటలో సంత బయలు, పై గొల్లపేట, దిగువ గొల్లపేట, నేసేపేట, జనపపేట, తేరుపేట, సున్నపురాళ్ల వీధి, రామదేవుని గుడివీధి, చెరువీధి, గరిడీ గుడి వీధి, కుంబేరస్వామి గుడివీధి, సోమసుందరయ్య వీధి, నంజుండేశ్వరుని వీధి, మర్రిమాను వీధి, రాసపేట, గాండ్లవారి పేట...తెలుగుతప్ప ఇంకొక పలుకు వినిపించని మా హోసూరుపేటలో మేము రాటుతేలిపోతిమి.

ఏడాదేడాది ఉగాదికి రవంత ముందు వెనకలుగా హోసూరులో చంద్ర చూడేశ్వరుని పరస (తిరునాళ్లు) జరుగుతుంది. పరస మూడునాళ్లే అయినా, పరసబయలులో ఏడెనిమిదినాళ్లు పశువుల సంత జరుగుతుంది. సాళ్లుసాళ్లుగా కదిలివచ్చే బండ్లు; కానుగ విత్తులూ చింత విత్తులూ ఏరి అమ్ముకొని కదిలే చిన్నోళ్లు; కల్లాల్లో సీకల (పరిగ) రాగులను ఊడుచుకొని సాగే పేదోళ్లు; మేకనో గొర్రెనో ఎద్దునో ఎనుమునో అమ్ముకొందామని నడిచే పెద్దోళ్లు; ఎన్నాళ్లుగానో కూడేసి పెట్టుకొన్న తూటుకాసులను సరాలుగా కూర్చుకొని నడుముకు కట్టుకొని వెళ్లే మైనర్లు; దోవ పొడగునా నీరుమజ్జిగ, పానకం, పెసల బేడలు (వడపప్పు) పంచే సంసారులు...చుట్టుపక్కల ఏబైమైళ్ల కైవారం నింకా దారులన్నీ మా పేటతట్టుకే అజ్జులు పెడతా వస్తాయి.

హోసూరు పరస మూడునాళ్లు జరుగుతుంది. మొదటిదినం, మరకతాంబ చంద్రచూడేశ్వరుల ఉత్సవమూర్తులను ఏడంతస్తుల తేరులో పెట్టి తేరుపేట వీధులలో ఊరేగిస్తారు. రెండోనాడు రావణబ్రహ్మ వాహనం మీద పల్లకి ఊరేగింపు. మూడోనాడు తేరుపేట కల్యాణి (కోనేరు) లో తెప్పమీద ఊరేగింపు.

పరక జరిగే రాత్రుల్లో నాటకాలూ కేళికలూ దొమ్మరాటలూ తెరాటలూ (సినిమా) జానపదాలూ నడుస్తుంటాయి. వీటిని చూసేకి జనం వెల్లువలాగా వస్తారు.

ఆ ఏడాది హోసూరు పరసకు మేమూ బయలుదేరితిమి. పండగకోసం మాపల్లెకు పోయింటిమి. రెండోనాడు మాపుసరి చిన్నోళ్లమంతా (యువకులం) హోసూరు తట్టు నడకను సురువు చేస్తిమి. దోవంతా నీరుమజ్జిగా పానకమూ తాగతా పెసలబేడలు తింటా ఎగుర్లాడతా దుముకులాడతా పోతా ఉండాము.


ఊరిని దాటిన రవంత సేపటికి చలికి ముసుగేసుకొన్న చిన్నోడు ఒకడు వచ్చి మా గుంపులో కలిసినాడు. వాడు మాటా పలుకూ లేకుండా వస్తా ఉండాడు. పరసకు పోయే చిన్నోడు ఎట్లుండాల! ఎగరతా దుముకుతా గప్పాలు కొడతా పోవాల. వీడేమో మూగోని మాదిరిగా దూరదూరంగా వస్తా ఉండాడు. వాని కత ఏమనేది మాకు తెలీలేదు.

పరస దగ్గరకు పోయినంక, ఆ వెలుగులో చూస్తే కానీ ఆ మగవాడెవడు అనేది తెలీలేదు. వాడు కాదు అది. అదొక పడుచు. ఎవరికీ తెలీకుండా దొంగతనంగా ఆ పడుచుని పిలుచుకోని వచ్చేసిందాడు మా నేతరెడ్డిగాడు. ఆ పడుచును బాగా చూసిన మాకు గుండె గుబేలుమనింది. మా వూరి మీసాల గుర్రెడ్డి కూతురు మల్లి. గుర్రెడ్డి బలే కచ్చులోడు (మొరటు) ఆయనికి కోపం వస్తే ఎవరనేది వెనకా ముందూ చూడడు. పెద్దపెద్దోళ్లే గుర్రెడ్డి అంటే దిగులు పడతారు. ఇంక మా కత చెప్పాల్నా!

"ఏలరా ఈ పని చేసిండావు?" అని పక్కకి పిలిచి నిలేస్తిమి. వాడు నీళ్లు నమలతా ఉండాడే కానీ ఉసురుతీయలేదు.

"మీ ఇండ్లల్లో తెలిస్తే ఇంకేమన్నా ఉందంట్రా?" అంటిని నేను. మల్లి వచ్చి వాని పక్కన నిలబడింది. మెల్లిగా వాళ్లకతను విప్పిరి వాళ్లు.

అగ్గరారం బడిలో చదివేటప్పుటినింకానే వీళ్లిద్దరికీ నేస్తమంట. ఇద్దరూ బడికి నామంపెడతా ఉంటే చదివింది చాల్లే అనుకొని ఇద్దరినీ వాళ్ల పెద్దోళ్లు గొర్రెల్ని మేపేకి వేసేసిరి. గొర్రెల్ని మేపేటప్పుడు వీళ్ల జత ఇంకా గట్టిపడింది. పాటలు పాడుకొంటా ఆట్లాడుకొంటా గొర్రెల్ని మేపేవాళ్లు. పరసకు మూడునాళ్ల ముందు నింకా ఓణి (డొంక) కి చెరొక పక్క చేరి పాటలు పాడుకొన్నారు.



పటాస్కర్ ద్రోహం :

1957 వెళ్లిపోయి 1958 వచ్చేసింది. సంకురాతిరి పండక్కి ఇంటికిపోయి, పండగ సంబరం ముగించుకొని తిరిగి గురువుగారి ఇంటికి వచ్చేస్తిమి. పరీక్షలు దగ్గరపడతా ఉండా యని బాగ చదివిస్తా ఉండారు గురువుగారు.

అప్పుడప్పుడూ ఆంధ్రఉద్యమం గురించి మాట్లాడే మేస్టర్లు ఒకనాడు మా గురువుగారింటికి వచ్చిరి. ఎప్పుడూ ఇద్దరు ముగ్గురే వస్తుండేవాళ్లు, ఈసారి ఏడెనిమిదిమంది వచ్చిండారు. మా గురువుగారు మాచేత చాపల్ని పరిపించి అందర్నీ కూర్చోమన్నారు.

"పటాస్కర్ రిపోర్టు కూడా బయటకు వచ్చేసింది. దాన్లోనూ మనకు అన్యాయమే జరిగింది. మన హోసూరు తాలూకాలో 38.4% తెలుగువాళ్లు, 31.5% కన్నడం వాళ్లు, 22.4% తమిళులూ ఉండారంట. ఇది త్రిభాషా ప్రాంతమంట. ఏ భాషవాళ్లూ 50% మించి లేరు కాబట్టి ఉన్నదున్నట్లుగానే ఉండనీయాలంట" ఒక గొంతులో ఆవేదన.

"ఇదెక్కడి అరాచకము, 22% అరవమోళ్లు మన తాలూకాలో ఎక్కడుండారు? దర్మరాజు కాపులూ ముద్దలోళ్లు (దళితుల్లో ఒకతెగ) తప్ప ఇంకొక అరవకులం లేదే. వాళ్లు కూడా నూటికి ఏభై తెలుగు మాటల్ని కలిపే కదా అరవం మాట్లాడేది. కన్నడమోళ్లము ఉండాము. నేను కూడా కన్నడమోడినే కదా. మేము చదివేదంతా తెలుగే. అమ్మబాసంటే ఇంట్లో అమ్మతో మాట్లాడేదంటే ఎట్లా? అమ్మ బాసంటే ఆ తావుబాస. దిగువసీమనింకా వచ్చిండే నాలుగయిదు శాతం మంది తప్ప, **హోసూరు తావున ఉండేవాళ్లమంతా తెలుగువాళ్లమే కదా, ఏమి గుడ్డి రిపోర్టు అది" ఒక గొంతులో ఆక్రోశం.**

"అదిసరే, ఆ రిపోర్టులో మూడుభాషల వాళ్లు చేరి 92.5% ఉండారే, మనతావున ఉర్దూ మాట్లాడే సాయిబులు లేరా, పల్లెలకు పల్లెలే మరాఠీవాళ్లు లేరా, అడివంచుల్లో సుగాలోళ్లూ, పేట వీధుల్లో షికారోళ్లూ, బొందిలివాళ్లూ వీళ్లంతా తరతరాలుగా ఇక్కడుండారే, వాళ్లవాళ్ల భాషల్ని మాట్లాడుకొంటా ఉండారె, అందరినీ కలిపే సంధానభాష ఇక్కడ తెలుగే కదా, నూరారేండ్ల వాడుకను కొట్టి పారేసేదానికి ఆ పటాస్కర్ ఎవడు" ఒక గొంతులో ఆవేశం.

"మనం ఆవేశపడీ ఆవేదనపడీ చేయగలిగింది ఏముంది? మనకు సరైన నాయకుడు లేదు. అరవనాయకులలో ఉండే కట్టు మన నాయకులలో లేదు. ఆంధ్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డి కూడా చేతకానివాడయి పోయెనేమో!" ఒక గొంతులో అలమట.

"మీరే అట్లంటే, మేమేమనాల. పటాస్కరు 1957 జులై నెలలోనే కేంద్రప్రభుత్వానికి రిపోర్టును ఇచ్చెనంట. హోసూరు ప్రాంతంమీద రిపోర్టులో తప్పులున్నాయని నీలం సంజీవరెడ్డి, హోం మినిస్టరు గోవిందవల్లభపంత్‌కు ఫిర్యాదు చేసెనంట. దాంతో ఇంకొకసారి సర్వేకు ఆదేశించినాడు హోంమినిష్టరు. అయినా

"పోతా పోతా ఓసూరు పరసకు తుమ్మిదా
వస్తా నేనూ జతగా పరసకు తుమ్మిదా
కానుగిత్తుల కాసులు కర్చుకుండాయి తుమ్మిదా
చింతయిత్తుల చిల్లర చెల్లుకుండాయి తుమ్మిదా
తూటుకాసుల సరము నడుముకుండాది తుమ్మిదా
పరిగలేరిన దుడ్డు పదిలంగుండాది తుమ్మిదా
పగలు పరసకు సరసంగ పోదామా తుమ్మిదా
పగలు పరసలోన పెద్దలుంటారు తుమ్మిదా
రెయ్యి పరసకు రంజుగ పోదామా తుమ్మిదా
రెయ్యి పరసకైతే చెయ్యిపట్టుకు వస్తా తుమ్మిదా
కల్లం గుడిసెకి కన్నుకప్పి వస్తా తుమ్మిదా
గుడ్డెవ్వ పక్కన దిండుపెట్టి వస్తా తుమ్మిదా'

ఇట్ల పాటలు పాడుకోని జమట (జంట) అయిపోయి, మల్లికి మగోనివేషమేసి పిలుచుకోని వచ్చేసిండాడు నేతరెడ్డి. వాడు చెప్పిందంతా వినిన మాకు చెమటలు పట్టేసె. మా జతలో ఉండద్దు, మీ పాటు మీరు పడండ్రా అనేసి, మేము ఇంకొకతట్టుకు పోయేస్తిమి. అనెంక వాళ్లు పరసలో ఏమాయెనో మాకు తెలీలేదు. పరస ముగిసిన మూడోనాడు నేతరెడ్డి కనబడితే అడిగితిమి. వాడు ఆ సమాచారమును విప్పి చెప్పినాడు.

"ఆపొద్దు మీరట్ల పోతానే మేమిద్దరమూ ఇంకొకతట్టుకు పోతిమి. నేను పాతాళభైరవికి పోదామంటే, లేదు మల్లీశ్వరినే చూడాలనింది మల్లి. సరేపద, నువ్వు బానుమతీ నేను రామారావు అనుకొంటా కొటాయిలోకి దూరితిమి. తినేకుల్ని తింటా ఆటను చూస్తా ఉండాము. కడసీ కనువు (దృశ్యం) లో రాజూరాణీల ముందర బానుమతి ఆడతా ఉంటే, రామారావు గోడదూకి రాజుగారి తోటలోకి దూరతాడు. అప్పుడే నేను ఏలనో వెనక్కి చూస్తిని. మాకు సరిగా వెనక రెండోవరసలో మల్లివాళ్ల అబ్బ మీసాల్ని తిప్పుకొంటా ఆటను చూస్తా కూకోనుండాడు. మా ఇద్దరి గుండెలూ నీళ్లయిపోయె. ముసుగులు వేసుకొని మెల్లిగా లేచి బయటకొచ్చి ఊరికంటా ఒకే దౌడు"

నేతరెడ్డిగాని మాటలకు మేమందరమూ పడిపడి నగితిమి.

సెప్టెంబరులో ఇచ్చిన రెండో రిపోర్టులో కూడా మార్పేమీ లేదనుకోండి. అది వేరే విషయం. కనీసం హోసూరును ఆంధ్రకు కలపండని అడగనన్నా అడిగినాడు. మా గుడియాతం తాలూకా ఊసే పట్టలేదు ఆంధ్రనాయకులకు. మా తాలూకాలోని కొట్టమిట్ట గ్రామానికి చెందిన అడుసుమిల్లి కులశేఖరనాయుడు గుడియాతం తాలూకానంతా ఆంధ్రకు చేర్చాలని పోరాడినాడు. అరవవాళ్లకి ఎంత కసి అంటే, మా ఉద్యమానికి వ్యతిరేకంగా, పటాస్కరుమీద ఒత్తిడిపెట్టో ప్రలోభపెట్టో ఆంధ్రలోని కొన్ని పల్లెలను మా తాలూకా కిందకు వచ్చేటట్లు రిపోర్టులో చేర్చుకొన్నారు. ఆ తావునుండి వచ్చినతనే ఈయన" ఒక గొంతులో అలజడి.

"మా ఊరిపేరు పరదరామి. సంత జరిగే పెద్దగ్రామం. పరదరామినీ, చుట్టుముట్టు ఉండే పెరుమాళ్లపల్లి, పుట్టావారిపల్లి, గుడ్లవారిపాళెం, వీరిసెట్టిపల్లి, వరదారెడ్డిపల్లి, అరిగవారిపల్లి, కొత్తూరు, దక్షిణపాతపాళెం అనే ఊర్లనూ మదరాసు రాష్ట్రానికి బదిలీ చేయాలని రిపోర్టులో ఉంది. చిత్తూరుకూ పరదరామికీ నడాన దూరం పన్నెండు మైళ్లే. పరదరామి నుండి గుడియాతంకు పోయేటప్పుడు వరదారెడ్డిపల్లిని దాటినాక చిన్న కనుమదారి వస్తుంది. అది మాకు సహజమైన ఎల్లగా ఉంటుంది. మా పల్లెల్లో 70% తెలుగు, 30% అరవ. అన్నీ తెలుగుబడులే. ఇప్పుడు మేమేమి చేయాలనేది తెలియడం లేదు" ఒక గొంతులో ఆత్రుత.

"మా తిరుత్తని తాలూకాను మొత్తంగా మదరాసు రాష్ట్రానికి బదిలీ చేయాలనేసినాడు పటాస్కరు. మా తాలూకాలో 60.5% తమిళులనీ 37.6% తెలుగువాళ్లనీ రిపోర్టులో ఉంది. ఇంతకంటే పెద్ద తప్పుడు రిపోర్టు ఇంకొకటి లేదు. తిరుత్తని అరవవాళ్లదని శివజ్ఞానగ్రమణి అనే ఆయన పోరాడినాడు. కామరాజనాడారుదీ ఆయనదీ ఒకటే కులం. నాడారే గ్రమణి ఉద్యమానికి అండ. మా తావున హరిజనవాడల్లో ఎక్కువగా అరవవాళ్లు ఉంటారు. గ్రమణి అనుచరులు పటాస్కరును హరిజనవాడల్లోనే తిప్పినారు. మా పక్కన కూడా తెలుగువాళ్లకు నాయకుడు లేడు. మా తాలూకాలోని పడమటి ప్రాంతమైన పల్లిపట్టు సబ్‌తాలూకా అయితే తెలుగుమయం. మొత్తం 319 గ్రామాల తిరుత్తని తాలూకా ఇంక అరవమయం కాబోతుంది" ఒక గొంతులో కలవరం.

"భగవంతుడికి కూడా భాషను అంటగట్టే నీచానికి దిగినారు అరవ నాయకులు. మురుగన్ తమిళదేవుడంట. ఆయన నెలకొని ఉన్న తిరుత్తని తమిళులదేనంట. దీనికి బదులు చెప్పే తెలుగు నాయకుడో తెలుగుమేధావో కనబడడం లేదు. **తిరుత్తని అనేది అరవలు మార్చినపేరు. మా జనం నోళ్లలో మటుకు అది చిరుతని. కార్వేటి నగరం సంస్థానం కింద ఉండిన గుడి అది. ఆ రాజులు పెట్టినపేరు చిరుతనిపురం. చిరుతడు అంటే కుమారస్వామి కదా. బ్రాహ్మణులు, రెడ్లు వంటి ఒకటి రెండు కులాలవాళ్లు కలువకొండ అని పిలుస్తారు. కొండపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామిని స్థానికులంతా చెంగలరాయడు అంటారు. చెంగల కసువులో పుట్టిన రాయడు కదా ఆయన. తెలుగే లేకుండా పోతుంటే ఇంక తెలుగు చరిత్ర మాత్రం మిగులుతుందా?" ఒక గొంతులో కలత.**

"148 గ్రామాలను మదరాసు నుండి ఆంధ్రకు బదిలీ చేయాలని రిపోర్టు ఇచ్చినాడంట?"

"అవునవును, సుమారు 330 గ్రామాలకు బదులుగా నూట నలభై ఎనిమిది గ్రామాలు. ఆంధ్రులకు బిచ్చం వేసినాడు పటాస్కరు. ఆ ఎంగిలి మెతుకులను ఏరుకోవలసిందే ఆంధ్రనాయకులు"

"బాగ చెప్పినారు. ఆ బిచ్చం కూడా ఊరికే రాలేదు వాళ్లకు. పొన్నేరి తాలూకా రామారెడ్డిపాళెం అనే ఊరిలోని ఈశ్వరవాక వేణుగోపాలరెడ్డి అనే ఆయన, పొన్నేరి తాలూకానంతా ఆంధ్రకు చేర్చాలని పెద్ద ఉద్యమం చేస్తే ఆ మాత్రం దక్కింది. ఇదిగో వీరిపేరు దువ్వూరి భాస్కరరెడ్డి. ఆ ప్రాంతం నుండి వచ్చినారు"

"నమస్కారం. వేణుగోపాలరెడ్డిగారి ముఖ్య అనుచరులలో నేను ఒకడిని. ఎల్లంరాజు క్రిష్ణమరాజు, ఆరణి రాఘవరెడ్డి, గాలి సుబ్బరామనాయుడు, మున్నంగి ఓబులరెడ్డి మిగిలిన అనుచరులు. మా గురువుగారి నాయకత్వంలో మా తాలూకాలోని పల్లెపల్లెకూ తిరిగినాము. రాఘవరెడ్డి అయితే తిరువళ్లూరు తాలూకాలోని తెలుగువాళ్లను కదిలించినాడు. జనం మా వెంట పెద్ద ఎత్తున కదలినారు. శివజ్ఞాన గ్రమణి తిరుత్తనిలో రైళ్లను నిలిపేస్తే మేము పొన్నేరి, గుమ్మడిపూడి స్టేషన్లలో రైళ్లను నిలిపేసినాము. పట్టాలపైన వంటలు వండుకొని తింటూ వందలమందిమి కూర్చుండి పోయినాము. నెల్లూరు జిల్లా తడలో పటాస్కర్ గోబ్యాక్ అంటూ అడ్డుకొన్నాము. దాని ఫలితంగానే పొన్నేరి, తిరువళ్లూరు తాలూకాలలో నుండి 148 గ్రామాలను ఆంధ్రకు ఇవ్వాలని రిపోర్టు ఇచ్చినాడు పటాస్కరు. నిజానికి ఆంధ్రలో కలవడానికి పోరాటం చేసింది నాలుగువందలకు పై చిలుకు గ్రామాలు. విషాదమేమిటంటే, వేణుగోపాలరెడ్డిగారి రామారెడ్డిపాళెం, మా వూరైన అత్తిపట్టు, క్రిష్టంరాజువాళ్ల సిద్ధిరాజుకండ్రిగ, రాఘవరెడ్డివాళ్ల పాలవాక, ఓబులరెడ్డివాళ్ల బోడిరెడ్డి కండ్రిగ గ్రామాలు మటుకు ఆంధ్రలో కలవడం లేదు. ఒక్క సుబ్బరామనాయుడువాళ్ల పాలగుంట మాత్రం కలవబోతుంది. ఆ 148 గ్రామాలను కలిపి సత్యవేడు తాలూకాగా ప్రకటించబోతున్నారంట"

"ఇదంతా వింటుంటే మనకు అర్థమయ్యేది ఒకటే. మన హోసూరు జనానికి నాయకుడు, అంటే నడిపించేవాడు లేడు. అదే మనకు శాపం అయింది. మనలోనూ ఒక నాయకుడు తయారు కావాలని కోరుకొందాము" అంటా మా గురువుగారు సమావేశాన్ని ముగించిరి.


ఆ మాటలన్నీ వింటా ఉండిన నాకు నెత్తురు కుతకుత ఉడికింది. తెలుగుకు ఇంత అవమానం జరుగుతా ఉందా అని వెత కలిగింది. కోపాన్నీ తాపాన్నీ చూపించుకొనే వయసు కాదనుకొని అణగిపోతిని.

1958 ఉగాదికి వెనక తొమ్మిదో తరగతి పరీక్షలు ముగిసినాయి. వేసగి బిడువులకు, నా రాక కోసరం ఎదురు చూస్తా ఉండే మా అగ్గురారంకు బయలుదేరితిని.

(తరువాయి వచ్చే సంచికలో...)

పుస్తక పరిచయాలు

తెలంగాణ సాహిత్య అకాడమీ పునర్ముద్రణలు



2014 సం॥లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, సాహిత్య అకాడమిని స్థాపించి ఇతోధికంగా తెలుగుభాష, సంస్కృతిని పునరుజ్జీవనం చేసే ప్రయత్నంలో భాగంగా యిప్పటి వరకు 50కి పైగా పుస్తకాల ప్రచురణను చేపట్టింది. ఆ క్రమంలో తెలంగాణా కావ్య రచన, సాహితీ వైభవం తెలిపే కొన్ని పాత పుస్తకాల పునర్ముద్రణ కూడా జరుగుతోంది. క్రమసంఖ్యలు 47, 48 మరియు 49 గ పునర్ముద్రణ జరిగి ఏప్రిల్ 2019లో అందుబాటులోనికి వచ్చిన ముచ్చటైన మూడు పుస్తకాలు ఇవి.

1. కాళిదాసు ఋతు సంహారం - తెలుగు అనువాదం : గొట్టు ముక్కల రాధాకృష్ణరావు, తొలిముద్రణ 1953. మలి ముద్రణ : ఏప్రిల్ 2019. వెల రు : 20లు.

కవికుల గురువు కాళిదాసు సంస్కృతంలో రాసిన కేవల శబ్దానువాదంగా కాకుండా భావానువాదం చేసారు రాధాకృష్ణ కవి. సాధారణంగా ప్రాచీన కావ్యాలలో ఆయా కథా సందర్భాన్ని బట్టి ఋతువుల వర్ణన జరుగుతుంది. అటువంటిది ఋతు ధర్మాన్ని అనుసరించి ప్రకృతిలో కలిగే పరిణామాలు, ఆయా ఋతువులలో పశు పక్ష్యాదులలో, మానవులు పొందే అనుభూతులన్నిటినీ ఒకే ఒక కావ్యంలో వర్ణించాడు.

2. రాఘవరెడ్డి రచనలు : గార్లపాటి రాఘవరెడ్డి - తొలి ముద్రణ 1963. మలిముద్రణ : ఏప్రిల్ 2019, వెల: రు.30లు.

గార్లపాటి రాఘవరెడ్డి కథలు, పాటలు, వ్యాసాలు మొ॥ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసినా, కవిగా, శతక కర్తగా విశేషమైన ప్రశంసలు పొందారు. రాఘవరెడ్డి కవిత ధారాశుద్ధి కలిగి, వాడుక పదాలు, సామెతలు, తెలుగు జాతీయాలు కలగలిసి ఉంటుంది. అంతర్లీనంగా వారి కవితలో జీవయాత్ర, సామాజిక స్పృహ మనకు గోచరమౌతాయి.

3. పసిడి మువ్వలు - పారాణి, నటరాజ రామకృష్ణ, తొలి ముద్రణ 1967. మలి ముద్రణ : ఏప్రిల్ 2019, వెల : రు.90లు.

పద్మశ్రీ, భారత కళాప్రపూర్ణ డా॥ నటరాజ రామకృష్ణ ప్రసిద్ధ నాట్యాచార్యుడు. పేరిణి శివతాండవము, నవ జనార్దనం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని వెలుగులోకితెచ్చి జాతీయంగా అంతర్జాతీయంగా భారతీయ నాట్యకళకు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి నార్జించారు. నాట్య గ్రంథాల రచన చిన్నతనం నుండీ మొదలు పెట్టి 40 కి పైగా రచనలు చేశారు. ఈ మూడు పుస్తకాలు దొరుకు చోటు: తెలుగు సాహిత్య అకాడమి, కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500004. ఫోన్:040-29703142

భాగవత కథాతత్త్వం

రచన : కపిలవాయి లింగమూర్తి
వెల : రు. 300/-
ప్రతులకు : కపిలవాయి అశోక్‌బాబు
ఇం.నెం. 17-110, వాణీ సదనం
విద్యానగర్ కాలనీ
నాగర్ కర్నూలు - 509 209
సెల్ : 87907 27772



ప్రముఖ కవి, శతక, సంకీర్తన, వచన, గేయ, ఆధ్యాత్మిక, చారిత్రక మొ॥ అన్ని సాహిత్య ప్రక్రియలలో శతాధికంగా రచనలు చేసి, భారతీయ సంస్కృతికి పరిరక్షకుడుగా నిలచిన డా॥ కపిలవాయి లింగమూర్తి 1988లో 'భాగవత కథా తత్త్వం' రచించారు. 1990 ప్రాంతంలో మొదటి ముద్రణ, యిప్పుడు 30 సం॥ల తర్వాత ద్వితీయ ముద్రణ జరిగింది.

బమ్మెర పోతన రాసిన శ్రీమహాభాగవతం తెలుగువారి దైనందిన జీవితంతో పెనవేసుకుపోయిన కావ్యం. ఇందులో ప్రధానంగా మూడు లక్షణాలున్నాయి. ఒకటి భక్తి సంపద, రెండవది వేదాంత విస్తరణ, మూడవది రస నిర్భరమైన కవిత్వము. తత్త్వ విషయాలను వేదాంత చర్చలను కూడా పోతన సర్వజన సులభముగా రచించారన్నది పండితుల మాట. ఈ తత్త్వ విషయాలను ప్రధాన వస్తువుగా స్వీకరించి, భాగవతంలోని పది కథల అంతస్తత్త్వ వివేచన చేసి, వాటికి వ్యావహారికమైన వివరణ చేసారు లింగమూర్తి.

పుట్టుకతో శైవుడయిన పోతన ఎంతటి భక్తుడో అంతటి తాత్త్వికుడు కాబట్టి గజేంద్రునిలో లీనమై ఈశ్వర స్తుతి చేశాడని పేర్కొన్నారు. 'వామన చరిత్ర' లో పోతనగారు, విరాడ్రూపం దర్శించిన ధన్యుడు కనుకనే వ్యాస భగవానుడు కూడ ఊహించలేని "ఇంతింతై వటుడింతయై - రవిబింబంబు సమీప" అనే అలౌకిక భావనలు ఉదయించవని శ్లాఘిస్తారు. "గోపికా గీతలు - భ్రమర గీతలు" లో పోతనగారు గోపికా గీతలను 45 పద్యాలలో, భ్రమరగీతాలను 36 పద్యాలలో శృంగారాన్ని, భక్తినీ, గోపికలు శ్రీకృష్ణునితో ఐక్యము చెందిన రీతిని, గోపికలు అనుసరించిన మార్గాన్ని గోపికా మార్గమని, దీనికి మధుర భక్తి అనే మరో పేరు ఉందని చెప్తూ సంస్కృతాంధ్ర

భాగవత తత్త్వాన్ని మార్గదర్శకం చేసేదిగా, భాగవతంలోని తాత్త్వికశక్తిని ప్రస్ఫుటం చేసేదిగా ఈ గ్రంథం రూపు దిద్దుకొంది. వేదాల తాత్త్విక రహస్యాలు సులభంగా అర్థమయ్యే పట్టికల రూపంలో ఇవ్వబడ్డాయి. భాగవతంలోని కథలను, వాటిలోని భక్తి తత్త్వాన్ని అర్థవంతంగా అందించిన రచయిత కృషి అపూర్వం అమోఘం! సాధారణ పాఠకులకు ఈ తత్త్వం అర్థం చేసుకోవటం అంత సులభం కాకున్నా, భాగవతంపై అభిమానం, అభినివేశం ఉన్నవారికి, సాహిత్య, తాత్త్విక జిజ్ఞాస కలవారికి మాత్రం అవశ్య పఠనీయ గ్రంథం యిది.

- ఎం.వి. శాస్త్రి
9441342999

ఓ సాహసి ధిక్కారమే 'మేరువు'



ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందన్నారు గురజాడ. చరిత్రను తిరగ రాయడమంటే నడుస్తున్న చరిత్రలో భాగం కావడం. అదీ సమాజాన్ని అన్ని పార్శ్వాల లోనూ ఉన్నతీకరించే సమూలమైన మార్పుకు దోహదపడే చరిత్ర. చరిత్రను సృష్టించేవారెవ్వ రైనా ఆ చారిత్రక క్రమంలో అంటే, సమా జంలో చలనాన్ని కలిగించే ఉద్యమాలలోనూ, పోరాటాలలోనూ భాగస్వాములై తీరాలి. అలాంటి ఆచరణలో నుండే ఆధునిక మహిళ తనకంటూ ఒక విలక్షణమైన స్థానాన్ని, గుర్తింపును సృష్టించుకునే దిశగా సాగిపోతూ ఆధునిక చరిత్రను తిరగరాస్తుంది.

ఇదంతా చదవడానికి, వినడానికీ తేలికయిందిగా అనిపించ వచ్చుగాని, చరిత్రలో, చారిత్రక ఉద్యమాలలో ఆచరణాత్మక భాగ స్వామి కావడం ఎవరికైనా కష్టం. అది కత్తిమీద సాములాంటిది. స్త్రీలకయితే మరీమరీ కష్టం. స్త్రీల జీవన ప్రయాణం నల్లేరు మీద బండి కాదు. చరిత్రలో భాగస్వాములవుదామనుకున్న స్త్రీలు ఎంతటి శారీరక హింసను అనుభవించాల్సి వస్తుందో, అంతకంటే తీవ్రమైన మానసిక హింసకు గురికావల్సివస్తుంది. వీటన్నింటినీ దిటవు గుండెతో, తాత్విక చైతన్యంతో ఎదుర్కొన్న ధీశాలురైన స్త్రీలు మాత్రమే చరిత్రను, గురజాడ చెప్పినట్లుగా, తిరగరాస్తారు.

అదిగో, అలాంటి ఒక సాహసి జీవిత చిత్రణే నల్లూరి రుక్మిణి నవల 'మేరువు'. ఇందులో ప్రధానపాత్ర సావిత్రమ్మ. మరోపాత్ర వెంకాయమ్మ. ఇద్దరూ రెండు భిన్నమైన కులాలకు, ప్రాంతాలకు, సామాజిక హోదాలకు, వర్గాలకు చెందినవాళ్ళు. అయితే ఆ యిద్దరి చైతన్యం మాత్రం ఒక్కటే. అందుకే వాళ్ళిద్దరూ సమాజ మార్పు కోసం జరిగిన పోరాటాలలో జీవిత కాలమంతా భాగస్వాముల య్యారు. పోరాటంలోనే జీవించి, పోరాటంలోనే మరణించారు.

రచయిత ఈ నవలలో ఉద్యమాలలో పనిచేయడానికి సిద్ధపడే స్త్రీలు ఎదుర్కొనే లింగపరమైన వివక్షతను చిత్రీకరించారు. స్త్రీలు, పురుషులతోపాటు సమంగా చైతన్యం కలిగివున్నా, వాళ్ళు ఇళ్ళల్లో కొన్ని రకాల పనులకు మాత్రమే ఎలా పరిమితమయ్యారో ఉద్యమాల్లో కూడా అలాగే పురుషులకు తోడుగా, అండగా వుంటూ, ఆ పురుషులు తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడానికి ఉపయోగపడాలన్న చూపు నిన్న మొన్నటిదాకా బలంగా వుండేది. ఈ పరిమితులేవీ మహిళ తనకు తాను విధించుకున్నవి కావు. సమా జంలో బలంగా పాతుకుపోయిన పితృస్వామిక భావజాలం వాళ్ళపై ఆ పరిమితులను విధించింది.


ఇలాంటి పరిమితులను ఛేదించుకుని, మగవాళ్ళకు దీటుగా తాముకూడా పోరాటంలోని అన్ని రంగాలలోనూ – తుపాకి పట్టుకొని దళాలలో భాగస్వాములు కావడంతో సహా– ఎంతటి కష్టతరమైన బాధ్యతనైనా నిర్వర్తించగలమని, అటు రాజ్య నిర్బంధాన్ని ఇటు సామాజిక సంకెళ్ళను తెంచుకుని సమవుజ్జీలుగా వుండగలమని సావిత్రమ్మలాంటి వాళ్ళు నిరూపించుకున్న వర్తమాన చరిత్ర ఈ నవలంతా పరుచుకొని వున్నది.

అయితే, దీనికి వాళ్ళు చెల్లించిన మూల్యం అపారమైనదీ, అంతులేనిదీ. ఒక పక్క కుటుంబంతోనూ, మరోపక్క ఉద్యమ నాయ కత్వంతోనూ, ఇంకోపక్క సమాజంతోనూ ఎదురొడ్డి నిలబడి పోరా డాల్సి వచ్చింది. అవహేళనలను, వ్యంగ్యాత్మక విమర్శలను, అయిన వాళ్ళ నుండే నిందలను, అపార్థాలను ఎదుర్కోవలసి వచ్చింది. కొత్త ఆలోచనలను అందిపుచ్చుకునే స్థితి సమాజంలో లేని వాతావరణంలో, దాని ప్రభావంలోనే రూపొందిన ఉద్యమాలు కూడా స్త్రీల పట్ల పితృస్వామిక భావజాలంతోనే ప్రవర్తించడం ఈ నవలలో మనం గమనిస్తాం. వ్యక్తుల చైతన్యం నుండి కూడా ఉద్యమాలు గ్రహించ వలసిన వాస్తవాలు వుంటాయని సావిత్రమ్మ జీవితం మనకు ఎరుక పరుస్తుంది. ఉద్యమాలలో భాగస్వాములయే స్త్రీలు జీవితంలో ఏం పోగొట్టుకుంటారో, ఏం పోగొట్టుకుని ఏం సాధిస్తారో, సమాజానికి ఏ విలువలను ఇచ్చిపోతారో ఈ నవల సమర్ధవంతంగా చిత్రీక రించింది.

అయితే 'మేరువు' కేవలం సావిత్రమ్మలాంటి వారి వ్యక్తిగత జీవన చిత్రణకే పరిమితం కాలేదు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం నుండి, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల మీదుగా, ఒక రెండు దశాబ్దాల క్రితం వరకు కోస్తా ఆంధ్రలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను కూడా ఈ నవల నమోదు చేసింది. ప్రధానంగా కృష్ణా, గోదావరి జిల్లాలలో పేద రైతులు, దళిత రైతుకూలీలు రైతుకూలీ సంఘం నేతృత్వంలో భూమిపై, పండించిన పంటపై హక్కుకోసం చేసిన పోరాటాలు, చల్లపల్లి జమీందారులాంటివాళ్ళ దౌష్ట్యానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటాలు ఈ నవలలో వివరంగా రికార్డు అయింది. ఆధునిక చరిత్రలో తెలుగు భాషా రాష్ట్రాలలో జరిగిన అన్ని ఉద్యమాలలోనూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనటం ఒక గుణాత్మక మార్పు. పురుషులతో సమంగా వాళ్ళు రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కోవడంలో చూపిన తమదైన తెగువ, చొరవ ఈ నవలలో మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. 'మేరువు' ఒక భౌగోళిక ప్రాంతానికి చెందిన సామాజిక చరిత్రకు అద్దం పట్టిన నవల. ఇలాంటి ఆలోచనతో తెలుగులో వచ్చిన అరుదైన నవలలలో 'మేరువు' ఒకటి.

('మేరువు'– నల్లూరి రుక్మిణి, ధర : రూ. 90/–, ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు మరియు నల్లూరి రుక్మిణి, సి – 132, యస్. వి. యన్. కాలని, గుంటూరు – 522006. సెల్ : 99891 33401)

– సంజన




తెలుగాంగ్ల మిశ్ర సమాస నిఘంటువు
రచన : పులికొండ సుబ్బాచారి
పుటలు:232, వెల: రు.250/
ప్రతులకు : 1.'అన్వీక్షకి పబ్లిషర్స్ ప్రై.లి. ఆజ్రా హౌస్
59/సి/డి, ఎమ్మెల్యే కాలని, బంజారాహిల్స్
హైదరాబాదు, సెల్ : 9705972222
2. నవోదయ పబ్లిషర్స్, హైదరాబాద్



నల్లగుండవే నల్లమల
ప్రచురణ : నల్లమల పరిరక్షణ కమిటి
పుటలు:96, వెల: రు.60/
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
సాహితి సర్కిల్ 402, ఘరౌండ అపార్టమెంట్స్
ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్‌గేటు, 1వ లైను,
డి.డి కాలని, హైదరాబాదు – 500007




నేను నమ్మిన దారిలో (స్వీయ జీవన రేఖలు)
రచన : మార్ని రామకృష్ణారావు
పుటలు: 184, వెల :100/-
ప్రతులకు :మార్ని రామకృష్ణారావు,
సత్యనారాయణపురం, వర్ని మండలం
నిజామాబాద్ జిల్లా – 503201
సెల్ : 9949079040



స్వేచ్ఛ నుండి విముక్తి: ఒ.యు.క్యాంపస్...ఇతర కథలు
రచన : బి.ఎస్.రాములు
పుటలు: 136, వెల :60/-
ప్రతులకు :విశాల సాహిత్య అకాడమి, 201
సులేఖ గోల్డెన్ టవర్స్,-2-186/53/5,ఆర్.కె.నగర్
బాగ్ అంబర్‌పేట, హైదరాబాదు – 500 013
సెల్ : 8331966987



యోధుడు కొండారెడ్డి (చారిత్రక నవల)
రచన : గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి
పుటలు: 80, వెల: రు.50/-
ప్రతులకు :జి.అశోక్ కుమార్ రెడ్డి, ఇం.నెం.
86-267, సోమప్ప కాలనీ, బి.క్యాంప్
కర్నూలు – 518002
ఫోన్ -9110595847



విప్లవకవి యోగి వీరబ్రహ్మం
(సామాజిక ప్రక్రమం – వీర సామాజిక రచన)
రచయిత: ఆచార్య పులికొండ సుబ్బాచారి
పుటలు:144, వెల: రు.120/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్ 27-1-54,
కారల్‌మార్క్సరోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2,
ఫోన్: 0866-2577533




అద్దంలో బౌద్ధం (విమర్శనాత్మక వాక్యం) :
రచయిత:పుప్పల నరసింహం
పుటలు:204,వెల:200/-
ప్రతులకు : జ్ఞానం పబ్లికేషన్స్ మరియు
అని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
సెల్ : 9985781799



ఇహం – పరం
రచన :కొంపల్లి వేంకట కోటిలింగం
పుటలు:80, వెల:70/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ 27-1-54,
కారల్‌మార్క్సరోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2,
ఫోన్: 0866-2577533



నిరంతర చిరునామా
రచన : డా॥ కొల్లు రంగారావు
పుటలు: 112, వెల :80/-
ప్రతులకు :శ్రీమతి కె.రమ
ఎఫ్. నెం. 204 ఎ, మైత్రి ది టౌన్
షైలి గార్డెన్స్, యాప్రాల్
సైనిక్‌పురి, హైదరాబాద్ – 500087
సెల్ : 9866266740



మహా ప్రవక్త మహమ్మద్:
(దివ్య ఖుర్ ఆన్ దివ్యానుభూతులు)
రచన : అలపర్తి పిచ్చయ్య చౌదరి
పుటలు: 100, వెల :అమూల్యం
ప్రతులకు :ఎ.పిచ్చయ్య చౌదరి జాయింట్ సెక్రటరీ,
రిటైర్డ్ ఇంటర్ విద్యామండలి, ఆం.ప్ర.
42/169, జయనగర్ కాలనీ, కడప – 516 002,
వై.యస్.ఆర్. జిల్లా. సెల్ : 9177013845





కోతి – జామచెట్టు (బాలల కథల సంపుటి)
పుటలు : 84

గౌరమ్మ గెలుపు (బాలల నవల)
పుటలు : 36

రచయిత్రి : దాసరి శివకుమారి
ప్రతులకు : శ్రీ కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి & శ్రీమతి అన్నపూర్ణదేవి ఫౌండేషన్
బోస్ రోడ్, తెనాలి – 522 201, గుంటూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్
సెల్ : 9866067664, 8247576323

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362


1970 నుండి ఆయుర్వేద ఔషధ నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన జీవక® వారి విశిష్ట ఉత్పత్తి
జీవశక్తి
17 శక్తివంతమైన మూలికల మిశ్రమం
సమగ్రమైన ఆరోగ్యానికి సకుటుంబ పానీయం
100% సహజమైనది
చురుకుదనం
వ్యాధి క్షమత్వం
బలం
శక్తి
'జీవశక్తి' శక్తివంతమైన 16 మూలికల సమ్మేళనంతో చేయబడిన విభిన్నమైన ఆరోగ్య పానీయం. శాస్త్రీయ ఆయుర్వేద సిద్ధాంతానుసారం ఆధునికంగా తయారుచేయబడిన ప్రత్యేకమైన టానిక్. సహజ పోషణను కొనసాగించటానికి దీనిలో ఉన్న శక్తివంతమైన ఔషధ గుణములు, పోలిఫెనోల్స్, అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు, సూక్ష్మపోషకాలు, స్థూల పోషకాలు మొదలగునవి సహాయపడతాయి.
'జీవశక్తి' రసాయనంగా పనిచేస్తుంది. అంటే జీవక్రియను సక్రమపరచి, సప్తధాతువుల నిర్మాణ క్రమాన్ని మెరుగుపరుస్తుంది. శరీర సహజ పోషణను మరింత శక్తివంతం చేస్తుంది. మానసిక మరియు శారీరక ఒత్తిడిని తగ్గించి పునరుత్తేజపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచి కాలుష్యపు ప్రభావంనుండి శరీరాన్ని కాపాడుతుంది.
సహజమైన పద్ధతిలో ఆరోగ్యకరమైన జీవితం యొక్క ప్రయోజనాలను పొందడానికి 'జీవశక్తి'ని ప్రతిరోజూ సకుటుంబంగా సేవించండి.
JeevaSakti
Total Health Drink for the Family
FOR NUTRITION • ENERGY • STRENGTH • SHARPNESS • IMMUNITY
Special
జీవశక్తి
Jeeva
SINCE : 1970
జీవక® ఫార్మ
ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ (భారత ప్రభుత్వం) ప్రోత్సహిస్తున్న సంస్థ
8-386, జీవక నగర్, అంగలకుదురు - 522 211.
తెనాలి. గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్
Customer Care : 94 94 88 44 22 (10 a.m. to 6 p.m.)
Good Manufacturing Practice Certification
GMP CERTIFIED
KVIC
CERTIFIED
ISO
9001:2015
COMPANY

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
January 2020 Vol :5, Issue 11 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244